# ది క్రైమ్ న్యూస్

Crime News

తెలుగు దినపత్రిక

ఆదివారం, మార్చి 01, 2026 | సంపుటి - 20 | సంచిక 171 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## మరోమారు యుద్ధమేఘాలు

- ఇరాన్‌పై ఇజ్రాయిల్ క్షిపణి దాడులు
- ప్రతిదాడులకు దిగిన ఇరాన్



టెలిఅవీవ్ : మరోమారు యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. ఇరాన్‌పై ఇజ్రాయిల్ క్షిపణ దాడులకు దిగింది. అణు ఒప్పందంపై అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ క్షిపణి దాడులకు పాల్పడింది. టెహ్రాన్ అంతటా పేలుళ్లు వినిపించాయి. దీంతో ఆ ప్రాంతంలో భారీగా పొగ వ్యాపించింది. అమెరికా సాయంతోనే ఇజ్రాయెల్ ఈ దాడులు చేసినట్లు తెలుస్తోంది.

తరువాయి 2లో

## మదీనా బస్సు ప్రమాద

# మృతులకు అండ

### వారి కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం
### 44మందికి 5 లక్షల చొప్పున సాయం అందచేత
### సచివాలయంలో బాధిత కటుఉంబాలకు నేరుగా చెక్కులు
### ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పిన సిఎం రేవంత్



మక్కా యాత్రలో జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు సీఎం రేవంత్‌రెడ్డి పరిహారం పంపిణీ చేశారు. 44 మంది మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం పంపిణీ చేశారు. గాయపడిన వారికి రూ.3 లక్షల చొప్పున సాయం అందజేశారు. గతేడాది నవంబర్ 17న మక్కా యాత్రలో జరిగిన బస్సు ప్రమాదంలో 44 మంది హైదరాబాద్ వాసులు సజీవదహనమైన విషయం తెలిసిందే. మక్కా నుంచి బయలుదేరిన బస్సు ముందు వెళ్తున్న డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. బస్సు ప్రమాదంలో 44 మంది హైదరాబాద్ వాసులు సజీవ దహనమైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి సచివాలయంలో మీడియాతో మాట్లాడారు.

హైదరాబాద్ : మదీనా ప్రమాదం గురించి తెలియగానే సహాయ చర్యలపైన కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడానని ప్రస్తావించారు. మంత్రి అజారుద్దీన్‌ను వెంటనే మదీనా పంపించానుని గుర్తుచేశారు. బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. దేశం బయట జరిగే ప్రమాదాలకు ప్రభుత్వాలు పరిహారం చెల్లించదని.. కానీ బాధితుల కుటుంబాల పరిస్థితి చూసి సహాయం ప్రకటించామని అన్నారు. నాంపల్లి అగ్నిప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలను కూడా ఆదుకున్నామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అండగా ఉంటుందనే నమ్మకాన్ని ప్రజకు కలిగించామని చెప్పుకొచ్చారు. అందుకే కుటుంబాలను సెక్రటేరియట్‌కి పిలిచి పరిహారం అందించామని వివరించారు.


తరువాయి 2లో

## ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు

### నాంపల్లి కోర్టుకు హాజరైన సిఎం రేవంత్

హైదరాబాద్ : హైదరాబాద్‌లోని నాంపల్లి ప్రజా ప్రతినిధుల కోర్టుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం హాజరయ్యారు. గతంలో నమోదైన ఎన్నికల కోడ్ ఉల్లంఘన, కోవిడ్ నిబంధనల ఉల్లంఘన కేసుల విచారణ నేపథ్యంలో న్యాయమూర్తి ఎదుట ఆయన కోర్టులో హాజరై విచారణను ఎదుర్కొన్నారు. 2019లో జరిగిన హుజూర్‌నగర్ ఉప ఎన్నికల సమయంలో ఎన్నికల ప్రచారంలో

2లో



## శారదాపీఠం ఆలయం కూల్చివేస్తే అడ్డుకుంటాం

- చట్టబద్ధంగా కేటాయించిన రెండెకరాలు లాగేసుకుంటారా
- దేవాలయాలు, మఠాలను మింగాలన్న ఆలోచన ఎందుకు
- కోకాపేట శారదాపీఠం భూముల స్వాధీనంపై హరీష్ ఆగ్రహం

హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇండ్లతో పాటు ఇప్పుడు దేవాలయాలు, మఠాలను సైతం కూల్చేందుకు కుట్రలు చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ల హరీశ్ రావు మండిపడ్డారు.

## ఆ రిపోర్టును చెత్తబుట్టలో వేయాలి

### టీచర్‌ల జీతాలు తగ్గించాలని సూచిస్తారా
### విద్యారంగ అభ్యున్నతికి ఒక్క సిఫార్స్ ఏదీ
### సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ బండి సంజయ్



హైదరాబాద్ : ఇటీవల సిఎం రేవంత్‌కు సమర్పించిన విద్యా కమిషన్ రిపోర్టును చెత్తబుట్టలో వేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఎద్దేవా చేశారు. విద్యారంగ అభ్యున్నతి కోసం సిఫారసులేవని ప్రశ్నించారు. టీచర్ల జీతాలను తగ్గించాలని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. ఈ మేరకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యావేత్తలు లేని విద్యా కమిషన్ ఇదని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో బండి సంజయ్ మాట్లాడారు. అర్బన్ నక్సలైట్ ఆధ్వర్యంలో వేసిన కమిషన్‌కు విలువేముందని నిలదీశారు. విద్యాశాఖకు మంత్రి లేరనే విషయాన్ని కూడా గుర్తించని కమిషన్ ఎందుకని బండి సంజయ్ ప్రశ్నల వర్షం కురిపించారు.

తరువాయి 2లో

## మరోమారు భగ్గుమన్న

# పుత్తడి ధరలు

### పెళ్లిళ్ల సీజన్ కావడంతో సామాన్యుల బెంబేలు

న్యూఢిల్లీ : దేశంలో బంగారం, వెండి ధరలు సామాన్యుల అంచనాలకు అందని విధంగా మారుతున్నాయి. రెండు రోజుల పాటు దాదాపు స్థిరంగా కొనసాగిన ధరలు శనివారం ఒక్కసారిగా భగ్గుమన్నాయి. దేశంలో బంగారం ధర సగటున రూ.3 వేల మేర పెరగ్గా వెండి ధర కూడా చెప్పుకోదగ్గ స్థాయిలోనే ఎగబాకింది.

తరువాయి 2లో



## రాష్ట్రంలో హెచ్‌పీవీ

# వ్యాక్సినేషన్ డ్రైవ్

### కింగ్ కోఠి ఆస్పత్రిలో ప్రారంభించిన మంత్రి దామోదర
### ఆడపిల్లలను క్యాన్సర్ బారినుంచి రక్షించే ప్రక్రియ
### తల్లిదండ్రులు ఇందుకు ముందుకు రావాలన్న మంత్రి దామోదర

హైదరాబాద్ : హైదరాబాద్ కింగ్ కోఠి హాస్పిటల్‌లో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ డ్రైవ్‌ను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శనివారం ప్రారంభించారు. వ్యాక్సిన్ వేయించుకున్న బాలికలకు మంత్రి వ్యాక్సినేషన్ సర్టిఫికెట్లను అందజేసారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. నేటి నుంచి 3 నెలల వరకూ వ్యాక్సినేషన్ కార్యక్రమం కొనసాగనున్నది. తొలి నెల రోజుల వరకూ ప్రభుత్వ జనరల్ హాస్పిటళ్లు, ఏరియా హాస్పిటళ్లు, కమ్యునిటీ హెల్త్ సెంటర్లలో అందుబాటులో వ్యాక్సినేషన్ ఉండనున్నది..

తరువాయి 2లో






## బాణాసంచా తయారీ కేంద్రంలో

# విస్ఫోటనం

### బాణాసంచా తయారీ కేంద్రంలో విస్ఫోటనం
### పేలుడు ఘటనలో 20మంది మృతి...పలువురికి గాయాయాలు
### సామర్లకోట సమీపంలోని వేట్ల పాలెం వద్ద ఘటన
### 5 కి.మీ వరకు పేలుడు శబ్దాలు వ్యాప్తి

కాకినాడ : కాకినాడ జిల్లాలోని సామర్లకోట మండలంలోని బాణసంచా తయారీ పరిశ్రమలో భారీ పేలుడు సంభవించింది. వేట్లపాలెం పరిధి గోదావరి కెనాల్ పక్కన ఉన్న సూర్యశ్రీ ఫైర్ వర్క్స్ కేంద్రంలో శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 20 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. భారీ ఎత్తున మంటలు ఎగసిపడడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ వ్యాపించింది. పేలుడు శబ్దాలు సుమారు 5 కిలోమీటర్ల మేర వినిపించాయని స్థానికులు తెలిపారు. శబ్దం తీవ్రతకు పక్క గ్రామంలో ఉన్న ప్రైవేటు పాఠశాలలో శ్లాబ్‌కు పగుళ్లు వచ్చాయి. సమాచారం అందుకున్న

తరువాయి 2లో

## ఎపిలో జోరుగా పెన్షన్ల పంపిణీ

### విజయనగరంలో సిఎం చంద్రబాబు హాజరు
### పాలకొల్లులో మంత్రి నిమ్మల పంపిణీ

అమరావతి : ఏపీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ శరవేగంగా సాగుతోంది. మార్చి1 ఆదివారం సెలవు కావడంతో ఒకరోజు ముందుగానే అంటే శనివారం పింఛన్లను పంపిణీ చేపట్టారు. ఉదయం 11 గంటల నాటికి సుమారు 82 శాతం మేర పింఛన్లు అందజేశారు. ప్రభుత్వం 62.76 లక్షల మంది లబ్దిదారులకు రూ. 2,725 కోట్లు విడుదల చేసింది. ఇప్పటి వరకు 51.86 లక్షల మందికి పింఛన్లు పంపిణీ అయ్యాయి. స్వర్ణవార్డు, స్వర్ణగ్రామ సిబ్బంది.. లబ్దిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి నగదుగా అందజేస్తున్నారు.

తరువాయి 2లో

## పేలుడు ఘటనపై

# చంద్రబాబు దిగ్భ్రాంతి



### సహాయక చర్యలపై అధికారులకు ఆదేశాం
### ఘటనపై మంత్రుల దిగ్భ్రాంతి..
### సిఎం ఆదేశాలతో ఘటనా స్థలికి అనిత

విజయనగరం : కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలోని బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాద ఘటనపై ఆరా తసిన సిఎం అధికారులతో మాట్లాడారు. విజయనగరం పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రికి ప్రమాద ఘటన గురించి అధికారులు తెలియజేశారు. దీంతో విజయనగరం నుంచే ఉన్నతాధికారులతో సీఎం మాట్లాడారు.

తరువాయి 2లో

# మదీనా బస్సు ప్రమాద మృతులకు అండ

ఇది ప్రజల ప్రభుత్వమని.. ఆందోళన చెందొద్దని అన్నారు. ప్రజల కష్టం, ఆనందంలో మీతో ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ ప్రభుత్వం మీది.. ఎటువంటి ఆందోళన చెందాల్సిన పని లేదు.. మీకు అండగా ఉంటామంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మదీనాలోప్రమాదఘటన తెలుసుకున్న వెంటనే మంత్రి అజహరుద్దీన్ నేతృత్వంలోని ప్రతినిధి బృందాన్ని మదీనాకుపంపామని సీఎం గుర్తు చేశారు. చనిపోయిన వారి కుటుంబ సభ్యులకుతక్షణమే పాస్‌పోర్టులు, వీసాలు ఇప్పించి మదీనాపంపించామన్నారు. అక్కడిభారత్ కాన్సులేట్, సౌదీ ప్రభుత్వంతో చర్చించి మృతిచెందిన వారి అంత్యక్రియలు జన్నతుల్బఖీలోచేయించామన్నారు. ఈ చెక్కులను ఇళ్లకు పంపించవచ్చుని.. కానీ మీ అందరితోకలవాలని... మీకు అండగాఉంటామనే భరోసాకల్పించాలనే ఉద్దేశంతోనే సచివాలయానికి పిలిపించామని సీఎం అన్నారు. ముస్లిం సోదరులతో తనకున్న అనుబంధాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తాను కొడంగల్ ఎమ్మెల్యేగా ఎన్నికైన 2009సంవత్సరం నుంచి నియోజకవర్గంలోని అయిదు మండలాల నుంచి ఒకొక్కరి చొప్పున ఏటా అయిదుగురిని తన సొంత ఖర్చులతో హజ్ యాత్రకుపంపుతున్నానని సీఎం తెలిపారు. వారిని ఎంపిక చేసే బాధ్యత స్థానిక ముస్లిం మతపెద్దలకేఅప్పజెప్పానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, ముఖ్యమంత్రి సలహాదారు వేంనరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్, హజ్కమిటీఛైర్మన్ ఖుస్రో పాషా, తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ వైస్ ఛైర్మన్ఫహీంఖురేషి, రాష్ట్ర మైనార్టీ ÷నాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ నెల ముస్లింలకు చాలా పవిత్రమైనదని..అంతా కలిసి మెలిసి ముందుకెళ్దామని పిలుపునిచ్చారు.

## మరోమారు యుద్ధమేఘాలు

ఈ దాడిని తామే చేశామని టెల్‌అవీవ్ ప్రకటించింది. శత్రు దేశం నుంచి పొంచివున్న ముప్పును తప్పించేందుకు ఈ దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి కట్జ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ నివాసం, నిఘా ప్రధాన కార్యాలయం సహా మొత్తం 30 ప్రాంతాలు లక్ష్యంగా ఈ దాడులు జరిగాయి. ఈ క్రమంలో టెల్‌అవీవ్ సైన్యం తమ దేశ ప్రజలను అప్రమత్తం చేసింది. వైమానిక దాడులు జరిగే అవకాశం ఉన్నందున దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించింది. టెల్‌అవీవ్‌తో సహా పలు ప్రాంతాల్లో సైరన్లు మోగాయి. స్కూళ్లు, కార్యాలయాలను మూసివేయాలని ఆదేశించింది. ఈ దాడుల్లో అమెరికా హస్తం కూడా ఉన్నట్లు అధికార వర్గాలను ఉటంకిస్తూ మీడియాలో కథనాలు వస్తున్నాయి. తాజా దాడుల నేపథ్యంలో పౌర విమానాలకు ఇజ్రాయెల్ తన గగనతలాన్ని మూసివేసింది. స్కూళ్లకు సెలవులు ప్రకటించింది. అటు ఇరాన్, ఇరాక్‌లు కూడా గగనతలాన్ని మూసివేస్తున్నట్లు ప్రకటించాయి. ఇరాన్‌లో మొబైల్ ఫోన్ సేవలు నిలిచిపోయాయి. ఇజ్రాయెల్‌పై ఇరాన్ కూడా ప్రతీకార దాడులు చేపట్టింది. ఇరాన్ వైపు నుంచి క్షిపణులు దూసుకెళ్లాయి. ఈ మేరకు ఆ దేశ మిలిటరీ వెల్లడించింది. ఇజ్రాయెల్–అమెరికా కలిపి కొన్నిగంటల క్రితం ఇరాన్‌పై దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ నివాసం, నిఘా ప్రధాన కార్యాలయం సహా మొత్తం 30 ప్రాంతాలు లక్ష్యంగా ఈ దాడులు జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఇరాన్‌వైపు నుంచి స్పందన వచ్చింది.

## ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు

భాగంగా, అప్పటి ఎంపీలైన రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి తరఫున భారీ ర్యాలీ నిర్వహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ర్యాలీలో సుమారు 40 కార్లు, డీజే సౌండ్ సిస్టమ్‌లతో ప్రచారం నిర్వహించారని ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. వారు ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని ఆరోపిస్తూ ఎన్నికల అధికారులు తెలిపారు. ఇక 2021లో కరోనా మహమ్మారి సమయంలో తెలంగాణ ప్రభుత్వం విధించిన కోవిడ్ నిబంధనలను పాటించకుండా ఓ పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొన్నారని కూడా రేవంత్‌రెడ్డిపై ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనకు సంబంధించి కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. కోవిడ్ సమయంలో ప్రజా సమావేశాలపై పరిమితులు ఉన్నప్పటికీ వాటిని ఉల్లంఘించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ రెండు ఘటనలకు సంబంధించి ఎన్నికల సంఘం అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘన, కోవిడ్ మార్గదర్శకాలు పాటించకపోవడం వంటి అంశాలపై కేసులు నమోదు చేశారు. ఈ కేసుల విచారణలో భాగంగా నాంపల్లి ప్రజా ప్రతినిధుల కోర్టు న్యాయమూర్తి ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. కోర్టు విచారణలో తదుపరి విచారణ తేదీని నిర్ణయించే అవకాశం ఉంది. కేసుల విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో రాజకీయంగా కూడా ఈ అంశం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రేవంత్ రెడ్డి కోర్టుకు హాజరుకావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల సమయంలో జరిగిన ప్రచారం, కోవిడ్ సమయంలో జరిగిన సమావేశాలకు సంబంధించి చట్టపరమైన పక్రియ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

## పేలుడు ఘటనపై చంద్రబాబు దిగ్భ్రాంతి



ప్రమాదానికి కారణాలు... ప్రస్తుతం అక్కడ అందుతున్న సహాయక చర్యలపై ఆరా తీశారు. ప్రమాదం జరిగిన సూర్య ఫైర్ వర్క్సలో 20 మంది వరకు పని చేస్తున్నారని అధికారులు తెలియజేశారు. బాణసంచా తయారీదారులు ప్రాణాలు కోల్పోవడంపై ముఖ్యమంత్రి విచారం వ్యక్తం చేశారు. మంత్రులు, ఉన్నతాధికారులు ఘటనాస్థలానికి వెళ్లాల్సిందిగా సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రమాదంపై సామాజిక మాధ్యమం ఎక్స్‌లోనూ స్పందించారు సీఎం. బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు ఘటన తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. ఈ ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. బాధితులకు అవసరమైన తక్షణ సాయం అందించాలని ఆదేశించామని చెప్పారు. సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నామని.. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. బాధితులకు అవసరమైన తక్షణ సాయం అందించాలని అధికారులను ఆదేశించామన్నారు. ఘటనాస్థలంలో అధికారులు సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. పేలుడు ఘటనలో బాధిత కుటుంబాలను ఆదుకుంటామని చంద్రబాబు తెలిపారు. బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు ఘటనపై హోం మంత్రి అనిత స్పందించారు. కార్మికుల మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. విజయనగరం జిల్లా చీపురుపల్లిలో సీఎం పర్యటన సందర్భంగా అక్కడ ఉన్న ఆమె.. హుటాహుటీన సంఘటన స్థలికి బయల్దేరి వెళ్లారు. కాకినాడ జిల్లా కలెక్టర్, ఎస్పీతో ఎప్పటికప్పుడు మాట్లాడి ఘటనపై ఆరా తీశారు. బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు సమాచారం తెలిసి తీవ్ర దిగ్భ్రాత్రికి గురయ్యాను. పలువురు మృత్యువాత పడటం మాటలకు అందని విషాదం. మృతులకు నివాళు లు అర్పిస్తున్నాను. మృతుల కుటుంబాలను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుంది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తాం అని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. పేలుడు ఘటనపై ఇంఛార్జి మంత్రి నారాయణ తీవ్ర దిగ్భ్రాత్రి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఘటనకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అత్యవసర చికిత్స అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఘటనాస్థలికి వైద్యులను పంపించి తక్షణ వైద్యసాయం అందించాలని ఆదేశించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

## ఎపిలో జోరుగా పెన్షన్ల పంపిణీ

అసలే పెళ్లిళ్ల సీజన్ కావడంతో సామాన్యులకు ధరలు కంగారు పెట్టిస్తున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, శనివారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర రూ.1,64,730లకు చేరుకుంది. నిన్నటి ముగింపు ధరతో పోలిస్తే ఏకంగా రూ.3,160ల మేర పెరిగింది. ఇక 22 క్యారెట్ పసిడి ధర కూడా రూ.2,900ల మేర పెరిగి రూ.1,51,000లకు చేరుకుంది. నగరంలో వెండి ధర కూడా రూ.5 వేల మేర పెరిగింది. ప్రస్తుతం కిలో వెండి రూ.3 లక్షలుగా ఉంది. చెన్నైలో 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర గరిష్ఠంగా రూ.1,65,820కు చేరింది. ముంబై, కర్ణాటక, బెంగళూరు నగరాల్లో మేలిమి బంగారం ధర రూ.1,64,730గా ఉంది. ఢిల్లీలో రూ.1,64,880ల వద్ద కొనసాగుతోంది. ఇక 22 క్యారెట్ ఆర్నమెంటల్ బంగారం ధర (10 గ్రాములు) చెన్నైలో రూ.1,52,000గా, ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో రూ.1,51,000 వద్ద కొనసాగుతోంది. నగరాల వారీగా వెండి ధరలను పరిశీలిస్తే.. చెన్నైలో కిలో వెండి ప్రస్తుతం రూ.3 లక్షలకు చేరుకుంది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో రూ.2.95 లక్షల వద్ద కొనసాగుతోంది.

## రాష్ట్రంలో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ డ్రైవ్

తర్వాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ అందుబాటులోకి రానున్నది. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ ఈ రోజు మనం ఆరోగ్య రంగంలో ఒక చారిత్రాత్మక ఘట్టాన్ని ఆవిష్కరించుకున్నాం అన్నారు. ఆడబిడ్డల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఒక బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టుకున్నాం అన్నారు. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, కాలుష్యం వంటి అనేక కారణాల వల్ల దేశవ్యాప్తంగా క్యాన్సర్ మహమ్మారి కోరలు చాస్తోంది.దురదృష్టవశాత్తు, మన రాష్ట్రంలో కూడా ఏటా 55,000 నుండి 60,000 క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయి. రాబోయే ఐదేళ్లలో ఈ సంఖ్య మరో 10శాతం పెరుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి మన ప్రభుత్వం ఒక సమగ్ర క్యాన్సర్ పాలసీని రూపొందించింది. కేన్సర్ వైద్య సేవలు కేవలం హైదరాబాద్ కే పరిమితం కాకుండా, ములుగు, ఆదిలాబాద్ వంటి మారుమూల జిల్లాల్లో కూడా ఇప్పుడు కీమోథెరపీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చాం. ప్రతి జిల్లాలో డే కేర్ క్యాన్సర్ సెంటర్లను ఏర్పాటు చేశాం. వ్యాధిని ముందే గుర్తించడానికి మొబైల్ స్క్రీనింగ్ యూనిట్స్ అందుబాటులోకి తీసుకొస్తున్నాం. ఆరోగ్య మహిళ క్లినిక్‌ల ద్వారా మహిళలకు విస్తృతంగా పరీక్షలు నిర్వహిస్తున్నాం. త్వరలోనే క్యాన్సర్‌ను నోట్గి÷బుల్ డిసీజ్‌గా ప్రకటించి, వ్యాధి నియంత్రణకు మరింత పకడ్బందీ చర్యలు తీసుకోబోతున్నాం. కేన్సర్ చికిత్సా రంగంలో ప్రఖ్యాతిగాంచిన డాక్టర్ నోరి దత్తాత్రేయుడు గారిని సలహాదారుగా నియమించు కుని, ఆయన సలహాలు, సూచనలతో కేన్సర్ కట్టడికి అనేక చర్యలు తీసుకుంటున్నాం. దేశంలో మహిళల్లో వచ్చే క్యాన్సర్లలో సర్వైకల్ కేన్సర్ రెండవ స్థానంలో ఉంది.మన రాష్ట్రంలో ఏటా సగటున 3,200 మంది మహిళలు ఈ క్యాన్సర్ బారిన పడుతున్నారు. ప్రపంచంలో ముందస్తుగా నివారించగలిగే ఏకైక క్యాన్సర్ ఇదే. ఈ క్యాన్సర్ 99.7శాతం మంది పేషెంట్లకు హ్యూమన్ పాపిలోమా అనే వైరస్ వల్లే వస్తుంది. ఆ వైరస్‌ను అంతం చేయడానికే... ఈ రోజు కేంద్ర ప్రభుత్వ సహకారంతో, రాష్ట్రవ్యాప్తంగా వ్యాక్సినేషన్ డ్రైవ్ మనం ప్రారంభించుకున్నాం. ఈ డ్రైవ్‌లో భాగంగా, 14 ఏళ్లు నిండి, 15 ఏళ్లు లోపు ఉన్న బాలికలందరికీ మనం వ్యాక్సిన్ వేయబోతున్నాం. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3.5 నుండి 4 లక్షల మంది బాలికలకు రాబోయే 3 నెలల్లో వ్యాక్సిన్ ఇవ్వడం జరుగుతుంది. బయట ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఈ 'గార్డాసిల్' వ్యాక్సిన్ ఒక్క డోసు వేసుకోవాలంటే 3,000 నుండి 4,000 రూపాయలు అవుతుంది. కానీ, ప్రభుత్వం దీనిని పూర్తిగా ఉచితంగా అందిస్తోంది. త్వరలోనే పీహెచ్‌సీల్లో కూడా అందుబాటులోకి తీసుకొస్తాం. తల్లిదండ్రులందరికీ నా విజ్ఞప్తి. మీ ఇంట్లో 14 ఏళ్ల ఆడబిడ్డ ఉంటే, వెంటనే ముందుకు వచ్చి ఈ టీకా ఇప్పించండి.మన ఆడబిడ్డల భవిష్యత్తును, తద్వారా తెలంగాణ భవిష్యత్తును కాపాడుకుందాం అని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. కార్యక్రమంలోహెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

### శారదాపీఠం ఆలయం

## కూల్చివేస్తే అడ్డుకుంటాం

కోకాపేట్ నియోపోలిస్‌లోని విశాఖ శారద పీఠం, రాజశ్యామల అమ్మవారి ఆలయాన్ని రెవెన్యూ, పోలీసు అధికారులు అకస్మాత్తుగా చుట్టుముట్టి ఖాళీ చేయాలంటూ భయాందోళనలకు గురిచేస్తున్న నేపథ్యంలో హరీశ్‌రావు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ఆలయాన్ని సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వినాశకాలే విపరీత బుద్ధి అన్నట్లు రేవంత్ రెడ్డి పాలన తయారైందని హరీశ్‌రావు అన్నారు. అడ్డగోలు వ్యవహారాలకు, అక్రమాలకు పాల్పడుతున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఏకంగా దేవాలయాలు, మఠాలను కూడా కూల్చే స్థాయికి దిగజారిందని విమర్శించారు. 2019లో కేసీఆర్ ప్రభుత్వంలో కోకాపేట సర్వే నెంబర్ 240లో విశాఖ శారద పీఠానికి చట్టబద్ధంగా క్యాబినెట్ ఆమోదంతో రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించామని తెలిపారు. పీఠం నిర్వాహకులు ప్రభుత్వానికి 1.05 కోట్లు చెల్లించి రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నారని పేర్కొన్నారు. అలాగే హెచ్ఎండీఏ కు రూ. 23 లక్షలు చెల్లించి అనుమతులు, విద్యుత్ కనెక్షన్ అన్నీ తీసుకున్నారని చెప్పారు. ఇక్కడ అద్భుతమైన శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారి దేవాలయం, గోశాల, నిత్య అన్నదాన సత్రం, వేద పాఠశాల నిర్మించారని అన్నారు. హైకోర్టు న్యాయమూర్తులు, అధికారుల సమక్షంలో పెద్ద స్వామిజీ చేతుల మీదుగా ప్రతిష్ఠా కార్యక్రమం జరిగిందని గుర్తుచేశారు. అప్పటి నుంచి ఇక్కడ నిత్య పూజలు జరుగుతున్నాయన్నారు. హైదరాబాద్‌లో శారద పీఠం కింద 16 దేవాలయాలు, లక్షలాది మంది భక్తులు ఉన్నారని తెలిపారు. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తా అంటూ.. కేసీఆర్ కట్టిన గుళ్లు, గోపురాలు, మఠాలను కూల్చడమేనా రేవంత్ రెడ్డి ఉద్దేశమని హరీష్ రావు మండిపడ్డారు. హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చావు, ఖమ్మంలో ఇళ్లు కూల్చి 800 మందిని రోడ్డున పడేశావు. నీ పాలనలో అంతా కూల్చడమే తప్ప, నిర్మాణం లేదా అని సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటర్ వర్క్స్ ఊఓచాః కోసం ఈ స్థలం తీసుకుంటున్నామని ప్రభుత్వం చెబుతోందని తెలిపారు. వాటర్ వర్క్స్ కట్టాలంటే ఈ దేవాలయం స్థలమే దొరికిందా.. సరిగ్గా ఈ ఆలయానికి రోడ్డు అవతలే సర్వే నెంబర్ 239, 240 లలో 17 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది కదా, వాటర్ వర్క్స్ అక్కడ కట్టుకోవచ్చు కదా అని ప్రశ్నించారు. ఆ 17 ఎకరాల భూమిని రేవంత్ రెడ్డి తన అల్లుడికి, మేనల్లుళ్లకు, వాళ్ల అనుచరులకు భాగ్యలక్ష్మి మైన్స్ అండ్ మినరల్స్ అక్రమంగా కట్టబెట్టారని తెలిపారు. సమాచార హక్కు చట్టం కింద నేనే స్వయంగా అడిగితే ప్రభుత్వం ఇచ్చిన జవాబు ఇది అని తెలిపారు.. 10 ఎకరాలు ఇస్తే వాళ్లు 17 ఎకరాలు కబ్జా పెట్టారని పేర్కొన్నారు. ఓపెన్ ఆక్షన్ వేస్తే ప్రభుత్వానికి వందల కోట్లు వచ్చేవి. కానీ లోపల లోపల నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టి ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారని మండిపడ్డారు. హెచ్ఎండీఏ నిబంధనల ప్రకారం ఓఆర్ఆర్‌కు కిలోమీటర్ లోపల ఎలాంటి క్రషర్లు ఉండకూడదు.. కానీ రేవంత్ రెడ్డి తన అల్లుడి కోసం ఇక్కడ ఏకంగా 5 రెడీమిక్స్ ప్లాంట్లు, క్రషర్లు పెట్టించారని హరీశ్‌రావు తెలిపారు. పక్కన ఉన్న బిల్డర్లంతా తన అల్లుడి దగ్గరే కంకర కొనాలని, లేకపోతే అనుమతులు ఇవ్వమని బెదిరిస్తూ దందా చేస్తున్నారని పేర్కొన్నారు. అల్లుడికి వ్యాపారం చేసుకోవడానికి 17 ఎకరాలు ఇస్తావు కానీ.. హిందూ ధర్మాన్ని ప్రచారం చేసే శారద పీఠానికి ఉన్న రెండు ఎకరాలను మాత్రం లాక్కుని కూలుస్తావా అని మండిపడ్డారు. భక్తుల మనోభావాలను దెబ్బతీయడమే నీ ధర్మమా.. తక్షణమే ఆ అక్రమ క్రషర్లను క్యాన్సిల్ చేయాలని డిమాండ్ చేశారు. కనీసం నోటీసులు ఇవ్వకుండా నిన్న రాత్రి 11:30 గంటలకు వందలాది మంది పోలీసులు, ఎంఆర్వోలు వచ్చి ఆలయం వద్ద పీఠాధిపతిని, నిర్వాహకులను భయభ్రాంతులకు గురిచేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యాబినెట్ లో నిర్ణయం తీసుకునే ముందు పీఠాధిపతులతో మాట్లాడే కనీస సంస్కారం ఈ ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు. ఉదయం నేను ఇక్కడికి వస్తున్నానని తెలియగానే పోలీసులు, ఆర్ఐ, తహసీల్దార్ అందరూ పారిపోయారని హరీశ్‌రావు తెలిపారు. దొంగల్లా దాక్కోవాల్సిన అవసరం పోలీసులకు ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఉదయం స్వాములు పూజలు చేస్తుంటే పోలీసులు అడ్డుకున్నారని.. దేవాలయంలో ఏళ్ల తరబడి జరుగుతున్న పూజలను ఆపే హక్కు, ధైర్యం రేవంత్ రెడ్డికి ఎవరిచ్చారని నిలదీశారు. స్వామీజీ గారు వాగ్వాదానికి దిగాక అరగంట తర్వాత పూజకు అనుమతించారని తెలిపారు. కేసీఆర్ ఆనవాళ్లని చెప్పి రైతుబంధు, కేసీఆర్ కిట్, ఫీజు రీయింబర్స్మెంట్ బంద్ చేసినావు.. ఇప్పుడు గుళ్లను కూడా వదులుతలేవని సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు మండిపడ్డారు. దేవుని మీద పడ్డవాడు ఎవడూ బాగుపడలేదు.. నీకేదో పోయేగాలం దాపురించింది, ఆ దేవుడి శాపం నీకు తప్పక తగులుతుందని అన్నారు. క్యాబినెట్‌లో ఉన్న మంత్రి శ్రీధర్ బాబు దయచేసి ముఖ్యమంత్రిపై ఒత్తిడి తెచ్చి ఈ దేవాలయాన్ని, మఠాన్ని కూల్చకుండా కాపాడాలని కోరారు. లేనిపక్షంలో ఈ దేవాలయ పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ భక్తులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన భూమిని కాపాడుకునే బాధ్యత మాదే అని.. ఎంత దూరమైనా పోరాడుతాం తప్ప రాజశ్యామల ఆలయాన్ని కూల్చనివ్వమని స్పష్టం చేశారు.

## బాణాసంచా పేలుడు ఘటనపై మంత్రుల దిగ్భ్రాంతి

### బాధితులకు అండగా ఉంటామని ప్రకటన

### వైద్యసేవలను అందుబాటులో ఉంచాలన్న సత్యకుమార్

అమరావతి,ఫిబ్రవరి28 : కాకినాడలో జరిగిన బాణసంచా పేలుడు ఘటనపై పలువురు మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో చనిపోయిన వారికి నివాళులర్పించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రులు భరోసా ఇచ్చారు. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు ఘటనపై మంత్రి లోకేశ్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పలువురు మృత్యువాతపడటం మాటలకందని విషాదమన్నారు. మృతులకు నివాళులర్పించారు మంత్రి. మృతుల కుటుంబాలను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని.. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తామని మంత్రి లోకేశ్ తెలిపారు. వేట్లపాలెంలో బాణసంచా పేలుడు ఘటనపై మంత్రి సత్య కుమార్ యాదవ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తక్షణ వైద్య సహాయక చర్యలు చేపట్టాలని వైద్యశాఖ సెక్రటరీ, డీఎంఈ, డీఎంహెచ్ఓలకు ఆదేశాలు జారీ చేశారు. సూపర్ స్పెషాలిటీ వైద్యులు, ఇతర సిబ్బందిని సంఘటనా స్థలానికి వెంటనే పంపాలని.. అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఘటనపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాం÷–రతి వ్యక్తం చేశారు. కార్మికుల మృతి వార్తపట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఘటనా స్థలిలో సహాయక చర్యలపై ఆరా తీశారు. ప్రమాదకర యూనిట్లలో ఇలాంటి విషాదాలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన ప్రత్యేక భద్రతలు, తనిఖీలు నిర్వహించాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సూచించారు. ఘోర ప్రమాదంపై ఇన్‌ఛార్జ్ మంత్రి నారాయణ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఘటనకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అత్యవసర చికిత్స అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఘటనా స్థలానికి వైద్యులను పంపించి తక్షణ వైద్య సాయం అందించాలని ఆదేశించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి నారాయణ తెలిపారు. పేలుడు ఘటనపై హోం మంత్రి అనిత స్పందించారు. కార్మికుల మృతిపట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి నుంచి హుటాహుటిన వేట్లపాలెంలో పేలుడు ఘటన స్థలానికి హోంమంత్రి బయలుదేరారు.

## ఆ రిపోర్టును చెత్తబుట్టలో వేయాలి

చాక్ పీసులకు పైసల్లేక, స్కావెంజర్లు లేక స్కూళ్లు అల్లాడుతుంటే పరిష్కార మార్గాలు చూపరా..? అని ఫైర్ అయ్యారు.కనీస ఉత్తీర్ణత మార్కులను 35 నుంచి 45కు పెంచడం దుర్మార్గమని అన్నారు. పేద విద్యార్థులు స్కూల్ స్థాయిలోనే ఫెయిలై ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాలతో, విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలను తీసుకోకుండా రూపొందించిన ఏకపక్ష నివేదిక ఇదని ధ్వజమెత్తారు. ఉపాధ్యాయులను విద్యా కమిషన్ అవమానించిందని బండి సంజయ్ మండిపడ్డారు. స్థానిక పరిస్థితులను పట్టించుకోకుండా విదేశాల్లో తిరిగి నివేదిక ఇస్తే ఒరిగేదేముంది..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఉపాధ్యాయులారా...మీకు అండగా బీజేపీ ఉంటుందని భరోసా కల్పించారు. ఇళ్ల కూల్చివేతలో రేవంత్‌రెడ్డికి గిన్నిస్ రికార్డు ఖాయమని ఎద్దేవా చేశారు. మావోయిస్టుల విషయంలో రేవంత్‌రెడ్డిది ద్వంద్వ వైఖరి అని ఆగ్రహించారు. అర్బన్ నక్సలైట్లను కమిటీల్లో వేస్తారని... లొంగిపోయిన మాజీలను ప్రోత్సహిస్తున్నారని బండి సంజయ్ దుయ్యబట్టారు.

## బాణాసంచా తయారీ కేంద్రంలో విస్ఫోటనం

అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలు ఆర్పేందుకు 2 ఫైర్ ఇంజిన్ల సాయంతో రంగంలోకి దిగారు. తీవ్రంగా గాయపడిన 8 మందిని అంబులెన్స్‌లో స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతుల్లో ఎక్కువ మంది మహిళలే ఉన్నట్లు సమాచారం. బాణసంచా పరిశ్రమను అడపా నాని కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. పరిమితికి మించి బాణసంచా తయారు చేయడం వల్లే ఘటన జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. పేలుడు సంభవించినప్పుడు భారీ శబ్దం వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. పేలుడు ధాటికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఐదు గ్రామాల పరిధిలో దట్టమైన పొగలు అలముకున్నాయి. పేలుడు సంభవించే ప్రాంతానికి స్థానికులు చేరుకున్నప్పటికే అందులో చిక్కుకున్న పలువురు అగ్నికి ఆహుతయ్యారు. ఘటనాస్థలిలో శరీరభాగాలు చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. కొన్ని మృతదేహాలు పూర్తిగా కాలిపోయాయి. మృతుల్లో ఇప్పటి వరకు 11 మందిని పోలీసులు గుర్తించారు. మృతులను అడబాల శ్రీను, కడింపల్లి కృపమ్మ, కడింపల్లి ధనరాజు, సాధనాల సత్యవేణి, వట్లూరి రవి, మందపల్లి చిన్ని, నిమ్మద కరుణ, గంపల మంగ, గొడతా మహేశ్, గొడతా రాము, గొడతా నానిగా పోలీసులు పేర్కొన్నారు. ఇంకా కొద్ది మంది మృతదేహాలను గుర్తించాల్సి ఉంది. టపాసులు తయారు చేస్తుండగా ఒక్కసారిగా పేలుడు సంభవించినట్లు సమాచారం. పేలుడు ధాటికి మృతదేహాలు చెల్లాచెదురుగా పడ్డాయి. అలాగే ఈ ప్రమాదంలో అనేమంది కార్మికులకు తీవ్ర గాయాలు అయ్యాయి. పేలుడు సమయంలో మొత్తం 30 మంది కార్మికులు ఉన్నట్లు తెలుస్తోంది. భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. పేలుడుతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలముకుంది. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేసేందుకు యత్నించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. మృతుల్లో ఎక్కువమంది మహిళలు ఉన్నారు. పేలుడు శబ్దం విని స్థానికులు భారీగా అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఘటనాస్థలిలో మృతుల బంధువుల ఆర్తనాదాలు మిన్నంటాయి.

## మరోమారు భగ్గుమన్న పుత్తడి ధరలు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గం రావివలస గ్రామంలో అక్కడ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేపట్టారు. మరోవైపు పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో మంత్రి నిమ్మల రామానాయుడు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. వృద్ధురాలికి పింఛన్ అందజేసి ఆమె యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాలకు జగన్ మోహన్ రెడ్డి, వైసీపీ ఎమ్మెల్యేలు ముఖం చాటేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. అసెంబ్లీ నుంచి ఎస్కేప్, శాసనమండలికి వాకౌట్, రోడ్డుపై రప్పా రప్పా సంస్కృతి వైసీపీదని విమర్శించారు. 2029లో అధికారంలోకి వస్తే రాక్షసత్వం ప్రదర్శిస్తా మన్న వైసీపీ వ్యాఖ్యలను మంత్రి ఖండించారు. మానవత్వంతో పనిచేసే కూటమి ప్రభుత్వమా లేక రాక్షసత్వం గల వైసీపీనా అని ప్రజలు తేడా బేరీజు వేసుకోవాలన్నారు. జగన్.. ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకోకుండా తప్పిదాలు చేస్తున్నారని తెలిపారు. పురాణకాలంలో యజ్ఞాలను అడ్డుకున్న రాక్షసుల్లా నేడు అభివృద్ధిని, మంచి కార్యక్రమాలను అడ్డుకునే దుష్టశక్తిగా వైసీపీ తయారైందంటూ మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యలు చేశారు.



# ఇరాన్‌పై యుద్ధంతో క్రూడ్ ఆయిల్‌కు కొరత

## భారీగా ధరలు పెరిగే అవకాశం ఉందని వెల్లడి




న్యూఢిల్లీ,ఫిబ్రవరి28 : ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య యుద్ధం ముదురుతుండటంతో ప్రపంచవ్యాప్తంగా క్రూడ్ ఆయిల్ సెగలు రేగుతున్నాయి. ఈ యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు ఒక్కసారిగా పరుగులు తీయడం ప్రారంభించాయి. శుక్రవారం నాటి ట్రేడింగ్‌లోనే బ్రెంట్ క్రూడ్ ధర 2? మేర పెరిగి, బ్యారెల్‌కు 72.48 డాలర్ల వద్ద స్థిరపడింది. యుద్ధం గనుక మరిన్ని రోజులు కొనసాగితే.. ఈ ధర బ్యారెల్‌కు 80 డాలర్ల మార్కును దాటుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దిగుమతులపై ఆధారపడిన భారతదేశంలోని సామాన్యుడి జేబుకు చిల్లు పెట్టేలా పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలకు కారణం కానుంది. ముఖ్యంగా అంతర్జాతీయ వాణిజ్యానికి అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇప్పుడు అందరి దృష్టి నెలకొంది. ఇరాన్ ఉత్తరాన.. ఒమన్, యూఏఈ, దక్షిణాన ఉన్న ఈ సన్నని సముద్ర మార్గం ప్రపంచ చమురు సరఫరాకు గుండెకాయ లాంటిది. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అయ్యే క్రూడ్, ఒఔలో దాదాపు 20 నుంచి 30 శాతం ఈ మార్గం గుండానే రవాణా అవుతుంది. ఒకవేళ ఇజ్రాయెల్ దాడులకు నిరసనగా ఇరాన్ ఈ జలసంధిని దిగ్బంధిస్తే.. ప్రపంచ ఇంధన మార్కెట్ కుప్పకూలే ప్రమాదం ఉంది. రోజుకు దాదాపు 2 కోట్ల బ్యారెళ్ల చమురు ఈ మార్గం ద్వారానే సరఫరా అవుతుండటంతో.. సప్లై చైన్ తెగిపోయి పెట్రో ధరలు ఆకాశాన్ని తాకడం ఖాయం. భారత్ విషయానికి వస్తే.. మన దేశానికి అవసరమైన క్రూడ్ లో దాదాపు 60-70 శాతం పశ్చిమ ఆసియా దేశాల నుండే వస్తోంది. ప్రస్తుతం భారత్ ఇరాన్ నుంచి నేరుగా చమురు దిగుమతి చేసుకోకపోయినప్పటికీ.. సౌదీ అరేబియా నుంచి 13-17?, ఇరాక్ నుంచి 24?, యూఏఈ వంటి దేశాలపై ఎక్కువగా ఆధారపడుతోంది. ఈ దేశాలన్నీ చమురు రవాణాకు హోర్ముజ్ జలసంధినే వాడుతుంటాయి. ఈ నేపథ్యంలో అక్కడ యుద్ధ వాతావరణం నెలకొంటే.. రవాణా ఖర్చులు, ఇన్సూరెన్స్ ప్రీమియంలు పెరిగి దేశీయంగా పెట్రోల్, డీజిల్ లీటరు ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే ద్రవ్యోల్బణంతో ఇబ్బంది పడుతున్న సామాన్యులకు, ఇంధన ధరల పెంపు నిత్యావసర వస్తువుల రేట్లను భారీగా పెంచేస్తుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అమెరికా తన క్షిపణి దాడులను ఇరాన్ సైనిక స్థావరాలకే పరిమితం చేసినప్పటికీ.. ఇరాన్ గనుక ఆర్థికపరమైన ఒత్తిడి తెచ్చేందుకు చమురు సరఫరాను అడ్డుకుంటే పరిస్థితి చేయిదాటిపోతుంది. దాదాపు 500 బిలియన్ డాలర్ల విలువైన క్రూడ్ ట్రేడ్ ఈ చిన్న సముద్ర మార్గంపైనే ఆధారపడి ఉంది. ఇరాన్ తన సైనిక బలగాలను హోర్ముజ్ ప్రాంతంలో మోహరించడం అంతర్జాతీయ సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. చమురు ధరల పెరుగుదల వల్ల కలిగే ఆర్థిక నష్టాన్ని తగ్గించేందుకు భారత్ వంటి దేశాలు వ్యూహాత్మక చమురు నిల్వలను సిద్ధం చేసుకోవాల్సిన అత్యవసర పరిస్థితి ఏర్పడింది. ఈ ఉద్రిక్తతలు ఎన్ని రోజుల్లో తగ్గుతాయనే అంశంపై సందిగ్ధత కొనసాగుతున్న వేళ వాహనదారులు కూడా రేట్లు పెరగటానికి ముందే ఫుల్ ట్యాంక్ చేయించుకుంటే మంచిదని భావిస్తున్నారు.

# పశ్చిమాసియాకు విమానాలు నిలిపివేత

## ఎయిరిండియా,ఇండిగో సర్వీసుల రద్దు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి28 : ఇరాన్ లక్ష్యంగా ఇజ్రాయెల్-అమెరికా సంయుక్తంగా దాడులు జరుపుతుండటంతో పశ్చిమాసియా భగ్గుమంటోంది. ఇరాన్ సైతం ఇజ్రాయెల్‌తో పాటు పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ప్రతిదాడులు జరుపుతోంది. ఈ నేపథ్యంలో ఇరాన్, ఇజ్రాయెల్‌కు పలు దేశాలు తమ విమాన సర్వీసులను రద్దు చేశాయి. పశ్చిమాసియాకు విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్టు ఇండిగో, ఎయిరిండియా ప్రకటించాయి. గల్ఫ్ ప్రాంతంలో పరిస్థితుల దృష్ట్యా ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సర్వీసులను రద్దు చేసినట్టు ఆ సంస్థ ప్రతినిధి తెలిపారు. ప్రయాణికులు, సిబ్బంది భద్రత తమకు కీలకమని, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని చెప్పారు. పశ్చిమాసియాకు విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్టు ప్రకటించిన విమానయాన సంస్థల్లో ఎయిర్ ఫ్రాన్స్, ఎయిరిండియా, బ్రిటిష్ ఎయిర్ వేస్, ఐబీరియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో, జపాన్ ఎయిర్‌లైన్స్, ఎల్‌ఓటీ ఎయిర్‌లైన్స్, లుఫ్తాన్సా, నార్వేజియన్ ఎయిర్, టర్కిష్ ఎయిర్‌లైన్స్, వర్జిన్ అట్లాంటిక్, ఖతార్ ఎయిర్‌వేస్, ఎయిర్ అల్జీరియా, స్కాండెవియన్ ఎయిర్‌లైన్స్, విజ్ ఎయిర్ ఉన్నాయి. ఇరాన్ లక్ష్యంగా క్షిపణులు, బాంబులతో ఇజ్రాయెల్ శనివారంనాడు దాడులకు దిగింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో పలు ప్రాంతాలు పేలుళ్లతో దద్దరిల్లాయి. ముప్పును ముందస్తుగా నివారించేందుకు ఈ దాడులు జరిపినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఆ వెంటనే అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తగా సైనిక చర్యకు దిగిట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'గా తమ సైనిక చర్యను అమెరికా, 'ఆపరేషన్ రోరింగ్ లయన్'గా తమ సైనిక చర్యను ఇజ్రాయెల్ ప్రకటించుకున్నాయి. మరోవైపు, ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతీకార దాడులు చేపట్టింది. ఇజ్రాయెల్‌తో పాటు పశ్చిమాసియాలోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. యూఏఈ, కువైట్, ఖతర్‌లలో పేలుళ్లు వినిపించినట్టు మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. తమదేశంలోని అమెరికా నేవీ 5వ ఫ్లీట్‌పై క్షిపణి దాడి జరిపినట్టు బహ్రెయిన్ ధ్రువీకరించింది. అయితే ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో బహ్రెయిన్ బేస్ నుంచి ఇప్పటికే తమ నౌకలను అమెరికా నేవీ ఉపసంహరించుకున్నట్టు తెలుస్తోంది.

# ఇరాన్‌పై బాంబుల వర్షం

## సురక్షిత ప్రాంతానికి ఖమేనీ తరలింపు

టెహ్రాన్,ఫిబ్రవరి28 : ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా యుద్ధం మొదలుపెట్టాయి. 'ఆపరేషన్ షీల్డ్ ఆఫ్ జూడా' పేరుతో ఇజ్రాయెల్ క్షిపణులు, బాంబులతో ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై శనివారంనాడు విరుచుకుపడింది. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ కార్యాలయం సమీపంలో దాడులు జరిగాయి. ఖమేనీ, అధ్యక్ష భవనాలే టార్గెట్‌గా ఈ మెరుపు దాడులు జరిగినట్టు చెబుతున్నారు. దాడుల సమయంలో ఖమేనీ టెహ్రాన్‌లో లేరని తెలుస్తోంది. ఇప్పటికే ఆయనను సురక్షిత ప్రాంతానికి తరలించినట్టు చెబుతున్నారు. అయితే ఆయనను ఎక్కడకు తరలించారు, ఎప్పుడు తరలించారనే వివరాలు వెల్లడి కాలేదు. ఖమేని ఇరాన్ వదిలి వెళ్లాలని, లేదంటే విడిచిపెట్టేది లేదని ట్రంప్ ఇప్పటికే హెచ్చరించారు. దీంతో ఖమేనీ లక్ష్యంగానే అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులు మొదలుపెట్టినట్టు కథనాలు వెలువడుతున్నాయి. ఇరాన్‌పై అమెరికా బలగాలు పెద్దఎత్తున సైనిక చర్యకు దిగినట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇందుకు సంబంధించిన 8 నిమిషాల వీడియోను ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. వాషింగ్టన్ సైనిక చర్యను ఆయన సమర్థించుకున్నారు. ఇరాన్ పాలకుల నుంచి అమెరికా ప్రజలకు ఉన్న ముప్పును తప్పించేందుకే సైనిక చర్యలకు దిగామన్నారు. ఇరాన్ కార్యక్రమాలు అమెరికాకు, అమెరికా బలగాలకు, విదేశాల్లోని తమ స్థావరాలు, ప్రపంచంలోని తమ మిత్రదేశాలకు ముప్పుగా ఉన్నాయన్నారు. మరోవైపు, ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతీకార దాడులు చేపట్టింది. ఇజ్రాయెల్‌తో పాటు పశ్చిమాసియాలోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్టు తెలుస్తోంది. యూఏఈ, కువైట్, ఖతర్‌లలో పేలుళ్లు వినిపించినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. బహ్రెయిన్‌లోని అమెరికా నేవీ 5వ ఫ్లీట్‌పై క్షిపణి దాడి జరిపినట్టు ఆ దేశం ధ్రువీకరించింది. ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో బహ్రెయిన్ బేస్ నుంచి ఇప్పటికే తమ నౌకలను అమెరికా నేవీ ఉపసంహరించుకున్నట్టు చెబుతున్నారు. ఖతర్ రెండు ఇరాన్ క్షిపణులను అడ్డుకున్నట్టు తెలుస్తోంది.

# ప్రతి ఎన్నికల్లోనూ ప్రజలు అండగా ఉన్నారు

## ప్రజలకు మేలు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

## ఫ్యూచర్ సిటీపై దృష్టి పెట్టి పనిచేయండి

## అధికారులకు దిశానిర్దేశం చేసిన సిఎం రేవంత్

హైదరాబాద్,ఫిబ్రవరి28 : సీఎం రేవంత్‌రెడ్డి శనివారం సచివాలయంలో వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై సమావేశంలో అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. మార్చి నుంచి జూన్ వరకు 99 రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎంఓ అధికారులు పాల్గొన్నారు. మార్చి 4 న జరిగే కలెక్టర్ల సమావేశంలో అందరి పని తీరుపైన మాట్లాడుతానని అన్నారు.

# పామాయిల్ రైతులకు శుభవార్త

## టన్నుకు 21546-లకు చేరుకున్న గెలల ధర

## 15024 మంది రైతులకు రూ. 2 కోట్ల మేర అదనపు లబ్ది

## పామ్ సాగును లాభసాటిగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం

## ఆయిల్ ఫెడ్ ఫ్యాక్టరీలలో ఆధునిక యంత్రాల ఏర్పాటు

## మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి



హైదరాబాద్,ఫిబ్రవరి28 : తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నదని, రాష్ట్రంలో పంట మార్పిడి ఆవశ్యకత మరియు వంట నూనెలను డిమాండ్ ను దృష్టిలో ఉంచుకొని ఆయిల్ పామ్ సాగును రాష్ట్రంలో పెద్ద ఎత్తున్న చేపట్టడానికి ప్రభుత్వం నిర్ణయించిందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలియజేసారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటికి టన్నుకి ఆయిల్ పామ్ గెలల ధర రూ12534 /- ఉండగా ఈ నెల ఆయిల్ పామ్ గెలల ధర రూ21546/- పెరగడం తో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకొని రైతులు ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలని మంత్రివర్యులు పేర్కొన్నారు. ఆయిల్ పామ్ రైతులకు అధిక ధరలను అందించి ఆయిల్ పామ్ సాగును లాభ సాటిగా చేయటమే ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి పేర్కొన్నారు. ఆయిల్ ఫెడ్ వారి ప్రోసెసింగ్ మిల్లులలో నూనె రికవరీ శాతం మరియు ముడి పామాయిల్ అమ్మకం ధరల ఆధారంగా ప్రతి నెల ఆయిల్ పామ్ గెలల ధర నిర్ణయించడం జరుగుతుంది. అయితే తెలంగాణ ఆయిల్ ఫెడ్ ద్వారా నడపబడుతున్న అప్పరావ్ పేట మరియు అశ్వరావుపేటలోని ఆయిల్ పామ్ కర్మాగారాలలో నూతన టెక్నాలజీతో కొత్త యంత్రాలు ఏర్పాటు చేయడం మరియు ఉన్న యంత్రాలను అధునికరించడం వల్ల ఆయిల్ పామ్ గెలల నుండి వచ్చే నూనె రికవరీ శాతం టన్నుకు 20.01 శాతముకు పెరగడం వల్ల టన్నుకు ఆయిల్ పామ్ గెలల ధర పెరుగుదలతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని మంత్రివర్యులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో నిర్ణయించబడిన ఆయిల్ పామ్ గెలల ధరను ఆంధ్రప్రదేశ్ లో కూడా ఇవ్వాల్సిరావడంతో అక్కడ పామ్ ఆయిల్ రైతులకు కూడా ప్రయోజనం చేకూరుతున్నదని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 1992-93 నుంచి ఇప్పటి వరకు 2.90 లక్షల ఎకరాలను ఆయిల్ పామ్ సాగులోకి తీసుకురావడం జరిగిందని, ఈ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి 1,07,400 ఎకరాలలో 33500 మంది రైతులు ఆయిల్ పామ్ సాగు చేపట్టరని 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆయిల్ పామ్ సాగు కోసం 456 కోట్లు కేటాయించినట్లు మంత్రి పేర్కొన్నారు. వచ్చే సంవత్సరంలో మరో రెండు లక్షల ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని పేర్కొన్నారు. ప్రస్తుతం 68,600 ఎకరాల నుండి ఆయిల్ పామ్ గెలల ఉత్పత్తి జరుగుతున్నదని అన్నారు. రైతులను ఆయిల్ పామ్ సాగు వైపు ప్రోత్సహించెందుకు ఏకరాకు రూ 50918/- రాయితిని నాలుగు సంవత్సరాల కాలానికి ఇవ్వడం జరుగుతున్నదని, దీర్ఘకాలిక లాభాల నుండి ఆయిల్ పామ్ సాగు కోసం రైతులు పెద్ద ఎత్తున ఆయిల్ పామ్ సాగు చేయడానికి ముందుకు రావాలని మంత్రి కోరారు.

# ఇరాన్‌పై విరుచుకు పడుతున్న బాంబులు

## దాడిలో టాప్ కంమాండర్‌ను లేపామన్న ఇజ్రాయిల్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి28 : మిడిల్ ఈస్ట్ లో యుద్ధం తీవ్ర స్థాయికి చేరుకుంది. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ పేరుతో యుద్ధం ప్రారంభించిన ఇజ్రాయెల్, అమెరికా దళాలు.. ఇరాన్ ఆర్మీ బేస్ క్యాంపులు, కీలక నేతల ఇండ్లే లక్ష్యంగా దాడులకు దిగాయి. హోరాహోరీగా సాగుతున్న యుద్ధంలో ఇరాన్ టాప్ కమాండర్ ను లేపేసినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. శనివారం ఇజ్రాయెల్ దాడిలో.. ఇస్లామిక్ రివొల్యూషనరీ గార్డ్ కాప్స్ కమాండర్ మొహమ్మద్ పక్‌పోర్ చనిపోయినట్లు ఇజ్రాయెల్ అధికారిక మీడియా ప్రకటించింది. ఇరాన్ అత్యంత శక్తివంతుల్లో ఒకరైన పక్పోర్.. కమాండర్ గా నియమితులై 260 రోజులైనట్లు పేర్కొంది. అయితే ఇరాన్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ 2025లో అప్పటి కమాండర్ హుస్సేన్ సలామిని తొలగించిన తర్వాత, పాక్‌పూర్‌ను మేజర్ జనరల్ హోదాకు ప్రమోట్ చేశాడు. తమపై దాడికి ప్రయత్నిస్తే వెంటనే ప్రతిస్పందిస్తామని గత నెలలోనే, పక్‌పూర్ ఇజ్రాయెల్ , అమెరికాలను హెచ్చరించాడు. మేం సిద్దంగా ఉన్నాం.. ట్రిగ్గర్‌పై వేలు పెట్టి రెడీ ఉంచాం.. జస్ట్ నొక్కడమే.. అని హెచ్చరికలు జారీ చేశాడు. ఇస్లామిక్ రిపబ్లిక్ రాజకీయ వ్యవస్థను రక్షించే పనిలో, దేశ భద్రత విషయంలో విస్తృతమైన అధికారాలను కలిగి ఉంటుంది.

# యుద్ధం వేళ పలు విమానాలకు ఆటంకం

## శంషాబాద్ నుంచి పలు రూట్లలో విమానాలు రద్దు

హైదరాబాద్,ఫిబ్రవరి28 : ఇరాన్-ఇజ్రాయిల్ మధ్య నెలకొన్న యుద్ధ పరిస్థితుల వల్ల శంషాబాద్ నుంచి వెళ్లాల్సిన పలు విమానాలు రద్దయ్యాయి. ఇప్పటికే 10 విమానాలు రద్దు కావడంతో ప్రయాణికులు నిరాశగా వెనుదిరిగారు. దేశంలో ఉన్న పలు ఎయిర్ పోర్ట్‌ల నుంచి ఇరాన్ ఇజ్రాయిల్ వెళ్ళే విమానాలు రద్దు కావడం గమనార్హం. ఇప్పటికే ఇరాన్, ఇజ్రాయిల్‌లో అన్ని ఎయిర్ పోర్ట్‌లు మూసివేశారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ ఆర్మీ దాడులు చేస్తుండగా.. ఖతార్, బెహ్రాయిన్, కువైట్, యూఏఈలో ఉన్న అమెరికా ఫోర్సెస్‌పై ఇరాన్ మిస్సైల్స్‌తో విరుచుకుపడుతున్న పరిస్థితులున్నాయి. ఈ పరిస్థితుల్లో ఖతార్, కువైట్, యూఏఈ దేశాలు ఎయిర్ స్పేస్ ను క్లోజ్ చేశాయి. ఖతార్ రాజధాని నగరం దోహాలో పెద్ద ఎత్తున పేలుడు సంభవించింది. ఖతార్ డిఫెన్స్ మినిస్టీ ఈ మిస్సైల్ అటాక్?ను ధృవీకరించింది. దోహా నగరాన్ని ఇరాన్ మిస్సైల్స్ టా÷-గ్గ÷ట్ చేసినట్లు తెలిసింది. ఇజ్రాయెల్ కూడాఎయిర్ స్పేస్‌ను క్లోజ్ చేసింది. టెల్ అవీవ్ ఎయిర్ పోర్ట్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. మార్చి 7 వరకు ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్, లెబనాన్‌లోని బీరుట్, ఒమన్‌లకు విమానాలను నిలిపివేస్తున్నట్లు జర్మనీకి చెందిన విమానయాన సంస్థ లుఫ్తాన్సా తెలిపింది. శనివారం, ఆదివారం దుబాయ్‌కు బయలుదేరే విమానాలను కూడా ఈ ఎయిర్ లైన్ కంపెనీ నిలిపివేసింది.

# ఇరాన్‌లో స్కూల్‌పై బాంబు దాడి

## 40మంది మృతి చెందినట్లు సమాచారం

## చాలామందికి గాయాలు..కొందరి పరిస్థితి విషమం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి28 ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికాలుసంయుక్త దాడులతో విరుచుకుపడ్డాయి. ఈ క్రమంలోనే హార్మోజ్‌గాన్ ప్రావిన్స్‌లోని ఓ బాలికల పాఠశాలపై జరిగిన దాడిలో 40 మంది మృతి చెందినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. మరో 45 మంది గాయపడినట్లు తెలిపింది. ఇరాన్ పారామిలిటరీ 'ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్'కు ఈ ప్రాంతంలో స్థావరం ఉంది. అమెరికా, ఇజ్రాయెల్‌లు ఈ ఘటనపై ఇంకా స్పందించలేదు. సదరన్ ఇరాన్?లోని మినాబ్ సిటీలో ఉన్న ఒక ఎలిమెంటరీ గర్ల్స్ స్కూల్‌పై ఇజ్రాయెల్ బాంబులేసింది. ఈ దాడిలో 40 మంది విద్యార్థినులు చనిపోయారు. చాలా మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో కొంతమంది పరిస్థితి విషమంగా ఉంది. మినాబ్ సిటీ ఈ బాంబు దాడులతో వణికిపోయింది. మధ్యాహ్నం 2 గంటల 45 నిమిషాల సమయంలో ఈ ఘటన జరిగింది. ఇదిలా ఉండగా.. ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాలను కూడా ఇరాన్ టార్గెట్ చేసింది. సౌదీ అరేబియా, అబుదాబితో సహా 8 దేశాలపై ఇరాన్ మిస్సైల్స్‌తో అటాక్ చేస్తుండటంతో యూఏఈ, బెహ్రెయిన్, ఖతార్, జోర్డాన్, కువైట్ దేశాలు భయంతో వణికిపోతున్నాయి. బెహ్రాయిన్‌లోని అమెరికా మిలటరీ బేస్‌పై ఇరాన్ బాంబు దాడులు చేసింది. ఈ దాడి దృశ్యాలు ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారాయి. ఖతార్ రాజధాని దోహాలో కూడా రెండు ప్రాంతాల్లో పేలుళ్లు సంభవించినట్లు ఖతార్ రక్షణ శాఖ ధృవీకరించింది. ఇదిలా ఉండగా.. బెహ్రెయిన్, ఖతార్, జోర్డాన్, కువైట్ దేశాలపై ఇరాన్ అటాక్స్‌ను సౌదీ అరేబియా తీవ్రంగా ఖండించింది.

# పేలుడు ఘటన తరవాత యజమాని పరార్

కాకినాడ,ఫిబ్రవరి28 : కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో బాణసంచా పేలుడు ఘటనపై ఆర్‌డీవో మల్లిబాబు స్పందించారు. పేలుడు ఘటన తర్వాత యజమాని పరారీలో ఉన్నాడని మీడియాకు వివరించారు. ఈ ఘటనలో 15 మందికి గాయాలయ్యాయని అందులో 9 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెప్పారు. ఈ పరిశ్రమకు ఈ ఏడాది మార్చి 31 వరకు లైసెన్స్ ఉందని, మరోవైపు కాకినాడ జీజీహెచ్‌లో ఆరుగురు బాధితులు చికిత్స పొందుతున్నారు. బాధితుల్లో వేట్లపాలెం వాసి కప్పా వెంకట లక్ష్మి, పెద్దాపురం వాసి మోర్తా శ్రీను, సామర్లకోటకు చెందిన కె. శ్రీను, చిటికెల లక్ష్మి ఉన్నారు. పొలాల్లో 6 షెడ్లు వేసి బాణసంచా తయారుచేస్తున్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. పేలుడుకు ముందు కొందరు కార్మికులు భోజనం కోసం బయటకు వెళ్లారు. దీంతో వారు ప్రాణాలు దక్కించుకున్నారు. పేలుడు శబ్దానికి వేట్లపాలెం గ్రామంలో ఇళ్ల అద్దాలు పగిలిపోయాయి. వేట్లపాలెం బాణసంచా కేంద్రంలో పేలుడు ఘటన ప్రతి ఒక్కరినీ తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ప్రమాద తీవ్రత పెరగడానికి అక్కడి పరిస్థితులే కారణమని స్థానికులు చెబుతున్నారు. అతి తీవ్రస్థాయిలో విస్ఫోటనం జరగడం, రెండు గంటలపాటు పేలుళ్లు కొనసాగడంతో స్థానికులు కూడా అక్కడికి చేరుకోలేని పరిస్థితి ఏర్పడింది. చివరికి ధైర్యం చేసి కొందరు స్థానికులు పేలుడు సంభవించే ప్రాంతానికి చేరుకునే సరికే చాలా మంది అగ్నికి ఆహుతయ్యారు. శరీర భాగాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. బాణసంచా తయారీ కేంద్రం పొలాల మధ్య ఉండటంతో అక్కడికి ఫైరిరజన్, అంబులెన్స్ వెళ్లే మార్గం కూడా లేదు. వరిపొలాలు బురద మయంగా ఉండటం వల్ల వాహనాలు వెళ్లలేని పరిస్థితి తలెత్తింది. ఫలితంగా చాలా సేపటి వరకు పేలుళ్లు కొనసాగాయి. ఘటనాస్థలి వద్ద పరిస్థితి భీతావహంగా మారింది. మంటల్లో కాలిపోయి, తీవ్రంగా గాయపడిన బాధితులను అతికష్టం మీద ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం కాకినాడ జీజీహెచ్‌లో ఆరుగురు చికిత్స పొందుతున్నారు.

# మీ ప్రభుత్వంపై తిరగబడండి

## మీకు అండగా మా సైనిక శక్తి ఉంటుంది

## ఇరాన్ ప్రజలకు ట్రంప్ సందేశం

వాషింగ్టన్,ఫిబ్రవరి28 : అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై చేపట్టిన దాడులను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ధ్రువీకరించారు. ఎన్ని హెచ్చరికలు చేసినా అణుకేంద్రాల పునర్నిర్మాణం, క్షిపణులను అభివృద్ధి చేస్తుండటంతో ఇరాన్‌పై భారీ సైనిక చర్య చేపట్టామని ప్రకటించారు. ఇరాన్ ప్రజలకు బహిరంగంగా తొలిసారి కీలక సందేశం ఇచ్చారు. దశాబ్దాలుగా అణచివేతకు గురవుతున్న ఇరాన్ ప్రజలకు ఇది విమక్తి కల్పించే సందర్భమని అన్నారు. 'ఇరాన్ ప్రజలకు విముక్తి కలిగించే సందర్భం వచ్చింది. తరతరాలకు మీకు లభించే ఏకైక గొప్ప అవకాశం ఇదే కావచ్చు. అమెరికా పూర్తి సైనిక శక్తితో అండగా నిలుస్తుంది. మేము పని పూర్తి చేసే సమయానికి మీ ప్రభుత్వాన్ని మీరు స్వాధీనం చేసుకోవాలి' అని ఇరాన్ ప్రజలకు ట్రంప్ పిలుపునిచ్చారు. ఇరాన్ భద్రతా దళాలను ఉద్దేశించి మాట్లాడుతూ, తక్షణమే వారు ఆయుధాలు విడిచిపెట్టాలని, అలాచేస్తే వారికి రక్షణ కల్పిస్తామని, తిరగబడితే మరణం తప్పదని హెచ్చరించారు. ఈ చారిత్రక ఘట్టంలో ఇరాన్ ప్రజలకు అమెరికా పూర్తి సైనిక శక్తితో అండగా ఉంటుందన్నారు. గతంలో ఏ అమెరికా అధ్యక్షుడు ఈ తరహాలో స్పందించేందుకు ముందుకు రాలేదన్నారు. కాగా, 'అపరేషన్ షీల్డ్ ఆఫ్ జూడా' పేరుతో ఇరాన్‌పై ఇజ్రాయెల్ శనివారంనాడు క్షిపణి దాడులు జరిగింది. ఈ దాడులలో రాజధాని నగరమైన టెహ్రాన్‌లో పలు ప్రాంతాలు దద్దరిల్లాయి. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ కార్యాలయం సమీపంలో దాడులు జరగడంతో కలకలం రేగింది. ఇరాన్ ప్రతిదాడికి దిగొచ్చంటూ ఇజ్రాయెల్ తన పౌరులను హెచ్చరించింది. ముందస్తుగా ఇరాన్, ఇజ్రాయెల్‌లు తమ గగనతలాలను మూసివేశాయి.

# సంపాదకీయం

## చెంపదెబ్బ... గోడదెబ్బ!

దేశంలో రెండు అసాధారణమైన కేసులు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. న్యాయవ్యవస్థ గట్టిగా నిలబడేలా తీసుకున్న చర్యలు ఇప్పుడు రాజకీయ నాయకుల కళ్లు తెరిపిస్తాయా లేదా అన్నది చూడాలి. ముందుగా ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు లిక్కర్ స్కామ్‌పై ఇచ్చిన తీర్పు ఒకటయితే..ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాల్లో న్యాయవ్యవస్థపై అచ్చేసిన పాఠ్యాంశం మరొకటి. ఈ రెండు కేసుల్లో న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పులు లేదా ఆదేశాలు నేరుగా కేంద్రాన్ని ప్రశ్నించాయి. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని నిలదీసాయి. ఇంతకన్నా ఘోరం మరోటి ఉండదు. ఎందుకంటే తమ చేతుల్లో ఉన్న అధికారాన్ని గుప్పిట పెట్టుకుని దర్యాప్తు సంస్థల ద్వారా లిక్కర్ కేసును అల్లిన తీరు చూస్తే ఇడి, సిబిఐల పరువు పోయింది. సిబిఐ అధికారిపై విచారణ చేయాలని ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు జడ్జి చేసిన వ్యాఖ్యలు చూస్తే కేంద్రం సిగ్గుతో తలదించుకోవాలి. ఇక్కడ సిబిఐ ఇంత నిర్లక్ష్యంగా ఓ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసినందుకు బాధపడాలి. అంటే దాని ప్రతిష్టను అదే దిగజార్చుకుంది. కనీస సమాచారం, దానికి తగ్గ అవసరమైన సాక్ష్యాలు లేకుండా ఓ కేసును గాలిలో మేడలు కట్టినట్లుగా అల్లడం వెనక ఎంతటి నిర్లక్ష్యం ఉందో తెలియచేసింది. రాజ్యాంగ పదవిలో ఉన్న సిఎం కేజ్రీవాల్‌ను జైలులో పెట్టారు. ఉపముఖ్యమంత్రి సిసోడియాను జైలులో పెట్టారు. అంటే ఎంతటి దుర్మార్గానికి సిబిఐ, ఇడిలు ఒడిగట్టాయన్నది తెలిపోయింది. ఇదే విషయాన్ని జడ్జి ప్రశ్నించారు. నిజంగానే లిక్కర్ పాలసీ కేసు అన్నది ఓ అభూత కల్పన కేసు. అందులో ముడుపులు ముట్టాయనడానికి ఆధారాలు లేవు. ఈ కేసుతో సిబిఐ తన తీరును మార్చుకోవాలి. పక్కా సమాచారంతో కేసులను చేపట్టాలి. తద్వారా పోయిన ప్రతిష్టను ఇనుమడించేలా చేసుకోవాలి. ఇది సిబిఐ పరువే కాదు, దేశానికి సంబంధించి ప్రతిష్ట కూడా ఇందులో దాగి ఉంది. సిబిఐ సరిగా పనిచేస్తేనే, ప్రజలకు నమ్మిక ఉంటుంది. ఈ కేసులో ఆధారాలు ఉంటేనే హైకోర్టుకు వెళ్లడం మంచిది. అక్కడా భంగపడేకన్నా ఆధారాలు, సాక్ష్యాలను సేకరించాలి. ప్రాథమకి సమాచారం ఉంటేనే ముందుకు నడవాలి. రాజకీయ కక్షసాధింపులకు పాల్పడే కేసుల నుంచి సిబిఐ, ఇడిలలను దూరంగా ఉంచడం మంచిది. నిజానికి కెసిఆర్ హయాంలో జరిగిన అవినీతిపై కేసులు లేవు. జగన్ హయాంలో జరిగిన ఆర్థిక అవతవకతలపైనా కేసులు లేవు. ఇలాంటి వారి వల్ల ప్రజాధనం దుర్వినియోగం అయ్యింది. వీటిపై చర్యలు తీసుకుంటే రాష్ట్రాల్లో పాలకుల్లో భయం ఉంటుంది. ఇకపోతే మరో కేసులో సుప్రీం చీఫ్ జస్టిస్ చేసిన వ్యాఖ్యలు కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపాయి. జాతీయ, విద్యా పరిశోధన, శిక్షణ మండలి ఎన్‌సిఇఆర్‌టి ప్రచురించిన ఎనిమిదో తరగతి సాంఘికశాస్త్రంలో 'కరప్షన్ ఇన్ ది జ్యూడిషియరీ' అనే పాఠ్యాంశం తీవ్ర వివాదమైంది. సుప్రీంకోర్టు ఈ అంశాన్ని సూమోటోగా విచారణకు తీసుకోవడమే గాక.. ఆ సందర్భంగా ఆగ్రహంతో స్పందించిన తీరు, సిజెఐ చేసిన వ్యాఖ్యలు దేశాన్ని కుదిపేశాయి. 'న్యాయవ్యవస్థ అధికారాన్ని అణచివేసేలా, గౌరవాన్ని కించపర్చేలా, ఉద్దేశ్య పూర్వకంగా చేసిన కుట్రగా ఇది కనిపిస్తోంది. దీనిని పట్టించుకోకుండా వదిలేస్తే ప్రజలు, యువత మనసుల్లో న్యాయవ్యవస్థ పవిత్రత దెబ్బతినే అవకాశం ఉంది.' అని విచారణ సందర్భంగా సిజెఐ అన్న వ్యాఖ్యలు అక్షర సత్యాలు. జవాబుదారీతనం ఏర్పడేంతవరకు ఈ వ్యవహారాన్ని మేం వదలిబెట్టం. దీని వెనుక ఎవరున్నారో మేం తెలుసుకోవాలనుకుంటున్నామని సిజెఐ అనడం చూస్తుంటే..ఎంతటి నిర్లక్ష్యం ఉందో తేటతెల్లం అయ్యింది. ఈ వ్యవహారంతో కేంద్ర ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానానికి బేషరతుగా క్షమాపణలు చెప్పవలసి వచ్చింది. ఆ చాప్టర్లను ఇద్దరు వ్యక్తులు రూపొందించారని, వారు యుజిసి లేదా మరే మంత్రిత్వ శాఖతోనూ కలిసి పనిచేయడం లేదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వివరణ ఇచ్చారు.ఆ పాఠ్యాంశాన్ని ముద్రించిన ఎనిమిదో తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకాన్ని పూర్తిగా నిషేధించాలని, ఇప్పటికే ప్రచురితమైన పుస్తకాలను వెనక్కి తీసుకోవాలని ధర్మాసనం ఆదేశించడం ద్వారా ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని గట్టిగా నిలదీసినట్లు అయ్యింది. అయితే 8వ తరగతి పాఠ్యాంశం వంటిది హఠాత్పరి ణామం కాదు. గత దశాబ్ద కాలంగా ఎన్‌సిఇఆర్‌టి, ఇతర కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సంస్థల చర్యలు తరచు వివాదాస్పదంగా మారుతున్న విషయం అందరికీ తెలిసిందే! పాఠ్యాంశాల్లో కొన్ని తొలగింపులు, అర్థరహిత మైన చేర్పులతో మీడియాలో పతాక శీర్షికల్లో వస్తూనే ఉన్నాయి. ఆయా సందర్భాల్లో చరిత్రకారులు, సామాజిక శాస్త్రవేత్తలూ వాటిని ఎత్తిజూపి ప్రజలు, ప్రభుత్వ దృష్టికి తీసుకొస్తున్నారు. ఇప్పుడు నేరుగా న్యాయ వ్యవస్థనే టార్గెట్ చేయడం, సుప్రీం ధర్మాగ్రహంతో కేంద్రం ఆత్మరక్షణలో పడింది. నేరుగా ప్రధానమంత్రి కార్యాలయమే రంగంలోకి దిగి నష్ట నివారణ చర్యలు చేపట్టవలసి వచ్చింది. ఈ రెండు వ్యవహారాల్లో కేంద్రం నేరుగా దొరికి పోయింది. కేజ్రీవాల్‌ను అణచివేసే కుట్ర జరిగిందన్న ఇక్కడ తెలిసిపోయింది. అన్నా హజారే చేపట్టిన అవినీతి వ్యతిరేక ఉద్యమంలో పుట్టుకుని వచ్చిన కేజ్రీవాల్ ఢిల్లీ ముఖ్యమంత్రి అయ్యారు. పంజాబ్‌లో పాగా వేశారు. దేశంలో అనేక చోట్ల ఉనికి చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయనను అవినీతి ముద్రతో అణివేసే ప్రయత్నం జరిగిందన్న వాదనలు వచ్చాయి. తెలంగాణలో కెసిఆర్ తనయ కవితను కూడా ఇందులో చేర్చారు. నిజానికి ఈ కేసు బలంగా ఉంటే కోర్టు ఇంత తీవ్రంగా వ్యాఖ్యలు చేసివుండేది కాదు. రాజకీయంగా తీసుకునే నిర్ణయాలకు సిబిఐ, ఇటి లాంటి వ్యవస్థలను దుర్వినయోగం చేయడం తగదు. ఇప్పటికైనా కేంద్రం తగు జాగ్రత్తలు తీసుకుని ప్రజలకు మేలుజరిగే మంచి పనులపై దృష్టి సారించాలి. అక్రమార్కులపై ఉక్కుపాదం మోపాలి. అందుకు సమర్థవంతులైన అధికారులను నియమించుకోవాలి.

# పెరిగిన మిర్చి ధరలతో రైతుల్లో ఆనందం



## గతంలో ఎప్పుడూ లేనంతగా పెరిగినట్లు వెల్లడి

వరంగల్,ఫిబ్రవరి28 : మిర్చి రైతులకు మళ్లీ చాలాకాలం తరవాత మద్దతు ధరలను మించి ధరలు దక్కుతున్నాయి. ఆలస్యంగా అయినా ధరలు దక్కడంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వరంగల్ చుట్టుపక్కల రైతులు మిర్చిని నాణ్యతతో పండిస్తున్నట్లు వెల్లడించారు. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో చపాట దేశీ మిర్చి ధరలు పెరిగాయి. నాలుగు సంవత్సరాల తరువాత దేశీ మిర్చి ధరలు పుంజుకున్నాయని రైతులు అన్నారు. ఈ-నామ్ విధానంలోని ఈ-వేలంలో వ్యాపారులు క్వింటాకు గరిష్ఠంగా రూ.18,789, కనిష్ఠంగా రూ.17,521, సగటున రూ.18,489 ధరల చొప్పున ఖరీదులు చేశారు. మార్కెట్‌లో ఈ నెల మొదటివారంలో మిర్చి సీజన్ ప్రారంభం కాగా, తొలుత క్వింటాకు రూ.16,300 నుంచి రూ.16,800 వరకే సగటు ధరలు ఉన్నాయి. మార్కెట్‌కు వరుస సెలవుల అనంతరం ఈనెల 18న సగటు ధర రూ.17,011ఉండగా క్రమంగా పెరుగుతూ తాజాగా రూ.18,489కి చేరింది. ఖమ్మం, వరంగల్ మార్కెట్ల రాబడులు, కోల్డ్ స్టోరేజీల్లో ఉన్న నిల్వలు, ఇతర దేశాల ఎగుమతుల అంశాలన్నీ ఇక్కడి మిర్చి ధరలను ప్రభావితం చేస్తున్నట్లు వ్యాపారులు విశ్లేషిస్తున్నారు. 2021-22లో మిర్చి ధరలు, ముఖ్యంగా దేశీ మిర్చి ధర క్వింటాకు లక్ష రూపాయల వరకు పలికింది. ఆ తరువాత గడిచిన నాలుగేళ్లుగా రూ.30వేల నుంచి రూ.40వేలు.. తేజ, వండర్‌హాట్, యూఎస్ 341 లాంటి రకాలకు రూ.12వేల నుంచి రూ.16వేలు పలికాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. అనేక మంది రైతులు మిర్చి బస్తాలను కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకున్నారు. ప్రస్తుత సీజన్‌లో కొంత కాలంగా ధరలు పెరుగుతూ వస్తున్నాయి. శుక్రవారం వరంగల్ వ్యవసాయ మార్కెట్లో దేశీ మిర్చి క్వింటాకు రూ.50 వేలు పలికింది. జియోట్యాగింగ్ కలిగిన దేశీ మిర్చికి విదేశాలలో మంచి డిమాండ్ ఉండడంతో ఎగుమతులు చేసేందుకు వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు. కాగా, వరంగల్ వ్యవసాయ మార్కెట్లో శుక్రవారం మిర్చి ధరలు గరిష్టంగా క్వింటాకు ఈ విధంగా ఉన్నాయి. తేజ - రూ.18,700, వండర్‌హాట్ - రూ.36వేలు, దీపిక రూ.30 వేలు, యూఎస్ 341 - రూ.22.100, ఎల్లో మిర్చి (తేజ) రూ.23 వేలు, తాలు మిర్చి రూ.12వేలు ధర పలికాయి. కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం 45 మంది రైతులు 495 బస్తాల్లో తేజరకం మిర్చి విక్రయానికి తీసుకువచ్చారు,

## దేశవ్యాప్తంగా హెచ్‌పివి వేక్సినేషన్

### చీపురుపల్లి సిహెచ్‌సిలో ప్రారంభించిన చంద్రబాబు

విజయనగరం : దేశవ్యాప్తంగా హెచ్‌పివి వేక్సినేషన్ జరుగుతోన్న వేళ ఎపి రాష్ట్రంలోనూ టీకా కార్యక్రమం కొనసాగుతోంది. శనివారం విజయనగరం జిల్లాలోని చీపురుపల్లి సిహెచ్‌సిలో హెచ్‌పివి వేక్సినేషన్ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ ..గర్భాశయ కేన్సర్ రాకుండా బాలికలు ఈ వ్యాక్సిన్ వేసుకోవాలని పిలుపునిచ్చారు. ఒకసారి వ్యాక్సిన్ వేసుకుంటే జీవితాంతం రక్షణ ఉంటుందని చెప్పారు. బాలికలు, వారి తల్లితండ్రులతో మాట్లాడి యోగక్షేమాలను తెలుసుకున్నారు. చీపురుపల్లి సిహెచ్‌సి పరిశుభ్రంగా ఉందని సిఎం అభినందించారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి అనిత, వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## లండన్ అగ్నిప్రమాదంలో నిజామాబాద్ యువకుడు మృతి

నిజామాబాద్,ఫిబ్రవరి28 : లండన్‌లోని క్రొయిడాన్ ప్రాంతంలో మూడు రోజుల క్రితం జరిగిన అగ్ని ప్రమాదంలో ఎపి కి చెందిన గొంతి అభిషేక్ ప్రాణాలు కోల్పోగా, తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్న నిజామాబాద్‌కు చెందిన సాయి శ్రీకర్‌ను వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. ఒకే రూమ్‌లో ఉంటున్న వీరు ఎంబీఏ పూర్తిచేసి పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తున్నట్లు సమాచారం. అయితే, ఈ అగ్నిప్రమాదం నుంచి తప్పించుకున్న మరో విద్యార్థి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. లండన్ దుప్పాస్ హిల్స్ టెర్రాస్‌లోని రెండు అంతస్తుల నివాసంలో రెండు రోజుల క్రితం గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. గ్రౌండ్ ఫ్లోర్ నుంచి మొదటి అంతస్తుకు మంటలు, దట్టమైన పొగ వ్యాపించడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో సాయి శ్రీకర్ అవయవాలను దానం చేసేందుకు అంగీకరించినట్లు నిజామాబాద్‌లోని శ్రీనగర్ కాలనీలో నివాసముంటున్న అతడి తల్లిదండ్రులు వెల్లడించారు.

## మాజీ ఛైర్మన్ మల్లికార్జున గౌడ్ అరెస్ట్

మెదక్,ఫిబ్రవరి28 : మెదక్ మాజీ మున్సిపల్ ఛైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు మల్లికార్జున గౌడ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మున్సిపల్ ఎన్నికల మసయంలో కాంగ్రెస్ నాయకులతో పాటు ఎమ్మెల్యేపై దాడి చేసి, హత్యకు యత్నించారని ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ఇప్పటికే 13 మంది బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి సంగారెడ్డి జైలులో ఉంచగా.. తాజాగా మల్లికార్జున గౌడ్‌ను అరెస్టు చేయడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. మెదక్ పట్టణంలోని మల్లికార్జున గౌడ్ నివాసానికి శనివారం తెల్లవారుజామున భారీగా పోలీసులు మోహరించారు. ఇంట్లోకి వెళ్లి ఆయన్ను అరెస్టు చేశారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున మల్లికార్జున గౌడ్ నివాసానికి చేరుకున్నారు. బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెడుతూ అరెస్టులు చేస్తున్నారని ఈ సందర్భంగా వారు మండిపడ్డారు. దీంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలో మల్లికార్జున రెడ్డిని అరెస్టు చేసి మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## తిరుపతి ఎస్వీ జూపార్క్‌కు అరుదైన వన్యప్రాణులు

### పరస్పర మార్పిడితో జంతువుల రాక

తిరుపతి,ఫిబ్రవరి28 : తిరుపతి ఎస్వీ జూపార్కుకు త్వరలో అరుదైన వన్యప్రాణులు రానున్నాయి. విశాఖ జూపార్కు, హైదరాబాదు జూపార్కు, చెన్నైలోని క్రొకోడైల్ బ్యాంకు ట్రస్టు, గుజరాత్ రాష్ట్రం జాంనగర్‌లోని గ్రీన్స్ జువాజికల్ రెస్క్యూ అండ్ రిహాబిటేషన్ సెంటర్ నుంచి మొత్తం 61 వన్యప్రాణులు తిరుపతికి రానున్నాయి. పరస్పర వన్యప్రాణి మార్పిడి విధానం ద్వారా వీటిని తెప్పించనున్నట్లు ఇక్కడి జూ అధికారులు చెప్పారు. తిరుపతినుంచి గరియల్-2, ఇండినగ్ గౌడ్-2, జపనీస్ కోయల్ -4, మస్కోవి డెక్ -4, గే పిలికాన్ -2, వైటఖ్ ఈబీస్ 2 హైదరాబాద్ లోని నెహ్రూ జులాజికల్ పార్కుకు పంపిస్తారు. అక్కడినుంచి మగ్గర్ క్రోకోడైల్స్ -4, ఇండియన్ మౌస్ డీర్-6, రింగ్ నెక్కుడ్ పీసెంట్ -2, గో÷-డలెన్ పీసెంట్-2, సిల్వర్ పీసెంట్ -1, రెడ్ జంగిల్ ఫోవల్ -2, జంధ్యాకోనూరే 2 ఇక్కడికి రానున్నాయి. మద్రాస్ క్రొకోడైల్ బ్యాంకు ట్రస్టు నుంచి మొసళ్లు-5, ఉప్పునీటి మొసళ్లు 2, ఎల్లో అనకొండ-9 ఎస్వీ జూపార్కుకు రానున్నాయి. విశాఖలోని ఇందిరాగాంధీ జువాజికల్ పార్కు నుంచి ఒక తెల్లపుల్లి ఎస్వీ జూపార్కుకు రానుండగా ఇక్కడున్న తెల్లపులిని వారికి పంపిస్తారు. రెండు అడవికుక్కలు, ఒక తోడేలు, రెండు జింకలు, బూడిదరంగు అడవికోళ్లు రెండు విశాఖ జూకు పంపించనున్నారు. దానికి బదులుగా అక్కడి నుంచి ఒక తోడేలు, రెండు అడవికుక్కలు, రెండు అడవిపిల్లులు, రెండు నీల్‌గై, నాలుగు గ్రీన్ ఇగ్వనాలను తిరుపతి జూపార్కుకు అందజేయనున్నారు. జామ్‌నగర్‌కు తెల్లపులి ఒకటి, ఇండియన్ గౌర్ రెండు, బ్లాక్ బక్-10, సాంబార్-10, బార్కింగ్ డీర్-2, మస్క్యేడక్-2, జాగ్వర్ ఒకటి అందజేస్తారు. దీనికి బదులుగా జీబ్రాలు 4, బ్లాక్ పాంథర్ రెండు, జిరాఫీలు రెండు, జాగ్వార్లు రెండు, రెడ్ నెక్కుడు వాలాబీ నాలుగు తిరుపతి ఎస్వీ జూపార్కుకు అందజేస్తారు.

## వికారాబాద్‌లో విషాద ఘటన

### ఆత్మహత్య చేసుకున్న మహిళా కానిస్టేబుల్


వికారాబాద్,ఫిబ్రవరి28 : వికారాబాద్‌లో విషాదం నెలకొంది. పట్టణంలోని గంగారాం సాయి బాబా కాలనీలో మహిళా కానిస్టేబుల్ బలిజ దివ్య ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సాయిబాబా కాలనీకి చెందిన బసవరాజ్ హోంగార్డుగా పనిచేసి ఆరేళ్ల క్రితం మరణించాడు. అతని మూడో కుమార్తె బలిజ దివ్య 2020వ బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్. గత ఐదేళ్లుగా వికారాబాద్ జిల్లా ధారూర్ పోలీస్ స్టేషన్‌లో ఆమె విధులు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే శనివారం తెల్లవారుజామున తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బలిజ దివ్య మృతదేహం వద్ద ఒక సూసైడ్ లెటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో ప్రియమైన అమ్మ, నా కుటుంబసభ్యులు నేను ఇటువంటి నిర్ణయం తీసుకున్నందుకు నన్ను క్షమించండి. నా చావుకు ఎవరు కారణం కాదు. మెంటల్ స్ట్రెస్ తట్టుకోలేక ఈ రాంగ్ స్టెప్ తీసుకుంటున్నా. అమ్మా.. నీకు నేను భారం కాకూడదని ఈ నిర్ణయం తీసుకున్నా. నాన్న ఉంటే బాగుండే అమ్మ. నాన్న లేనందుకే నీకు ఇన్ని కష్టాలు. నన్ను క్షమించు అమ్మా' అని అందులో రాసి ఉంది. కాగా, ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బలిజ దివ్య ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మెదక్ మాజీ మున్సిపల్ ఛైర్మన్ మల్లికార్జున్ గౌడ్‌పై కక్షసాధింపు

హైదరాబాద్,ఫిబ్రవరి28 : మెదక్ మాజీ మున్సిపల్ ఛైర్మన్ మల్లికార్జున్ గౌడ్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ వరుసగా అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేయడాన్ని మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను రాజకీయంగా ఎదుర్కోలేక.. పోలీసులను అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ నాయకులు ఇలాంటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల సమయం నుంచి మల్లికార్జున్ గౌడ్‌పై కాంగ్రెస్ నాయకులు కక్షకట్టారని, ఇప్పటికే ఆయనపై నాలుగు తప్పుడు కేసులు పెట్టారని ఆ కేసుల్లో ఆయనకు హైకోర్టు స్టే ఇచ్చినా ఎలాగైనా జైలుకు పంపాలన్న దురుద్దేశంతో వెంటనే మరో కొత్త అక్రమ కేసు పెట్టి పోలీసులు అరెస్ట్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ దౌర్జన్యానికి నిదర్శనమని హరీశ్‌రావు అన్నారు. అధికార పార్టీ నాయకులకు కొమ్ముకాస్తూ చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్న పోలీసుల తీరు మారాలని మల్లికార్జున్ గౌడ్‌ను తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. అక్రమ కేసులతో ఇబ్బంది పడుతున్న ప్రతి కార్యకర్తకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

## సంసార బంధ విముక్తి

'కృష్ణుని చింతించే వాఁడు సంసారబంధం నుంచి విముక్తుడు అవుతాడ'ని పై ఉపనిషత్ వాక్యానికి భావం. కుచేలుడు దారి పొడవునా కృష్ణుడి గురించి చింతించినందుకు సంసారం బంధంగా పరిణమించిన దురవస్థ దూరమైంది. చాలినంత డబ్బు లేనప్పుడే సంసారం బంధంగా మారుతుంది కదా! కుచేలుడు గర్భ దరిద్రుడు. (గోపాలతాపిన్య ఉపనిషత్) 'కృష్ణుని చింతించే వాఁడు సంసారబంధం నుంచి విముక్తుడు అవుతాడ'ని పై ఉపనిషత్ వాక్యానికి భావం. కుచేలుడు దారి పొడవునా కృష్ణుడి గురించి చింతించినందుకు సంసారం బంధంగా పరిణమించిన దురవస్థ దూరమైంది. చాలినంత డబ్బు లేనప్పుడే సంసారం బంధంగా మారుతుంది కదా! కుచేలుడు గర్భ దరిద్రుడు. సంసారం నడవటం సాధ్యం కాలేదు. భార్య 'అపరిచితులనైనా ఆదుకునే కృష్ణ భగవానుడు మీరు అడిగితే లేదంటాడా! నిశ్చల భక్తితో సేవిస్తారే! ఎంతో కొంత సంపద అనుగ్రహించడా! ఆయన వద్దకు వెళ్లిరమ్మ'ని కోరింది. సరే మంచిదని 'ఏదో ఒక కానుక తీసుకుపోవాలి. చిన్ననాటి స్నేహితుడు కదా!' అన్నాడు. 'కృష్ణుని హోదాకు తగ్గవి ఇంట్లో ఏమీ లేవు' అంటూనే ఆమె కొన్ని అటుకులు చిరుగుల ఉత్తరీయం కొసకు ముడివేసింది. ఉత్సాహంతో కుచేలుడు ద్వారక చేరుకున్నాడు. వైభవంగా సమస్త ఐశ్వర్యాలతో తులతూగే శ్రీకృష్ణుణ్ని దర్శించుకున్నాడు. చిరిగిపోయిన దుస్తులతో, ఎముకల గూడు లాంటి శరీరంతో ఉన్న కుచేలుడిని చూసి కృష్ణుడు హంసతూలికా తల్పం పై నుంచి గబుక్కున దిగి ఎదురు వచ్చి ఎంతో ప్రేమతో కౌగిలించుకొని లోనికి తీసుకెళ్లాడు. చిన్ననాటి ముచ్చట్లు రాత్రి పొద్దుపోయే వరకు చెప్పుకొని వారిద్దరూ మురిసిపోయారు. 'నాకోసం ఏం తెచ్చావు?' అంటూ కృష్ణుడు ప్రేమతో అడిగాడు. కుచేలుడు అటుకులు ఇవ్వడానికి జంకితే గమనించి తానే అతని ఉత్తరీయపు కొస ముడి విప్పాడు.



ఆధ్యాత్మికం

# బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్

## ◆ 287వ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, కలెక్టర్ రాహుల్ శర్మ





**భూపాలపల్లి, ఫిబ్రవరి 28:(ది క్రైమ్ న్యూస్):** సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని భారత్ ఫంక్షన్ హాలులో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సంత్ సేవాలాల్ మహరాజ్ 287వ జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో పలు కీలక శాఖల్లో గిరిజన జాతి అధికారులు సేవలందించడం గర్వకారణమని పేర్కొన్నారు. జాతికి సేవ చేయడం ప్రతి ఒక్కరికి దక్కే అదృష్టమని అన్నారు. జిల్లా కేంద్రంలో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో సంత్ సేవాలాల్ మహారాజ్ బంజారా భవనం మంజూరు చేసినట్లు తెలిపారు. అవసరమైతే అదనపు నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు పూర్తి చేయుటకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంత్ సేవాలాల్ జయంతిని ప్రభుత్వ పరంగా నిర్వహించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు అభినందనలు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఆ రోజుల్లోనే బంజారా జాతికి విద్యా, విజ్ఞాన పరంగా దిశానిర్దేశం చేసిన మహనీయుడు సంత్ సేవాలాల్ మహరాజ్ అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గిరిజన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని సమగ్ర అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఎఎస్పీ నరేష్ కుమార్, ఆర్డిఓ హరికృష్ణ, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, గిరిజన సంక్షేమ అధికారి నాగ సాగర్, ఉత్సవ కమిటీ అధ్యక్షులు సంతోష్ కుమార్, కమిటీ సభ్యులు దేవన్, కౌన్సిలర్లు, గిరిజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# నారాయణ పాఠశాలలో ఘనంగా జాతీయ సైన్స్ డే వేడుకలు





**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** గోదావరిఖని మార్కండేయ కాలనీలోని నారాయణ పాఠశాలలో జాతీయ సైన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. సర్ సి.వి. రామన్ 'రామన్ ఎఫెక్ట్' కనుగొన్న రోజును పురస్కరించుకుని విద్యార్థులు వినూత్న ప్రయోగాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏజీఎం చైతన్య రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని అలవాటు చేసుకోవాలని, ప్రశ్నలు అడిగే తత్వాన్ని పెంచుకోవాలని పిలుపు నిచ్చారు. విద్యార్థులు తయారు చేసిన సోలార్ ఎనర్జీ మోడల్స్, వ్యర్థాలతో విద్యుత్ తయారీ వంటి ప్రాజెక్టులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నారాయణ పాఠశాల ప్రిన్సిపల్ ఏ రజిని మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సృజనాత్మకతను శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి "సైన్స్ ఫేర్"ను ఘనంగా నిర్వహించామనీ, ఈ కార్యక్రమంలో విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ, అంతరిక్ష పరిశోధనలు నూతన సాంకేతి కతపై అద్భుతమైన ప్రయోగాలు ప్రదర్శించారు అని అన్నారు. నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయడమే మా ఈ ప్రయత్నం. ఈ ప్రదర్శనను సందర్శించిన తల్లిదండ్రులు ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రతిభను అభినందించారు.
ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఏ. రజనీతో పాటుగా అకాడమిక్ డీన్ గర్రెపల్లి ఆంజనేయులు, ఏవో శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఇల్లందకుంటలో జిల్లా న్యాయ విజ్ఞాన సదస్సు




**ఇల్లందకుంట ఫిబ్రవరి 28 (ది క్రైమ్ న్యూస్)** : ఇల్లందకుంట మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇల్లందకుంట యందు జిల్లా న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేయడం జరిగినది. ముందుగా పాఠశాలలోని కిచెన్ గార్డెన్ సందర్శించి విద్యార్థులు సాగుచేసిన కూరగాయలు ఆకుకూరలు చూసి విద్యార్థులతో ముచ్చటించడం జరిగినది. తదుపరి పాఠశాలలో నిర్వహించిన సైన్స్ డే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ మోడల్స్ ని చూసి విద్యార్థులను అభినందించారు. కె. వీణ ప్రణతి సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ బాల బాలికలపై లైంగిక వేధింపులు జరిగినట్లయితే కంప్లైంట్ చేసినట్లయితే ఫోక్సో చట్టం ద్వారా శిక్షించబడతారని, మాదక ద్రవ్యాలు వాడకూడదని వాటిని అమ్మిన, కొన్న చట్టరీత్యా నేరమని, మైనర్ బాల బాలికలు వాహనము నడిపినట్లయితే చట్టరీత్యా నేరమని, వాహన లైసెన్స్ రావాలంటే 18 సంవత్సరాలు నిండాలని, రాష్ డ్రైవింగ్ చేయకూడదని, డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, హెల్మెట్, వాహన ఇన్సూరెన్స్ అన్ని కలిగి ఉండాలని, బాల కార్మికులు ఎక్కడైనా పనిచేసినట్లయితే వెంటనే ఫిర్యాదు చేయాలని విద్యార్థులను ఉద్దేశించి తెలియజేయడం జరిగినది. పి.బి. కిరణ్ కుమార్ సీనియర్ సివిల్ జడ్జ్, సబ్ కోర్టు హుజరాబాద్ మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న బాల బాలికలపై లేదా గ్రామంలో ఉన్నటువంటి బాలబాలికలపై మరియు మహిళలపై లైంగిక వేధింపులు జరిగినట్లయితే ఫోక్సో చట్టం ద్వారా శిక్షించబడతారని అలాగే బాల బాలికలు శ్రద్ధగా చదువుకొని చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, చెడు వ్యసనాలకు బానిస కాకూడదని, మాదకద్రవ్యాలు, లైంగిక వేధింపులు, చెడు వ్యసనాలు అలవర్చుకోకూడదని తెలియజేశారు. స్మార్ట్ ఫోన్ వల్ల అనేక నష్టాలు ఉన్నాయని ఇంస్టాగ్రామ్, ఫేస్బుక్ వాటిని ఉపయోగించకూడదని వాట్సాప్ లో వచ్చేటువంటి గుర్తు తెలియని వ్యక్తుల ద్వారా వచ్చిన ఫోన్ కాల్స్ రిసీవ్ చేసుకోకూడదని, లింకులు ఓపెన్ చేయకూడదని, ఓటీపీలు చెప్పకూడదని అలా చేసినట్లయితే మన ఫోన్ హ్యాక్ అవుతుందని మనకు సంబంధించిన బ్యాంక్ అకౌంట్, మన వివరాలు అన్నీ ఎదుటి వ్యక్తికి తెలిసిపోతాయని చాలా జాగ్రత్తగా ఉండాలని తెలియజేశారు. మీకు తెలిసిన లేదా మీ గ్రామంలో ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగినట్లయితే వెంటనే స్పందించి అట్టి వివాహాలను నిలుపు చేయడానికి ప్రయత్నించాలని మరియు పోలీస్ కి ఫిర్యాదు చేయాలని తెలియజేశారు. ఎట్టి పరిస్థితులలోనూ ఇలాంటి విషయాలను మీ స్నేహితులకు, మీ బంధువులకు ప్రోత్సహించకూడదని తెలియజేశారు. ఎస్సై క్రాంతి కుమార్ మాట్లాడుతూ ముఖ్యంగా పాఠశాల స్థాయిలో విద్యార్థులందరూ చట్టపరమైనటువంటి అంశాలను తెలుసుకొని ఉండాలని, క్రమశిక్షణగా చదువుకోవాలని, మాదకద్రవ్యాలను వినియోగించకూడదని, చెడు అలవాట్లను ఏర్పర్చుకోకూడదని ఒకవేళ మాదకద్రవ్యాలు వినియోగించినట్లయితే అట్టి వ్యక్తిని అనుమానించి లేదా ఎవరి ద్వారా అయినా తెలుసుకొని మూత్ర పరీక్ష చేసినట్లయితే 30 రోజుల వరకు కూడా అనుమానితుడి మూత్ర పరీక్షలో మాదకద్రవ్యాలు తీసుకున్నట్లయితే తెలుస్తుందని, మైనర్ విద్యార్థులు వాహనం నడపకూడదని ఒకవేళ నడిపినట్లయితే తల్లిదండ్రులపై కఠినమైన శిక్షలు ఉంటాయని, నడిపినటువంటి మైనర్ విద్యార్థికి కూడా శిక్షలు ఉంటాయని తెలియజేశారు. ఇల్లందకుంట మండల తాసిల్దార్ బి. భాస్కర్, ఇల్లందకుంట గ్రామ సర్పంచ్ దార సురేష్ లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తస్మీన్ నజ్మీన్ మరియు ఉపాధ్యాయులు కె. జయ ప్రకాష్, సిహెచ్. వేణు, ఎం. సమ్మిరెడ్డి, జి. అన్నపూర్ణ, కే. సత్యం, ఏ. సురేష్, సిహెచ్. రామకృష్ణ, రాధిక రాణి, లావణ్య , కే. శంకర్, ఎం. ఐలయ్య, డి. ఉమాదేవి, ఆర్. దేవేందర్, స్రవంతి, పరమేశ్వర్, విశ్వతేజ మరియు పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.




# నేడు ఉచిత శిక్షణ ప్రవేశ పరీక్ష

**భూపాలపల్లి, ఫిబ్రవరి -28:(ది క్రైమ్ న్యూస్):** ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగాఉన్న నిరుద్యోగులకు ఐదు నెలల ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మార్చి 1 ఆదివారం రోజున ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహన్నం వరకు హన్మకొండ సుబేదారీ లో ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల యందు ఆఫ్ లైన్ పద్దతి లో ప్రవేశ పరీక్ష నిర్వహించబడును. కావున దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ యొక్క హాల్ టికెట్ ను ˉ౦ర్బ౦ఎఎఆతీఎశ్రీవ.ఎశీ.ఱఅ వెబ్ సైటు నుండి డౌన్లోడ్ చేసుకోగలరు. హాల్ టికెట్ తో పాటు అభ్యర్థులు తమ యొక్క ఆధార్ కార్డ్ ను మరియు బ్లాక్ బాల్ పెయింట్ పెన్నును వెంట తీసుకొని ప్రవేశ పరీక్ష సెంటర్ కి గంట ముందు రాగలరు అని షెడ్యూల్డ్ కులాల ఆధ్యాయన కేంద్రం సంచాలకులు డాక్టర్ కె. జగన్ మోహన్ తెలిపినారు.

# ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత నైపుణ్య శిక్షణ

### - పరిశ్రమల శాఖ జిఎం సిద్ధార్థ



**భూపాలపల్లి, ఫిబ్రవరి - 28:(ది క్రైమ్ న్యూస్):** డిజిటల్ ఎంప్లాయ్ మెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ద్వారా నిరుద్యోగ, యువతీ యువకులకు వై ఎస్ కె ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వివిధ కోర్సులలో ఉచిత నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పరిశ్రమల శాఖ జీఎం సిద్ధార్థ తెలిపారు. సాఫ్ట్ స్కిల్ కస్టమర్ రిలేషన్షిప్ మేనేజ్మెంట్, బిజినెస్ ప్రాసెస్ మేనేజ్మెంట్, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ మరియు ఇన్సూరెన్స్ వంటి అంశాలపై ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. శిక్షణ అనంతరం జాబ్ గ్యారంటీ ఉంటుందని స్పష్టం చేశారు. కావలసిన ధృవపత్రాలు: ఆధార్, పాన్ కార్డ్, విద్యార్హత సర్టిఫికెట్ జిరాక్స్. టాస్క్ కార్యాలయం, మొదటి అంతస్తు, ఐటి టవర్, కరీంనగర్ నందు మొదటి బాచ్ 02-03-2026 నుండి 22-03-2026 వరకు జరుగనున్న ట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు క్యూ ఆర్ కోడ్ స్కాన్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు.

# రామచంద్రం కుటుంబానికి జిల్లా పార్టీ ఆర్థిక సాయం



**మానకొండూర్, ఫిబ్రవరి 28(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం కొండపల్కలలో ఇటీవల మృతి చెందిన సిపిఐ మండల కార్యదర్శి, సీనియర్ నాయకుడు కామ్రేడ్ శ్రీరాముల రామచంద్రం కుటుంబానికి పార్టీ నాయకులు పంజాల శ్రీనివాస్ జిల్లా పార్టీ తరపున పదివేల రూపాయల ఆర్థిక సాయాన్ని మండల నాయకుల ద్వారా శనివారం అందజే యించారు. సిపిఐ మండల కార్యదర్శి బండరాజి రెడ్డి, గ్రామ కార్యదర్శి ఎరబోయిన సదయ్య, శాతరాజు సంపత్, లంబు రామిరెడ్డి, గట్టు రాజయ్య ఆర్థిక సాయం అందజేసిన వారిలో ఉన్నారు.

# అలుగునూరు సిఈఓలో ఘనంగా సైన్స్ దినోత్సవం



**తిమ్మాపూర్, ఫిబ్రవరి 28(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూరు సాంఘీక సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాలలో శనివారం సైన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినిలు ఉత్సాహంగా పాల్గొని సైన్స్ కు సంబంధించి తయారు చేసిన వివిధ రకాల ప్రజెంటేషన్ల ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి.ప్రదర్శనలు వీక్షించిన జోనల్ అధికారి ప్రత్యూష విద్యార్తినిలను ప్రత్యేకంగా అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ మాధవి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు వేడుకల్లో పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



**జమ్మికుంట ఫిబ్రవరి 28 (ది క్రైమ్ న్యూస్):** జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జమ్మికుంట మండలం లోని కోరపల్లి ఉన్నత పాఠశాలలో శనివారం రోజున ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. శ్రీ నివాస్ రెడ్డి అధ్యక్షతన సివి రామన్ చిత్ర పటానికి పూలమాల అలంకరించి అందరు ఉపాధ్యాయులు పూలతో ఘనంగా నివాళులు అర్పించారు. ఇట్టి జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమానికి కోరపల్లి ప్రాథమిక పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు గుడిమిల్ల బలరాం ముఖ్యఅతిథిగా, న్యాయ నిర్ణేతగా విచ్చేసి విద్యార్థులు తయారు చేసినటువంటి ఎగ్జిబిట్లను పరిశీలించి అందులో నుండి నాలుగు ఉత్తమ ఎగ్జిబిట్లను ఎంపిక చేశారు. ప్రాధనోపాధ్యులు, ఉపాధ్యాయులు సైన్స్ ఉపాధ్యాయులను మరియు విద్యార్థులను అభి నందించారు. అనంతరం ఉత్తమ ఎగ్జిబిట్లను ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమములో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు రాజయ్య,ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు పెండెం శ్రీనివాస్, బయలాజికల్ సైన్స్ ఉపాధ్యాయులు రవి కాంత్ రాజు గైడ్ టీచర్లుగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఇదే కాటారం సబ్ కలెక్టర్ రహదారి

## ● టిఆర్ఎస్ పాలన నుంచి కాంగ్రెస్ పాలన వరకు ఇదే తంతు

**భూపాలపల్లి/కాటారం/ఫిబ్రవరి - 28:(ది క్రైమ్ న్యూస్):** కాటారం రెవెన్యూ సబ్ డివిజన్ కేంద్రంలోని సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు మార్గంలో శనివారం సైడ్ డ్రైనేజీలో కారు చిక్కుకుంది. రోడ్డు ఇరుకుగా ఉన్నందున నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడం వలన ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. అంతేగాక గతంతో పోల్చుకుంటే గత ప్రభుత్వం మిషన్ భగీరథ పేరుతో ప్రతి ఇంటికి నల్ల కనెక్షన్ కొరకు రోడ్లను పగులగొట్టి కనెక్షన్లను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే కానీ పూడ్చడం మర్చిపోయినారు. అప్పటినుండి ఇప్పటివరకు రోడ్లు గుంతలు గానే ఉన్నాయి. మిషన్ భగీరథ నీళ్లు రాకుండా ఉన్నా కానీ ఎలాగైనా బ్రతుకుదుము కానీ ఈ గుంతల వల్ల మాకు ప్రాణ నష్టాలు సంభవిస్తున్నాయని, మా వాహనాలు కూడా సైతం పాడవుతున్నాయని గ్రామస్తులు మనోవేదనకు గురవుతున్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంఏర్పడక ముందునుంచేలి ఈ సమస్యలు ఏర్పడ్డాయి. కార్యాలయం ఏర్పాటు చేసినప్పటి నుండి సబ్ కలెక్టర్, కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, డిపిఓ ఆర్డిఓ, ఎమ్మార్వో, ఎంపీడీవో, ఇలాంటి అధికారులు ఎంతోమంది వస్తుంటారు



పోతుంటారు. వీళ్లే గాక గత ప్రభుత్వాన్ని నడిపిన మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్మన్, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు మెంబర్లు, అలాగే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్, డిపిఓ, ఆర్డీవో తాసిల్దార్, ఎంపీడీవోలు. గత బి.ఆర్.ఎస్ పాలన నుంచి ప్రస్తుత పాలనలో పనిచేసే అధికారులకు రాజకీయ నాయకులకు కనబడుట లేదా? అని గ్రామ నివాసులందరూ మాట్లాడుకునే మాటలు ఇవి. అంతేగాక జడ్పీ హైస్కూల్, ప్రాథమిక స్కూల్, అంగన్వాడి స్కూల్, ఐటిఐ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూరిబా గాంధీ బాలికల హాస్టల్ మరియు స్కూలు,కళాశాల, ఎస్సీ గర్ల్స్ హాస్టల్, ఎస్టి గర్ల్స్ హాస్టల్ , స్కూలు, కళాశాల మరియు ఎస్టీ బాయ్స్ హాస్టల్, స్కూలు కళాశాల, స్కిల్ డెవలప్మెంట్ సొసైటీ, మండల ఎం ఈ ఓ ఆఫీస్, మరియు పశువుల దవాఖాన, ఇన్ని ఇన్స్టిట్యూషన్స్ మరియు విద్యార్థులు, వార్డెన్లు, టీచర్లు, లెక్చరర్ లు, ప్రిన్సిపాల్ మొత్తం కలిపి 2500 మంది విద్యార్థులు నడిచే దారి. ఈ దారి పాలకులకు కనబడటం లేదా అని ప్రశ్నిస్తున్నారు. ఉదాహరణకు ఒక వెహికల్, ఒక ఎడ్ల బండి ఎదురైనప్పుడు విద్యార్థులు గాని గ్రామస్తులు గాని వాళ్లు పడే ఆ బాధ ఏంటో గుర్తు చేసుకోవాలి. చిన్న పిల్లలయితే ఎంతోమంది కిందపడి (బురదలో) ఏడ్చుకుంట స్కూలుకు పోకుండా తిరిగి ఇంటికి పోయిన దాఖలాలు ఎన్నో చూస్తున్నామని గ్రామ ప్రజలు తెలిపారు. తక్షణమే ఈ ప్రభుత్వం రోడ్డు వెడల్పు కోసం నిధులు కేటాయించాలని కోరుతున్నారు.



# అంగన్‌వాడీ కేంద్రాలలో అక్రమ వసూళ్లు..

**జగిత్యాల( ది క్రైమ్ న్యూస్ ప్రతినిధి):** జగిత్యాల జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో గత ఆరు నెలలుగా అక్రమ వసూళ్లు జరుగుతున్నాయన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఈ మేరకు ఏ ఐ టి యు సి జిల్లా శాఖ ఫిబ్రవరి 27 న జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు సమర్పించి, తక్షణ విచారణ చేపట్టాలని డిమాండ్ చేసింది. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం సూపర్వైజర్లు, సీడీపీవోలు వివిధ పేర్లతో ఒక్కో అంగన్‌వాడీ సెంటర్ నుంచి పదివేలకు పైగా వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపించారు. "ఏ కార్యక్రమం జరిగినా ఇంత ఇవ్వాల్సిందే" అంటూ టీచర్లు, ఆయాలను ఒత్తిడికి గురిచేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. గతంలో ఆరోపణలు ఎదుర్కొని బదిలీ అయిన ఒక ఉన్నతాధికారి తన కూతురు వివాహం పేరుతో జగిత్యాల ప్రాజెక్టుల నుంచి రూ.10 లక్షలు, ధర్మపురి ప్రాజెక్టు నుంచి రూ.5 లక్షల 'టార్గెట్' పెట్టి వసూలు చేసినట్లు బాధితులు పేర్కొన్నారని ఫిర్యాదులో ప్రస్తావించారు. వేసవి సెలవుల్లో జీతాలు వచ్చాయని కారణం చూపుతూ ప్రతి సెంటర్ నుంచి టీచర్ నుంచి రూ.1000, ఆయా నుంచి రూ.500 చొప్పున రూ.1500 వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం చెల్లించిన రూ.12 వేల బిల్లులపై ప్రతీ బిల్లుకు రూ.2000 చొప్పున వసూలు చేసినట్లు కూడా పేర్కొన్నారు. అదనంగా బతుకమ్మ కార్యక్రమం పేరుతో ఒక్కో సెంటర్ నుంచి రూ.1500, దసరా మామూలు పేరుతో రూ.1000, జనవరి 1 బహుమతుల పేరుతో మరో రూ.1000 వసూలు చేసినట్లు ఆరోపించారు. డబ్బులు ఇవ్వని సిబ్బందిని బెదిరించి "టార్గెట్ చేస్తాం" అంటూ మానసిక ఒత్తిడి తెస్తున్నారని బాధితులు వెల్లడించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇంకా అర్హతలేమి ఉన్నప్పటికీ సూపర్వైజర్‌గా పనిచేస్తున్న మమతకు సీడీపీవోగా అదనపు బాధ్యతలు ఇవ్వడం వల్ల అనేక అక్రమాలు జరుగుతున్నాయని అంగన్‌వాడీ టీచర్లు ఆరోపిస్తున్నారని ఫిర్యాదులో స్పష్టం చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై జిల్లా స్థాయిలో తక్షణ విచారణ జరిపి, సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. "సిబ్బందిపై ఒత్తిడి, అక్రమ వసూళ్లు నిలువరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం" అని యూనియన్ ప్రతినిధులు హెచ్చరించినట్లు సమాచారం. పిల్లల పోషకాహారం, మహిళల ఆరోగ్యానికి సంబంధించిన కీలకమైన అంగన్‌వాడీ వ్యవస్థలో ఇలాంటి ఆరోపణలు రావడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. ఈ అంశంపై అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను సంప్రదించి



వివరణ కోరగా, ఆరోపణల్లో వాస్తవం ఉందని వారు ఒప్పుకున్నారు. అయితే తమ పేర్లు వెల్లడిస్తే సంబంధిత అధికారులు తమపై తీవ్ర పరిపాలనా వేధింపులకు పాల్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ, తమ వివరాలను గోప్యంగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. "ఇలాంటి వసూళ్లు మాకు కొత్తేమీ కాదు. చాలా కాలంగా వివిధ పేర్లతో డబ్బులు వసూలు చేస్తూ మమ్మల్ని ఒత్తిడికి గురిచేస్తున్నారు. ఇవ్వకపోతే టార్గెట్ చేస్తామని, మెమోలు ఇస్తామని, బదిలీలు చేస్తామని బెదిరింపులు వస్తుంటాయి" అని కొంతమంది సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. "మేము మా పనులు నిజాయితీగా చేస్తున్నాం. కానీ ఎప్పటికప్పుడు పై అధికారుల ఒత్తిళ్లు, డబ్బుల డిమాండ్లు మానసికంగా తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. మాకు న్యాయం జరగాలంటే ముందుగా మా భద్రతకు హామీ కావాలి" అని వారు పేర్కొన్నారు. ఈ వాంగ్మూలాలు అంగన్‌వాడీ వ్యవస్థలో నెలకొన్న భయ వాతావరణాన్ని, సిబ్బంది ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడిని స్పష్టంగా సూచిస్తున్నాయి. జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి ఆరోపణల నిజానిజాలు బయటపెట్టి, బాధ్యులపై చర్యలు తీసుకుంటేనే సిబ్బంది నమ్మకం నిలబడుతుందని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# ఆధ్యాత్మిక కేంద్రంగా ధర్మపురిని తీర్చిదిద్దాం

## ● మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ధర్మపురి, ఫిబ్రవరి 28,(ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రాన్ని పూర్తి స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా మార్చుతామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం సాయంత్రం ధర్మపురిలో నిర్వహించే శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం సభ స్థలాన్ని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లు చేశామని మంత్రి తెలిపారు. తుని పీఠాధిపతులు, ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ పీఠాధిపతి శ్రీ శ్రీ సచ్చిదానంద సరస్వతి స్వాముల వారి ఆశీస్సులతోఈరోజు నిర్వహించే కళ్యాణోత్సవ కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ధర్మపురి వ్యాపారుల ఆధ్వర్యంలో పాత టీటీడీ కళ్యాణ మండపంలో బ్రహ్మోత్సవాలకు వస్తున్న భక్తులకు కోరకు ఉచిత భోజన పథకాన్ని మంత్రి ప్రారంభించారు. మంత్రి వెంట మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి, వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, ఆలయ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, నాయకులు సంఘనభట్ల దినేష్, ధర్మపురి మున్సిపల్ కౌన్సిలర్లు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.





# విద్యా రంగాన్ని విస్మరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

## ● విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలి ● విద్యా కమిషన్ సిఫారసులు సవరించాలి ● బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరించకుండా విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జిల్లాలోని వివిధ విద్యా సంస్థల యాజమాన్యాలతో బీసీ జేఏసీ, సాధిక్ ఫౌండేశన్ ఆద్వర్యంలో శనివారం సంయుక్తంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ప్రభుత్వానికి విద్యారంగానికి18శాతం నిధులు కేటాయించాలని చేసిన సిఫారసులు సరి చేసుకోవాలని సూచించారు. 18 శాతం నిధులు ఎలా ఖర్చుపెడతారో స్పష్టత లేదన్నారు. జిల్లాల వారీగావిద్యాసంస్థల నిర్వాహకులు అభిప్రాయాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు. హైకోర్టు అడ్వకేట్, సామాజిక ఉద్యమకారుడు సాదిక్ అలీ మాట్లాడుతూ ఇప్పటి వరకు కేవలం 6 నుండి 7శాతం వరకు బడ్జెట్ లో విద్యారంగానికి నిధులు కేటాయించారని అన్నారు. రాహుల్ గాంధీ, సిఎం రేవంత్ రెడ్డి గతంలో ఇచ్చిన హామీ మేరకు ఈనెలలో జరిగే బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆదిశగా తమ పోరాటం కొనసాగుతుందని,పౌరసమాజాన్ని జాగృతం చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఈ సమావేశంలో నల్లవెల్లి శంకర్, బుచ్చిరెడ్డి, నీతారెడ్డి, మల్లేశం, కిరణ్, ఉమామహేశ్వర్, కుమార్, సంతోష్, రాజు, సుధాకర్, రాజేందర్, మాలిక్, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ ఇన్స్పెక్టర్ పదవీ విరమణ

## - ఘనంగా సన్మానించిన మేయర్, డిప్యూటీ మేయర్



**గోదావరి ఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్):** నోటిఫైడ్ ఏరియా నుండి మునిసిపల్ కార్పొరేషన్ స్థాయికి ఎదిగి రామగుండం నగరానికి 34 ఏళ్ళ సుదీర్ఘ కాలం రెవెన్యూ ఇన్స్పెక్టర్ గా ఓదెల శంకర్ రావు ఎనలేని సేవలందించారని మేయర్ మహంకాళి స్వామి అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ గా పని చేస్తున్న ఓదెల శంకర్ రావు పదవీ విరమణను పురస్కరించుకొని కార్యాలయంలో శనివారం నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తన సుదీర్ఘ సేవా కాలంలో ఎలాంటి ఆరోపణలకు తావు లేకుండా విధులు నిర్వర్తించారని అన్నారు. ఆర్థిక సంవత్సరం ఆఖరు నెల మార్చిలో ఆస్తి పన్ను లక్ష్యం సాధించేందుకు నగర పాలక సంస్థకు ఆయన సేవలు ఇంకా అవసరం ఉన్నందున అభ్యంతరం లేకపోతే యధాతథంగా మరో రెండు నెలలు ఆయన సేవలందించాలని కోరారు. ఈ సందర్భంగా నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, కార్పొరేటర్ శంకర్ నాయక్, డిప్యూటీ కమీషనర్ నాయిని వెంకట స్వామి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ ,నగర పాలక సంస్థ అధికారులు ,యావత్ సిబ్బంది ఆయన సేవలను ప్రశంసిస్తూ ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. ప్రభుత్వ వాహనంలో కార్యాలయం నుండి సాగనంపి ఘనంగా వీడ్కోలు పలికారు.

# ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

## - పెద్దపల్లి ఏసిపి గజ్జి కృష్ణ యాదవ్



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని, మద్యం సేవించి వాహనాలను నడిపితే కఠిన చర్యలు ఉంటాయని పెద్దపల్లి ఏసిపి గజ్జి కృష్ణ యాదవ్ పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ నిమిత్తం రాష్ట్ర డిజిపి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆర్రైవ్ - అలైవ్ ఫేస్ -2 ప్రోగ్రాంలో భాగంగా శనివారం పెద్దకల్వల లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ లో రోడ్డు భద్రత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి ఏసిపి గజ్జి కృష్ణ యాదవ్ రోడ్డు భద్రత నియమాలు వాటి ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ విధిగా రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ ప్రమాదాల నివారణకు సహకరించాలని, మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి కావద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, సుల్తానాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్బారెడ్డి, ఎస్సై లు జె. లక్ష్మణరావు, నరేష్, కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీ నరసయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వాట్సాప్ మెసేజ్ కు స్పందించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్



**జమ్మికుంట ఫిబ్రవరి 28 (ది క్రైమ్ న్యూస్):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 26వ వార్డు హరితనగర్ కు చెందిన మరుముల్లా శ్రీవేణీ నూతన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్)కు వారు నివసిస్తున్న గృహ పరిసర ప్రాంతానికి విద్యుత్ దీపాలు మరియు సరియగు రోడ్డు డ్రైన్ నిర్మాణం లేదని తమ యొక్క తండ్రి క్యాన్సర్ పేషెంట్ నిత్యం ఆసుపత్రి కి తీసుకు వెళ్లాలడనికి ఇబ్బందిగా ఉంది అని చైర్మన్ ఫోన్‌కి మెసేజ్ రూపకంగా తెలియ పరచగావారు వెంటనే సంధించి వారియొక్క పరిస్థితి అర్థంచేసుకుని వారినివాసాన్ని సందర్శించి వెంటనే వారిసమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ స్థానిక కౌన్సిలర్ దిడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.

## 'ఆది' సేవలు గణనీయం: సర్పంచ్ పల్లె ప్రతిమ-పీవీ రావు

**రామగిరి,ఫిబ్రవరి28(ది క్రైమ్ న్యూస్ ):-** సెంటినరీ కాలనీకి చెందిన డిప్యూటీ సూపర్డెంట్ ఆది అశోక్ పటేల్ సేవలు గణనీయమని రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు అన్నారు. సెంటినరీ కాలనీ కమ్యూనిటీ హాలులో శనివారం ఓసీపీ-టు డిప్యూటీ సూపర్డెంట్ ఆది అశోక్-రమాదేవి రిటైర్మెంట్ ఫంక్షన్ ఘనంగా జరిగింది. 36 సంవత్సరాలు సింగరేణి సంస్థలో ఉద్యోగము దిగ్విజయంగా నిర్వహించి, పదవి విరమణ పొందడం అభినందనీయమన్నారు. రత్నాపూర్ గ్రామంలో భీముని.రమా-చంద్రశేఖర్ గృహప్రవేశం వేడుకలలో సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు పాల్గొన్నరు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ దుబ్బాక సత్య రెడ్డి, జ్యోతి రెడ్డి డిసిసి ప్రధాన కార్యదర్శి గాండ్ల మోహన్, బిజెపి జిల్లా నాయకులు మొల్మూరి శ్రీనివాస్, పొన్నం సదానందం, టిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సందేవేన కుమార్ తదితరులు పాల్గొన్నారు.





# చెక్ డ్యామ్ ధ్వంసానికి నిండు నూరు రోజులు

- డ్యామ్ కూలి సరిగ్గా 100 రోజులు ● కూలిందా? కూల్చారా? నిజం నీళ్లలోనే
- మాటల ఏరు పొంగింది.. నీటి మానేరు ఎండింది
- కూలిన గుంపుల చెక్ డ్యామ్ పై ది క్రైమ్ న్యూస్ అందిస్తున్న ప్రత్యేక కథనం...

**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గుంపుల తణుగుల గ్రామాల మధ్య గల చెక్ డ్యామ్ కూలి నేటికి సరిగ్గా 100 రోజుల పుణ్యకాలం గడిచిపోయింది. గత సంవత్సరం నవంబర్ 21 అర్ధరాత్రి కూల్చివేత... లేక కూలిపోవడం.. రెండిట్లో ఏదో ఒకటి జరిగింది. కానీ ఏం జరిగిందన్న దానికంటే ఎవరూ బాధ్యత తీసుకోలేదన్నదే పెద్ద దుర్ఘటన.ఇది ఒక రాజకీయ విధ్వంస శత దినోత్సవ వేడుక. డ్యాం కూలింది... మాటల గోడలు మాత్రం కూలలేదు.

వేల ఎకరాల భవిష్యత్తు ఇసుకలో... నేతల మాటలు గాలిలో. నాణ్యత లోపమా? ఇసుక మాఫియానా? నిజం మాత్రం అదే నీటిలో గల్లంతయింది. రాజకీయ యుద్ధం గెలిచింది... బక్క చిక్కిన రైతు ఓడిపోయాడు.

కేసు లేదు... నిందితులు లేరు.. అదే కాక పునర్నిర్మాణం అన్నమాట లేదు బాధ మాత్రం రైతుదే.

కూలింది డ్యామ్ మాత్రమే కాదు.. రైతు నమ్మకం. శత దినోత్సవము చేసుకోవాలా?


కూలిన చెక్ డ్యామ్ ఫైల్ ఫోటో

లేక పునర్నిర్మాణం మొదలు పెట్టాలా? ఈ ప్రశ్నకు బదులు ఇచ్చేది ఎవరు.

బురద చల్లుకున్న నేతలు.. దుబ్బ మింగిన రైతులు. మాటల వరద పొంగి పొర్లింది... నీటి వరద జాడ మాయమైంది.

గుంపులలో అర్ధరాత్రి డ్యామ్ కూలింది.. తెల్లారేసరికి రాజకీయ డ్రామా మొదలైంది. డ్యామును కూల్చింది ఎవరు? నిజం చెప్పేది ఎవరు? రాజకీయ దుమారంలో రైతు ఆశలు నేలమట్టం. శత దినాలు గడిచినా ఒక్క అడుగు ముందుకు కదల్లేదు.

100 రోజులు.. డ్యామ్ మాయం.. దర్యాప్తు గాయం. ఇసుక మాఫియా అని అంటారు కొందరు. నాణ్యత లోపంతో కూలిందంటారు మరికొందరు. రాయి ఏదైనా మూతి పళ్లు రాలాయి అన్నట్టు మొత్తానికి ఒక మహా కట్టడం నేలమట్టం అయింది. నాణ్యత లోపం వల్లే కూలింది అధికారపక్షం వాదన. ధన దాహంతో కూల్చివేయబడ్డది ప్రతిపక్షం వాదన. అలా మాటల యుద్ధం ముదిరి రాజీనామాల వరకు వెళ్ళింది. కానీ చివరికి రాజీనామా చేసింది రైతు ఆశే.

నాణ్యత లోపం అయితే కాంట్రాక్టర్ పై చర్య లేవి? కూల్చివేత అయితే దుండగులు ఎవరు? కేసు పెట్టారా? నిందితులను పట్టారా? చివరికి జవాబు ఒక్కటే రాజకీయ దుమారంలో రైతు నోట్లో దుబ్బ.

పునర్నిర్మాణం పై ప్రకటన లేదు. ఆయకట్టు రైతుల ఆశలు ఇసుకలో సమాధి అవుతున్నాయి. మాటల సభలు ముగిశాయి. విమర్శల వర్షం వెలిసింది. కానీ రైతు పొలంలో మాత్రం నీటి బొట్టు పడలేదు. ఇంకా ఎన్నిరోజులు? రాజకీయాలు కాదు పునర్నిర్మాణం ఎప్పుడు? ఈ ప్రశ్నకు జవాబు కోసం ఎదురు చూస్తూ... భూగర్భ జలాలు అడుగంటుతున్న వేళ..ఎండాకాలమైనా రిపేర్లు చేస్తారన్న ఆశతో దిగులుగా ఆయకట్టురైతులు.

# స్వామి వారి కళ్యాణానికి పట్టు వస్త్రాలు ముత్యాల తలంబ్రాలు

- సమర్పించిన జిల్లా కలెక్టర్ దంపతులు

**ధర్మపురి, ఫిబ్రవరి 28, (ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని స్వామివారి కళ్యాణ మహోత్సవానికి జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ దంపతులు హాజరై పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితులు కలెక్టర్ దంపతులను ఆశీర్వదించి శాలువాతో ఘనంగా సన్మానించి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రజలందరికీ ఆధ్యాత్మిక శాంతి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని మరియు ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దివ్య ఆశీస్సులు జిల్లా ప్రజలందరికి కలగాలని ఆకాంక్షించారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, శానిటేషన్, పారిశుద్ధ్య నిర్వహణ నిరంతరం చేపట్టాలని, భక్తుల అధిక రద్దీని దృష్టిలో ఉంచుకొని సురక్షిత త్రాగునీటి సౌకర్యం సమృద్ధిగా కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అందరు అధికారులు సమన్వయంతో పని చేస్తూ భక్తులందరికీ అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో, జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్



చైర్మన్ మరియు కౌన్సిలర్లు, దేవస్థాన కమిటీ చైర్మన్ మరియు కమిటీ సభ్యులు, మున్సిపల్ కమిషనర్, దేవస్థాన ఈవో, తహసీల్దార్ లు, ఎంపిడివోలు, పోలీస్ అధికారులు, వివిధ శాఖల అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.





# ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులకు ఘన సత్కారం

- సమాజ శ్రేయస్సు కోసం పనిచేసేది పోలీసులే రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా





**రామగుండం కమిషనరేట్ (ది క్రైమ్ న్యూస్):** తమ కుటుంబ క్షేమం కన్నా సమాజం క్షేమం కోసం నిరంతరం విధులు నిర్వహించేది పోలీసులు మాత్రమేనని ఉద్యోగ విరమణ చేస్తున్న పోలీస్ అధికారులు ఇకనుంచి వారి కుటుంబాల కోసం ఎక్కువ సమయం కేటాయించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్లో సుధీర్ఘకాలంగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను రామగుండం పోలీస్ కమిషనర్ అంబ ర్ కిషోర్ ఝా శనివారం ఘనంగా సత్కరించారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులు ఎస్సై నక్క శామ్యూల్ పాల్ సీసీఎస్ మంచిర్యాల, ఎస్సై నూనే శ్రీనివాస్ మందమర్రి ఏ ఎస్ ఐ హెచ్ వెంకటేష్ బాబు గోదావరిఖని వన్ టౌన్, ఏ ఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎండి అలీముద్దీన్ సి ఏ ఆర్ రామగుండం, హెడ్ కానిస్టేబుల్ ఎం విజేందర్రెడ్డి జూలపల్లి ని పోలీస్ కమిషనర్ పూలమాలలతో ఘనంగా సత్కరించడంతో పాటు జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ తమ కుటుంబ క్షేమంకన్నా సమాజం క్షేమం కోసం నిరంతరం విధులు నిర్వహించేది పోలీసులు మాత్రమేనన్నారు. ఉద్యోగ విరమణ చేస్తున్న పోలీస్ అధికారులు వారి విధి నిర్వహణ సమయంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కోవడంతోపాటు కొన్ని సమయాల్లో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహించిన వారున్నారన్నారు. ఈ కార్యక్రమం లో అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్, ఏఓ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్, ఆర్ ఐ లు శేఖర్, మల్లేశం, రామగుండం పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్ల కుంట పోచలింగంతోపాటు పదవీవిరమణ పొందిన పోలీస్ అధికారుల కుటుంబ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నిబంధనలను పాటించని రెండు ఇటుకల బట్టీలు సీజ్....

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లాలోని ఇటుకల బట్టిలలో పనిచేస్తున్న వలస కార్మికులకు కనీస సౌకర్యాలు, మౌలిక వసతులు కల్పించాలని జిల్లా ఉన్నతాధి కారులు ఆదేశాలు జారీ చేసిన ఇటుక బట్టీల యజమానులు ఆదేశాలను బేఖాదార్ చేస్తూన్న రెండు ఇటుకల బట్టిలను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. పెద్దపల్లి మండలం రాఘవపూర్ గ్రామంలోని ఎంఎస్ బి, వి బి సి ఇటుకల బట్టిల నిర్వాహకులు నిబంధనలను అతిక్రమించి సరియైన అనుమతి పత్రాలు లేకుండా ఇటుక బట్టీలను నిర్వహిస్తున్నారని సరియైన సమాచారంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం ఎం ఎస్ బి, వి బి సి ఇటుకల బట్టిలను సీజ్ చేసినట్లు పెద్దపల్లి తాహసిల్దార్ ప్రకటనలో తెలిపారు.



# పోస్టాపీసు పథకాలను సద్వినియోగం చేసుకోండి

- సర్పంచ్ పల్లె ప్రతిమ-పివీరావు



**రామగిరి, ఫిబ్రవరి 28(ది క్రైమ్ న్యూస్):-** పోస్టాపీసు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమ-పివీరావు అన్నారు. శనివారం రత్నాపూర్ గ్రామ పంచాయితీ ఆవరణలో బ్రాంచ్ పోస్టు మాస్టర్ ఊరుగొండ వెంకన్న, అసిస్టెంట్ బిపిఎం బోడ రాహుల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించగా సర్పంచ్ పల్లె ప్రతిమ-పివీరావు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. సుకన్య సమృద్ధి యోజన, పోస్టాపీసు నెలవారీ ఆదాయ పథకం, కిసాన్ వికాస్ పత్ర, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్, టైమ్ డిపాజిట్ ఖాతా, రికరింగ్ డిపాజిట్, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, వివిధ పథకాల పై వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సెక్రటరీ గంగుల సంతోష్, స్థానిక నాయకులు జక్కుల చందన్, సందవేన కుమార్, పబ్బ మొగిలి, కండె కిష్టయ్య, బోగే సతీష్, ఇజ్జగిరి సంపత్, ముడుసు నర్సయ్య, పానుగంటి ప్రశాంత్, పీట్ల శేఖర్, జంగేటి కుమార్, గుండ రాధయ్య, దాసరి మల్లి, అమరగొండ శ్రీనివాస్, కొదురుపాక భీమయ్య, అబ్బ చంద్రయ్య, లక్ష్మణ్ రావు, మెడగొండ రాజయ్య, గుమ్మడి లక్ష్మయ్య, ముక్కెర వినయ్, బెజ్జాల పోషం, అమరగొండ అనిల్, కారోబార్ కొండపర్తి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## పదవికి మాత్రమే విరమణ సేవకు కాదు

- ఉద్యోగ బాధ్యతలో శంకర్ సేవలు అభినందనీయం
- మంథని బస్ డిపో మేనేజర్ శ్రవణ్ కుమార్



**రామగిరి,ఫిబ్రవరి 28(ది క్రైమ్ న్యూస్):-** ఉద్యోగ బాధ్యతలో మోసం శంకర్ సేవలు అభినందనీయమని మంథని బస్ డిపో మేనేజర్ శ్రవణ్ కుమార్ కొనియాడారు. శనివారం మంథని బస్ డిపోలో శ్రామిక్ గా విశిష్టమైన సేవలు అందించిన మోసం శంకర్ పదవి విరమణ చేశారు. ఈ సందర్భంగా మంథని డిపో మేనేజర్ శ్రావణ్ కుమార్ అభినందన సమావేశం ఏర్పాటు చేశారు. మోసం శంకర్ 34 సంవత్సరాల ఉద్యోగ బాధ్యతలలో అలుపు లేకుండా సేవలందించారని గుర్తు చేశారు. ఆయన బాధ్యతల్లో క్రమశిక్షణ, అంకితభావంతో పాటుగా అందరిలో కలివిడిగా ఉంటూ, ఆప్యాయతను పంచారని తెలిపారు. శంకర్ డిపోలో శ్రామిక్ గా పనిచేస్తూనే తన వంతు సహాయంగా సమాజ అభివృద్ధికి తోడ్పాటు చేశారని పేర్కొన్నారు. మంచికి మారుపేరుగా నిలిచిన శంకర్ తన ఉద్యోగ ధర్మాన్ని ఏనాడు మర్చిపోలేదని తెలిపారు. పదవికి మాత్రమే విరమణ సేవకు కాదని, పదవి విరమణ అనంతరం తన శేష జీవితాన్ని సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. ఆయనకు, వారి కుటుంబానికి ఆ భగవంతుడు నిండు నూరేళ్లు, అష్టైశ్వర్యాలతో తులతూగేల ఆశీర్వదించాలని ఆయన అభిలాషించారు. ఈ కార్యక్రమంలో సిటిఐ ఏంజెల్, గ్యారేజ్ ఇన్చార్జి ఇక్బాల్, సూపర్డెంట్ జ్యోతి, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు అంకరి కుమార్, సామాజిక సేవా కార్యకర్త లోడి మల్లేశం, డిపో నాయకులు వెంగళ దాసు ఐలయ్య, గంగపుత్ర సంఘం నాయకులు గంధం రాజేందర్, అంకరి ప్రకాష్, గంధం శంకర్, గంధం వెంకటస్వామి, దొంగరి ప్రకాష్, అంకరి శివ, బిజెపి సీనియర్ నాయకులు బోయిని నారాయణ లతో పాటు అధిక సంఖ్యలో ఆర్టీసీ కార్మికులు, సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

## కోర్టులో కేసు నడుస్తున్నా... దాయాదుల దాడీ





**మానకొండూర్, ఫిబ్రవరి 28(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం కెల్లేడులో రావుల ఆంజయ్య అనే వ్యక్తిపై మరో వ్యక్తి హత్యా యత్నానికి పాల్పడ్డ ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది.రావుల అంజయ్యకు తన రక్త సంభందీకుడైన రావుల ఈశ్వర్ కు ఉన్న భూ వివాదాలతో ఏడాదిన్నర నుండి గొడవలు జరుగుతుండగా ఏడాది క్రితం ఈశ్వర్, అంజయ్య అతని తమ్ముడిపై ఇనుపరాడ్డుతో దాడి చేయడంతో అంజయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి.బాదితుడి ఫిర్యాదుతో ఘటనపై పోలీసులు కేసు నమోదు చేయగా కోర్టులో కేసు నడుస్తున్నప్పటికీ ఈశ్వర్ బెదిరింపులకు పాల్పడుతుండటంతో అంజయ్య పోలీసులను ఆశ్రయిస్తూ 3సార్లు ఫిర్యాదు చేశాడు.దీంతో మరింత పగ పెంచుకున్న ఈశ్వర్ శుక్రవారం సాయంత్రం అంజయ్య ఇంటికి వెళ్ళి దాడీకి పాల్పడగా కుటుంబ సభ్యులు భయబ్రాంతులకు గురయ్యారు.ఇదే విషయమై సాయంత్రం పోలీస్ స్టేషన్ లో అంజయ్య ఫిర్యాదు చేయగా రాత్రి అంజయ్యను చంపుతానంటూ తన తండ్రి సదయ్యతో పాటు ఈశ్వర్ మళ్ళీ అంజయ్య ఇంటికి వెళ్ళి గొడ్డలితో హత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ బొలలిమాల సంజీవ్ తెలిపారు.

## విద్యార్థులకు బాటిల్స్ పంపిణీ చేసిన తహశీల్దార్



**తిమ్మాపూర్,ఫిబ్రవరి28(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం వచ్చునూరులో శనివారం సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమానంతరం ప్రాథమిక పాఠశాలకు సర్పంచ్ బిల్లా సంతోష్ కుమార్ విరాళంగా ఇచ్చిన స్టీల్ వాటర్ బాటిల్లను ఎమ్మార్వో శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులకు అందజేశారు.కార్యక్రమంలో గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# హుజూరాబాద్ గడ్డపై బీఆర్ఎస్ పార్టీ భూస్థాపితం అవడం ఖాయం

● మతి భ్రమించి,వ్యక్తిగత ఇమేజ్ కోసం అత్యుత్సాహంతో దేవతల సాక్షిగా కౌశిక్ రెడ్డి చిల్లర రాజకీయం. ● మతం పేరుతో కరీంనగర్ సీపీని దూషించింది నిజం కాదా? ● ఆరిపోయే దీపానికి వెలుగు ఎక్కువ సామెతకు ఉదాహరణ కౌశిక్ రెడ్డి.. ● ఎన్నికల ముందు చెప్పాం, చెప్పిన ప్రకారం హుజూరాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరవేశాం.. ● కౌశిక్ రెడ్డిపై ఉన్న కేసులన్నంటినీ సిబిడితో విచారణ చేయించాలి ● కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వివాదాలకు దూరంగా, అభివృద్ధికి దగ్గరగా నిధులు మంజూరు



**హుజూరాబాద్ ఫిబ్రవరి 28 (ది క్రైమ్ న్యూస్):** కొన్ని రోజులుగా కౌశిక్ రెడ్డి వివిధ చానెల్ లో ఇచ్చిన ఇంటర్వ్యూలు చూస్తుంటే అతనికి మతి స్థిమితం పూర్తిగా కోల్పోయినట్టు మెదడు మోకాలిలోకి వచ్చి,వ్యక్తిగత ఇమేజ్ కోసం అధికారులను దూషించడం,ఆపై తన మాటే నెగ్గాలి అన్నట్టుగా ప్రవర్తిస్తున్నాడని కౌశిక్ రెడ్డి చేసిన ఆరోపణల్లో ఒక్కటి కూడా నిజం లేదని,అవన్నీ బోగస్ ముచ్చట్లనీ అన్నారు హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్.శనివారం నాడు హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 98 మంది లబ్ధిదారులకు 36 లక్షల విలువచేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను 5 మండలాల పరిధిలోని లబ్ధిదారులకు పంపిణీ చేశారు.అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మాట్లాడితే కేసులు పెడుతున్నారని అనే కౌశిక్ రెడ్డి తన కేసుల విషయంలో ప్రజల కోసం కొట్లాడితేనో, ప్రజా ఉద్యమాల్లో పాల్గొంటేనో కేసులు పెట్టలేదని,వ్యాపారస్తులను, ఇక్కడున్న ఇసుక క్వారీల యజమానులను, ప్రతి ఒక్కరిని బెదిరించి అక్రమాలకు పాల్పడితే వారే స్వచ్ఛందంగా పోలీసు స్టేషన్ కి వెళ్లి కేసులు పెట్టారని అన్నారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లుగా ప్రజలకు అందిస్తున్నామని, ప్రజా ప్రభుత్వంలో హుజురాబాద్ లో ఏ ఎన్నిక జరిగినా ప్రజల తీర్పు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉందని, ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయగా దాన్ని జీర్ణించుకోలేని కౌశిక్ రెడ్డి ఆగం ఆగం అవుతున్నారని అన్నారు. ఇకపై హుజురాబాద్ లో బిఆర్ఎస్ పార్టీ ఉండదని భూస్థాపిత మయ్యిందని అన్నారు.

**ముఖ్యమంత్రిపై అనవసరపు వ్యాఖ్యలు చేస్తే సహించం..** పెద్దవారితో పోల్చుకుంటే పెద్దోడైపోతామని కౌశిక్ రెడ్డి పగటి కలలుకంటున్నాడని, ఎన్నికలైన, ఇతర విషయాల్లో దూరి అనవసరపు ఇష్యూలో కలగచేసుకొని తన పరువు పోగొట్టుకోవడమే కాదు హుజురాబాద్ పరువు కూడా తీస్తున్నాడని కౌశిక్ రెడ్డిపై మండిపడ్డారు ప్రణవ్. ముఖ్యమంత్రిపై ఇంకోసారి చిల్లర వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.కేసీఆర్ బయటికి వస్తే ఏదో అయిపోద్దని చెప్పే కౌశిక్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దెబ్బకు ఫార్మ్ హౌస్ కే పరిమితం అయ్యారని,కేసీఆర్ బయటికి వచ్చిన ఎంపీ ఎన్నికల్లో ప్రజలు గుండు సున్నా ఇచ్చి మళ్ళీ ఫామ్ హౌస్ కే పరిమితం చేశారని గుర్తుచేశారు.పదేళ్లు రాష్ట్రాన్ని చిన్నా బిన్నం చేసి మళ్ళీ అధికారం కోసం వాళ్ళు మాట్లాడే మాటలు ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

**పోలీసుల విషయంలో కౌశిక్ రెడ్డి తన ప్రవర్తన మానుకోవాలి..** ఇటీవల వీణవంక సమ్మక్క సారలక్క జాతర విషయంలో పోలీసులపై కౌశిక్ రెడ్డి చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని చట్ట ప్రకారం హైకోర్టు ఆదేశాల మేరకు వారు నడుచుకున్నారని, కౌశిక్ రెడ్డి చెప్పినట్టు వినడానికి, నడవడానికి ఇది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదని, ప్రజా ప్రభుత్వమని అన్నారు. ఒక మహిళ అధికారిని పట్ల ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం సోషల్ మీడియాలో ట్రోల్ చేయడంపై అతని సంస్కారానికే వదిలేస్తున్నామని అన్నారు. మళ్ళీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పోలీసులకు ట్రైనింగ్ ఇస్తా అనడం కాదు ముందుగా మీ కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు ఎవరితో ఎలా మాట్లాడాలో నేర్పలేదాఅని ఈ విషయంలో కౌశిక్ రెడ్డి ట్రైనింగ్ తీసుకోవాలని సూచించారు.

**మతం పేరుతో కరీంనగర్ సీపీనీ దూషించింది నిజం కాదా?** ఈ విషయంపై కేటీఆర్, హరీష్ రావు బీఆర్ఎస్ స్టాండ్ ఏంటో చెప్పాలి. కౌశిక్ రెడ్డి ఒక ముస్లిం అధికారినీ పట్టుకొని కులం పేరుతో దూషించింది నిజం కాదా అని,ఈ విషయంపై కేటీఆర్ హరీష్ రావు బీఆర్ఎస్ పార్టీ స్టాండ్ ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు ప్రణవ్. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే కేటీఆర్, హరీష్ రావు మద్దతు ఇస్తున్నారా అని ప్రశ్నించారు? తక్షణమే హుజూరాబాద్ అంబేద్కర్ చౌరస్తా వద్ద కౌశిక్ రెడ్డి ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్మన్ సుహాసిని, వైస్ చైర్మన్ అంజలి, కౌన్సిలర్లు, మార్కెట్ చైర్మెన్ లు, దేవాలయ చైర్మెన్ లు, డైరెక్టర్లు, మండల, పట్టణ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, యువజన విభాగం నాయకులు, బ్లాక్ కాంగ్రెస్, మైనారిటీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అరైవ్ అలైవ్ రెండో విడత కార్యక్రమం

## - రోడ్డు భద్రత నియమాలు పాటించండి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా





**రామగుండం కమిషనరేట్ (ది క్రైమ్ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం డీజీపీ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాలను నిర్మూలించాలనే లక్ష్యంతో అరైవ్ అలైవ్ రెండో విడత కార్యక్రమంలో భాగంగా వాహనదారులు మరియు ప్రజల్లో రోడ్డు భద్రత నియమాలపై అవగాహన పెంచేందుకు గోదావరిఖని వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో, ట్రాఫిక్ పోలీసుల సహకారంతో గోదావరిఖనిలోని సింగరేణి విటిసి కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాకు ట్రాఫిక్ ఏసీపీ సి.హెచ్. శ్రీనివాస్, గోదావరిఖని వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రజల్లో ముఖ్యంగా యువత మరియు డ్రైవర్లలో రహదారి భద్రతపై అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం పోలీసుల బాధ్యత అని,అయితే శాశ్వత మార్పు రావాలంటే ప్రతి వాహనదారుడు తన మనసులోనే ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలనే సంకల్పం చేసుకోవాలని సూచించారు. డిఫెన్సివ్ డ్రైవింగ్ అలవాటు చేసుకుని జాగ్రత్తగా వాహనం నడిపితే సుమారు 80 శాతం వరకు ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. తాగి వాహనం నడపడం చిన్న తప్పు కాదని, అది తమ కుటుంబానికే కాక ఇతర కుటుంబాలకు కూడా అపార నష్టం కలిగించవచ్చని హెచ్చరించారు. ప్రాణం కంటే విలువైనది ఏదీ లేదని, ప్రాణం ఉంటేనే అన్నీ సాధ్యమని అన్నారు. రహదారి భద్రతా నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ప్రమాదంలో తప్పు ఎవరిదన్నది కంటే, దాని వల్ల రెండు కుటుంబాలు ఇబ్బందులు పడతాయని గుర్తుంచుకోవాలని సూచించారు. సమాజ అవగాహనతో అందరూ కలిసి రోడ్డు ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు తమ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు మరియు సహోద్యోగులకు రహదారి భద్రతపై చైతన్యం కల్పించాలని, సోషల్ మీడియా లేదా వ్యక్తిగత సంభాషణల ద్వారా ఈ సందేశాన్ని విస్తరించాలని కోరారు.హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ వినియోగం తప్పనిసరిగా పాటించాలని,ట్రాఫిక్ నియమాలను గౌరవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రామగుండం ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, గోదావరిఖని వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు, రోడ్ సేఫ్టీ పెద్దపల్లి జోన్ ఇన్‌చార్జ్ ఇన్స్పెక్టర్ రమేష్‌బాబు, గోదావరిఖని వన్‌టౌన్ ఎస్‌ఐ మనోహర్, ట్రాఫిక్ ఎస్ఐ హరీష్ శేఖర్, విటిసి ప్రిన్సిపల్, సిబ్బంది, ఆటో డ్రైవర్లు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# స్వదేశీ భావజాలానికి పునరుజ్జీవనం - "రన్ ఫర్ స్వదేశీ"కి శ్రీకారం






**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** సరూర్ నగర్ స్టేడియం నుండి చైతన్యపురి వరకు స్వదేశీ వస్తువుల వినియోగం గురించి మరియు 2036 ఒలింపిక్స్ లో భారత్ ఎక్కువ సంఖ్యలో పతకాలు సాధించాలని కోరుతూ రన్ ఫర్ స్వదేశీ కార్యక్రమాన్ని క్రీడాభారతి, స్వదేశీ జాగరణ మంచ్, జై భారత్ లెజెండ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి గారు ప్రసంగిస్తూ విద్యార్థులకు భారతదేశం నుండి బ్రిటిష్ వాళ్లు ప్రస్తుతం అమెరికా, చైనా, టర్కీ వంటి దేశాలు ఏ విధంగా దోచుకుంటున్నాయి వివరించారు. మేకిన్ ఇండియా మరియు మేడిన్ ఇండియా వస్తువులను కొనుగోలు చేయాలని, స్థానిక వ్యాపారుల వద్ద తమ నిత్యవసర వస్తువులు కొనుగోలు చేయడం వల్ల ఉపాధి దొరుకుతుందని, భారతదేశ సంస్కృతిని కాపాడాలని స్వదేశీ మన జీవన విధానం కావాలన్నారు. అలాగే యువత ఆటల ద్వారా శారీరక ధారుద్యం పెంపొందించుకోవాల న్నారు. ఆటల ద్వారా మన దేశ ఖ్యాతిని పెంపొందించాలన్నారు. ఫోన్లలో ఆటలు తగ్గించి మైదానంలో దిగాలని యువతకు పిలుపునిచ్చారు. ఒలింపిక్ అసోసియేషన్ పూర్వ కోశాధికారి ఱతీ.సోమేశ్వర్ రావు గారు మాట్లాడుతూ అన్ని సమస్యలకు పరిష్కారం స్వదేశీ వస్తువుల వాడడమే. ప్రతి ఇంటి మహిళ ఇంటిని స్వదేశీ తయారు చేయాలన్నారు. యువత క్రీడల ద్వారా మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. స్వదేశీ జాగరణ మంచ్ విభాగ్ కన్వీనర్ వివేకానంద మాట్లా డుతూ అనే నినాదంతో , స్వదేశీ ఉత్పత్తుల వినియోగం ద్వారా దేశ ఆర్థిక భద్రత, స్వావ లంబన సాధ్యమవుతుందని, విదేశీ ఉత్పత్తులపై ఆధారపడ టాన్ని తగ్గించి, దేశీయపరిశ్రమలు, స్థానిక వ్యాపారాలను ప్రోత్సహిం చాలనే సంకల్పాన్ని ఈ రన్ ద్వారా ప్రజల్లో నాటాలనే లక్ష్యంగా తెలిపారు. గౌరవ అతిథిగా విచ్చేసిన క్రీడాభారతి రాష్ట్ర కార్యదర్శి ఱతీ. బాబులాల్ గారు మాట్లాడుతూ క్రీడలే మనిషికి మానసిక వికాసానికి తోడ్పడుతాయన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను క్రీడలవైపు మల్లే విధంగా ప్రోత్సహించాలన్నారు. యువతను ప్రోత్సహించడం ద్వారా 2036లో జరిగే ఒలింపిక్స్ లో భారత్ అత్యధికంగా మెడల్స్ సాధిస్తామన్నారు. అలాగే స్వదేశీ సంకల్పం లో భాగంగా, ప్రతి ఇంటిలో స్వదేశీ ఉత్పత్తుల వినియోగం, స్థానిక భాషలు, సాంప్రదాయాలు , సంస్కృతి పరిరక్షణ, యువతలో ఔత్సాహికతను పెంపొందించడం వంటి అంశాలపై విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. "హర్ ఘర్ స్వదేశీ -- హర్ యువ స్వదేశీ" అనే భావనను ప్రతి పౌరునికి చేరవేయడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వదేశీ జాగరణ మంచ్ ప్రాంత ప్రచార ప్రముఖ్ కేశవ్ సోనీ, ప్రాంత సంఘటనా మంత్రి రచ్చ శ్రీనివాస్, కార్యకర్తలు దృహన్, వినయ్, మనీష్, సాహిత్, హరీష్, అభిలాశ్, రాఘవేంద్ర, ప్రదీప్, పందరి లతో పాటు వివిధ కళాశాలల ఉపాధ్యాయులు, మరియు 1856 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారికి రన్ అనంతరం సర్టిఫికెట్స్ అందజేయడం జరిగింది.

## గుట్టగా మారిన పొట్టకు ఛూమంత్రం.. సరిగ్గా ఆ సమయంలో తాగారంటే వెన్నలా కరగాల్సిందే..



యాపిల్ సైడర్ వెనిగర్‌లో అనేక ఔషధ గుణాలు ఉన్నాయి. ఇది ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. మీరు దీన్ని నీటిలో కలిపి ప్రతిరోజూ తాగితే, బరువు తగ్గడంతోపాటు అనేక తీవ్రమైన వ్యాధులను నివారించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా.. ఆరోగ్యానికి కూడా చాలా మేలు చేస్తుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. కొంచెం గోరు వెచ్చని నీటిలో ఆపిల్ సైడర్ వెనిగర్ కలిపి తాగడం వల్ల కలిగే ఐదు ప్రయోజనాలు, ఎప్పుడు తాగితే మంచిది అనే విషయాలను ఇప్పుడు తెలుసుకోండి.. రోగనిరోధక శక్తిని పెంచుతుంది: యాపిల్ వెనిగర్ తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇది యాంటీమైక్రోబయల్ లక్షణాలను కలిగి ఉంది. ఇది ప్రమాదకరమైన బ్యాక్టీరియా నుంచి శరీరాన్ని దూరంగా ఉంచుతుంది. రక్తంలో చక్కెర నియంత్రణలో ఉంటుంది: రీసెర్చ్‌గేట్‌లో ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం.. యాపిల్ సైడర్ వెనిగర్ రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇందులో ఉండే యాంటీ గ్లైసెమిక్ ఎఫెక్ట్, యాంటీ డయాబెటిక్ లక్షణాలు దీనికి కారణం.. జీర్ణక్రియ సమస్యల నుంచి ఉపశమనం: యాపిల్ సైడర్ వెనిగర్ తీసుకోవడం వల్ల జీర్ణక్రియ సులభం అవుతుంది. ఇది అజీర్ణం, గ్యాస్ వంటి కడుపు సమస్యల నుంచి కూడా ఉపశమనం అందిస్తుంది. కొలెస్ట్రాల్ తగ్గిస్తుంది: ఆపిల్ సైడర్ వెనిగర్ చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడం ద్వారా మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడంలో సహాయపడుతుంది. బరువు తగ్గడంలో కూడా మేలు చేస్తుంది: యాపిల్ వెనిగర్ ఊబకాయాన్ని తగ్గించడంలో ప్రయోజనకరంగా పరిగణిస్తారు. హార్వర్డ్ హెల్త్ ప్రకారం, 2009లో 175 మందిపై జరిపిన ఒక అధ్యయనం ప్రకారం, 3 వారాల పాటు 1-2 టీస్పూన్ల వెనిగర్‌ను తీసుకునే వ్యక్తులు 2-4 పౌండ్ల బరువును తగ్గారని కనుగొన్నారు. ఈ సమయంలో తీసుకోవడం వల్ల వేలు జరుగుతుంది.. 1-2 టీస్పూన్ల యాపిల్ వెనిగర్‌ను నీటిలో కలిపి ఉదయం ఖాళీ కడుపుతో తాగడం చాలా ప్రయోజనకరమని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

## మధుమేహ వ్యాధిగ్రస్తులు కుంకుమ పువ్వు తీసుకుంటే.. కేవలం 8 వారాలలో ఈ మార్పు చూడోచ్చు!



ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన మసాలా దినుసు ఏదంటే టక్కున గుర్తొచ్చేది కుంకుమపువ్వు. ఈ పువ్వు ఉత్పత్తికి సాగు చేసే విధానం కారణంగా, కుంకుమపువ్వు ధర అత్యధికంగా ఉంటుంది. నిజానికి.. ఇతర మసాలా దినుసుల కంటే కుంకుమపువ్వు వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలు చాలా ఎక్కువ. అవేంటో తెలుసుకుందాం.. కొన్నిసార్లు కోపం రావడం, కొన్నిసార్లు ఏడవడం.. ఇలాంటి మానసిక కల్లోలం తరచుగా రావడం అస్సలు మంచిది కాదు. ఈ పరిస్థితిలో కుంకుమపువ్వు సహాయం తీసుకోవచ్చు. కుంకుమపువ్వు మనస్సును ఆరోగ్యంగా ఉంచుతుందని, డిప్రెషన్ లక్షణాలను తగ్గిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఆందోళనను తగ్గించడంలోనూ కుంకుమ పువ్వు సహాయపడుతుంది. కుంకుమపువ్వులో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి హానికరమైన ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయి. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. కుంకుమపువ్వు తినడం వల్ల గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి అనేక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడానికి ఆహారంలో కుంకుమపువ్వును తప్పక తీసుకోవాలి. ముఖ్యంగా కుంకుమపువ్వు మహిళల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ప్రీ-మెన్‌స్ట్రువల్ సిండ్రోమ్ సమస్యకు కుంకుమపువ్వు మేలు చేస్తుంది. అంటే రుతుక్రమం రాకముందే కలిగే మానసిక, శారీరక అనారోగ్యాన్ని కుంకుమపువ్వు దూరం చేస్తుంది. కాలు నొప్పి, మూడ్ స్వింగ్స్ వంటి లక్షణాలను నియంత్రిస్తుంది. రోజూ కుంకుమపువ్వు కలిపిన టీ లేదా పాలు తాగడం వల్ల బరువు కూడా తగ్గవచ్చు. కుంకుమపువ్వు ఆకలిని అణిచివేసి, బరువు తగ్గడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా ఈ మసాలాలో ఉండే యాంటీఆక్సిడెంట్లు ఊబకాయాన్ని నివారిస్తాయి. జీవక్రియ రుగ్మతలను తొలగిస్తాయి. కుంకుమపువ్వు గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. కుంకుమపువ్వులోని యాంటీఆక్సిడెంట్ కంటెంట్ కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. గుండె సమస్యలను నివారించడానికి ఆహారంలో కుంకుమపువ్వు తీసుకోవచ్చు. రోజువారీ ఆహారంలో కొద్దిగా కుంకుమపువ్వు తీసుకుంటే మధుమేహ వ్యాధిగ్రస్తులకు కూడా మంచిది. కుంకుమపువ్వు కేవలం 8 వారాలలో రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను తగ్గిస్తుంది. కుంకుమపువ్వు టైప్-2 డయాబెటిస్ ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది.

## సహజంగా శరీరంలో కొలెస్ట్రాల్ కరిగించే ఆహారాలు ఇవే.. తప్పక తీసుకోండి




నేటి కాలంలో అనేక మంది చిన్న వయసులోనే కొలెస్ట్రాల్ సమస్యతో బాధపడుతున్నారు. కొలెస్ట్రాల్ ప్రాథమికంగా ఒక రకమైన లిపిడ్. శరీరానికి అవసరమైన విధులు నిర్వర్తించడానికి ఇది చాలా అవసరం. ఈ కొలెస్ట్రాల్ ఈస్ట్రోజెన్, టెస్టోస్టెరాన్ వంటి హార్మోన్లను తయారు చేయడానికి సహాయపడుతుంది. ఈ కారణాల వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ ఉండటం చాలా ముఖ్యం. అయితే దీని పరిమాణం పెరిగితే మాత్రం ప్రమాదమే. మన శరీరంలో చెడు కొలెస్ట్రాల్, మంచి కొలెస్ట్రాల్ అనే రెండు రకాల కొలెస్ట్రాల్ ఉంటాయి. చెడు కొలెస్ట్రాల్ లేదా మొత్తం పెరిగినప్పుడు అనేక సమస్యలు వస్తాయి. ఈ కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి కొన్ని ఆహారాలు తీసుకోవాలి. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం.. ఈ రోజుల్లో చాలా మంది ఓట్ మీల్ తింటున్నారు. ఇందులో కొలెస్ట్రాల్‌ను కరిగించి నియంత్రించడంలో సహాయపడే కరిగే ఫైబర్ ఉంటుంది. ఇందులో మోనోశాచురేటెడ్ కొవ్వు కూడా ఉంటుంది. అలాగే కొన్ని రకాల పండ్లు కూడా కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. వీటిల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు గుండెను ఆరోగ్యంగా ఉంచడంతోపాటు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. యాపిల్స్‌లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇదిచెడు కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. కాబట్టి రోజూ యాపిల్స్ తప్పక తినాలి. రెడ్ మీట్, ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ వంటి ఆహారాలను పూర్తిగా మానుకోవాలి. అవి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. అలాగే, ప్రాసెస్ చేసిన ఆహారాలు, కేకులు, కుకీలు, పేస్ట్రీలు, జున్ను, నెయ్యి, వెన్న, చీజ్, జామ్ వంటి వాటికి కూడా దూరంగా ఉండాలి. మీగడ పాలు, దానితో చేసిన ఆహారం, నెయ్యి-వెన్న వీలైనంత తక్కువగా తీసుకోవాలి.అలాగే తగినంత నీళ్లు త్రాగాలి.దానితో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం తప్పనిసరి. సరైన ఆహారాల అలవాట్లు సగం జబ్బులను నయం చేస్తుంది.

# విశాఖలో టాలీవుడ్ సెలబ్రిటీ క్రికెట్ లీగ్‌లో ఫ్యాన్స్‌కి ఎంట్రీ ఫ్రీ..!

ఐపీఎల్, టీ20, వరల్డ్ కప్ మ్యాచ్‌లు చూసే క్రికెట్ అభిమానులతో పాటు సినీ స్టార్స్ ఫ్యాన్స్‌కి మరో గుడ్ న్యూస్. వెండితెరపై హీరోలుగా కనిపించే సినిమా హీరోలు అంతా కలిసి ప్రతీ సంవత్సరం సెలబ్రిటీ క్రికెట్ లీగ్ పేరుతో గ్రౌండ్‌లో కనిపిస్తారు. ఏటా జరిగినట్లుగానే ఈసారి కూడా సీసీఎల్ ఏర్పాట్లు పూర్తి అవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం మధురవాడ ఏసీఏ - వీడీసీఏ స్టేడియంలో ఈనెల 28, మార్చి 1 వ తేదీల్లో టాలీవుడ్ సెలబ్రిటీ క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రముఖ సినీ హీరోలు శ్రీకాంత్, తరుణ్ తెలిపారు. ఈసందర్భంగా మరోసారి సినీ స్టార్స్ అందరిని చూడటానకి అభిమానులు సిద్ధం కావాలని, స్టార్ జట్లలో ఏ టీమ్ లీగ్ విజేతగా నిలుస్తుందో చూడాలని సినీ హీరోలు పిలుపునిచ్చారు. సినిమాల్లో కనిపిస్తూ ప్రేక్షకుల్ని మెప్పించే టాలీవుడ్ హీరోలు, నటులు తెరపైనే కాదు రియల్ లైఫ్‌లో కూడా హీరోల్లాగానే పేరు తెచ్చుకుంటున్నారు. సెలబ్రిటీ క్రికెట్ లీగ్ పేరుతో టాలీవుడ్‌కి చెందిన యంగ్ హీరోలు, నటులు అంతా కలిసి క్రికెట్ మ్యాచ్‌లు ఆడతారు. అయితే ఇది అభిమానుల్ని రంజిపజేయడంతో పాటు ఈ మ్యాచ్ ల ద్వారా వచ్చే ఆదాయాన్ని పేద పిల్లల చదువు, సీఎం సహాయ నిధి, దాతృత్వ కార్యక్రమాలకు వినియోగిస్తారు. ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా విశాఖపట్నంలో ఈ సెలబ్రిటీ క్రికెట్




లీగ్ శనివారం నుంచి జరగనుంది. దీంతో వైజాగ్ సిటీ మరోసారి సినిమా అభిమానులు, క్రికెట్ ఫ్యాన్స్‌కి వేదికగా మారబోతోంది. అయితే ఓ మంచి ఉద్దేశంతో సినీ నటులు చేపడుతున్నఈ క్రీడా సంబరాన్ని ఈసారి బాగా నిర్వహించి అంతర్జాతీయ స్పోర్ట్స్ హబ్ గా విశాఖను తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈనెల 28 నుండి మార్చి 1వ తేది వరకు అంటే రెండు రోజుల పాటు ఈ పోటీలు జరగనున్నాయి. సెలబ్రిటీ లీగ్ ను వీక్షించే అవకాశాన్ని విశాఖ ప్రజలు ఉచితంగా తిలకించే వినియోగించుకోవాలని కోరారు. హోటల్ డాల్ఫిన్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మిగతా హీరోలు సుధీర్ బాబు, ఓంకారం, అశ్విన్ బాబు, అయ్యప్ప శర్మ, ప్రిన్స్, ఖయ్యూం, ప్రభు, ఈటీవీ ప్రభాకర్, నిఖిల్, సామ్రాట్, నందకిషోర్ నందకిషోర్, పవన్ సాయి, సాంబతో కలిసి క్రికెట్ పోటీల వివరాలను వెల్లడించారు. టాలీవుడ్ నటులు, టీవీ నటులతో రెండేసి టీంలు.. పోలీసులు, బ్యూరోక్రాట్లు, రాజకీయ నాయకులతో ఒక్కో టీం చొప్పున మొత్తం 7 టీంల నుంచి 110 సెలబ్రిటీలు ఈ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. సెలబ్రిటీ లీగ్ నిర్వాహకుడు రాంబాబు మాట్లాడుతూ క్రికెట్ పోటీల నిర్వహణలో వెన్నంటి ఉండి నడిపిస్తున్న ఎమ్మెల్యే గంటా సూచనతో ఉచిత ప్రవేశం కల్పించాలని నిర్ణయించామని తెలియజేశారు. ఐపీఎల్ తరహాలో సెలబ్రిటీ మ్యాచ్ లను డిజైన్ చేశామన్నారు. టాలీవుడ్ సెలబ్రిటీ క్రికెట్ లీగ్ పోస్టర్ ను ఈ సందర్భంగా విడుదల చేశారు. సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ, నగర పోలీస్ కమిషనర్, జీవీఎంసీ కమిషనర్ ఎంతగానో సహకరిస్తున్నారని తెలియజేశారు. మొదటి రోజు మూడు టీములు, తలపడతాయని తెలిపారు.

# స్పోర్ట్స్



## తొలిసారి రంజీ ట్రోఫీ కైవసం చేసుకున్న జమ్ముకశ్మీర్

### 67 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ట్రోఫీ కైవసం

జమ్మూ కశ్మీర్ రంజీ టీమ్ చరిత్ర సృష్టించింది. 67 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత తొలి రంజీ ట్రోఫీని కైవసం చేసుకుంది. శనివారం కర్ణాటకతో ఫైనల్ మ్యాచ్ డ్రాగా ముగియడంతో తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించిన జమ్మూ కశ్మీర్‌ను విజేతగా ప్రకటించారు. 1959-1960లో రంజీ ట్రోఫీలో అరంగేట్రం చేసిన జమ్మూ కశ్మీర్.. తన 67 ఏళ్ల దేశవాళీ చరిత్రలో రంజీ ట్రోఫీ ఫైనల్ చేరడం.. గెలవడం ఇదేతొలిసారి. ఈ చరిత్రాత్మక క్షణాల్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రత్యక్షంగా వీక్షించారు. జమ్మూ కశ్మీర్ క్రికెట్ మాజీ డైరెక్టర్, బీసీసీఐ ప్రెసిడెంట్ మిథున్ మన్హాస్ ఈ మ్యాచ్‌ను తొలి రోజు నుంచే దగ్గరుండి చూశాడు. 2025-26 సీజన్‌లో తొలి మ్యాచ్ నుంచి బ్యాటింగ్, బౌలింగ్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చిన జమ్మూ కశ్మీర్.. ఫైనల్లోనూ కర్ణాటకను మట్టికరిపించింది. కర్ణాటకలోని హుబ్లి వేదికగా జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన జమ్మూ కశ్మీర్ 584 పరుగులు భారీ స్కోర్ చేసింది. శుభమ్ పుండిర్(121) సెంచరీతో రాణించగా.. యవెర్ హసన్(88), కెప్టెన్ పరాస్ డొగ్రా(70), అబ్దుల్ సమద్(61), వధావన్(70), సాహిల్ లోత్రా(72) హాఫ్ సెంచరీలతో రాణించారు. కర్ణాటక బౌలర్లలో ప్రసిధ్ కృష్ణ(5/99) ఐదు వికెట్లతో సత్తా చాటాడు. అనంతరం కర్ణాటక 93.3 ఓవర్లలో 293 పరుగులకు ఆలౌటైంది. మయాంక్ అగర్వాల్(266 బంతుల్లో 21 ఫోర్లతో 160) ఒంటరి పోరాటం చేయగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. ఆకీబ్ నబీ(5/54) ఐదు వికెట్లు తీయగా.. సునీల్ కుమార్(2/51), యుధ్వీర్ సింగ్(2/55) రెండేసి వికెట్లు పడగొట్టారు. అనంతరం జమ్మూ కశ్మీర్ రెండో ఇన్నింగ్స్‌లో 342/4 స్కోర్ వద్ద డిక్లేర్ ఇవ్వడంతో ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో కర్ణాటక కెప్టెన్ డ్రాకు అంగీకరించాడు. దాంతో టోర్నీ రూల్స్ ప్రకారం తొలి ఇన్నింగ్స్‌లో 291 పరుగుల ఆధిక్యాన్ని సొంతం చేసుకున్న జమ్మూ కశ్మీర్‌ను విజేతగా ప్రకటించారు. బారుముల్ల ఎక్స్‌ప్రెస్ ఆకిబ్ నబీ 60 వికెట్లతో జమ్మూ కశ్మీర్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. 10 మ్యాచ్‌ల్లో 12.56 సగటుతో అతను ఈ ఫీట్ సాధించాడు. బ్యాటింగ్‌లో 245 పరుగులు చేసిన ఆకిబ్ నబీకి ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ అవార్డు దక్కింది. రంజీ ట్రోఫీ 2025-26లో విజేతగా నిలిచిన జమ్మూ కశ్మీర్‌కు బీసీసీఐ తరఫున 5 కోట్ల రూపాయల ప్రైజ్ మనీ అందనుంది. రన్నరప్ జట్టుకు కూడా 3 కోట్ల రూపాయల నజరానా దక్కనుంది.

## అక్షర్ పటేల్, అర్ష్‌దీప్‌లపై నెటిజన్ల ఆగ్రహం

టీమిండియా స్టార్ క్రికెటర్ రింకూ సింగ్ ఇంట్లో తీవ్ర విషాదం నెలకొన్న వేళ, సహచర ఆటగాళ్ల ప్రవర్తన ఇప్పుడు సోషల్ మీడియాలో పెను దుమారం రేపుతోంది. లివర్ క్యాన్సర్‌తో పోరాడుతూ రింకూ తండ్రి ఖాన్‌చంద్ సింగ్ శుక్రవారం (ఫిబ్రవరి 27) కన్నుమూశారు. తండ్రి మరణ వార్త విన్న వెంటనే రింకూ సింగ్ చెన్నైలో ఉన్న జట్టును విడిచిపెట్టి, తన స్వగ్రామమైన అలీగఢ్‌కు చేరుకుని అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఒకవైపు రింకూ పుట్టెడు దుఃఖంలో ఉంటే, మరోవైపు భారత జట్టులోని కీలక ఆటగాళ్లైన అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్‌లు విమానంలో సరదాగా జోకులు వేసుకుంటూ రీల్స్ చేయడం అభిమానులకు తీవ్ర ఆగ్రహాన్ని కలిగిస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. చెన్నైలో జింబాబ్వేతో మ్యాచ్ ముగించుకున్న భారత జట్టు, తదుపరి మ్యాచ్ కోసం కోల్‌కతాకు విమానంలో బయలుదేరింది. ఈ ప్రయాణంలో అక్షర్ పటేల్ తన స్నాప్‌చాట్ ఖాతాలో ఒక వీడియోను పోస్ట్ చేశాడు. అందులో అర్ష్‌దీప్ సింగ్, అక్షర్ కలిసి జస్ప్రీత్ బుమ్రాను ఆటపట్టించడం, మహమ్మద్ సిరాజ్‌తో కలిసి నవ్వుతూ జోకులు వేయడం కనిపించింది. రింకూ సింగ్ తన తండ్రి అంత్యక్రియల్లో పాల్గొంటున్న అదే సమయంలోనే ఈ వీడియో సోషల్ మీడియాలో ప్రత్యక్షం కావడంతో నెటిజన్లు వీరిద్దరిపై విరుచుకుపడుతున్నారు. "మీకు కొంచెమైనా సిగ్గు ఉందా? మీ సహచర ఆటగాడి తండ్రి చనిపోతే కనీసం ఒక్కరోజు కూడా ఆగలేరా?" అంటూ అభిమానులు ఎక్స్‌లో దుమ్మెత్తిపోస్తున్నారు. ఒక జట్టుగా ఉన్నప్పుడు తోటి ఆటగాడి కష్టంలో పాలుపంచుకోవాల్సింది పోయి, ఇలా రీల్స్ చేస్తూ ఎంజాయ్ చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. బుమ్రా ఆ వీడియోలో వారిని పట్టించుకోకుండా సీరియస్‌గా ఉండటాన్ని గమనించిన నెటిజన్లు, బుమ్రాకు ఉన్నంత మెచ్యూరిటీ కూడా వీరికి లేదు అంటూ కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియా అంతా షేమ్ షేమ్ అంటూ వీరిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తండ్రిని కోల్పోయిన బాధలో ఉన్నప్పటికీ, రింకూ సింగ్ మార్చి 1న కోల్‌కతాలో వెస్టిండీస్‌తో జరగబోయే కీలకమైన సూపర్-8 మ్యాచ్ కోసం మళ్ళీ జట్టుతో చేరనున్నాడు. టీమ్ ఇండియా సెమీఫైనల్ చేరాలంటే ఈ మ్యాచ్ గెలవడం అత్యంత ముఖ్యం. ఇలాంటి ఒత్తిడి సమయంలో జట్టులో ఐక్యత, ఒకరిపై ఒకరికి గౌరవం ఉండాలని, ఇలాంటి సున్నితమైన విషయాల్లో ఆటగాళ్లు మరింత బాధ్యతగా ఉండాలని క్రీడా విశ్లేషకులు సూచిస్తున్నారు. అక్షర్, అర్ష్‌దీప్ చేసిన ఈ పని ఇప్పుడు భారత క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.





## డూ ఆర్ డై మ్యాచ్‌కు సిద్ధమైన టీమిండియా

### వెస్టిండీస్‌తో టీమిండియా అమీతుమీ సిద్ధం
### నేడు కోల్‌కతా వేదికగా వెస్టిండీస్‌తో మ్యాచ్
### గెలుపే ప్రధాన లక్ష్యంగా బరిలోకి ఇరు జట్లు

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో టీమిండియా డూ ఆర్ డై మ్యాచ్‌కు సిద్ధమైంది. తమ ఆఖరి సూపర్-8 పోరులో భాగంగా నేటి(ఆదివారం) రాత్రి కోల్‌కతా వేదికగా జరిగే మ్యాచ్‌లో వెస్టిండీస్‌తో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. ఇరు జట్లకు ఈ మ్యాచ్ క్వార్టర్ ఫైనల్ లాంటిది. ఇందులో గెలిచిన జట్టు సెమీస్ చేరనుండగా.. ఓడిన జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించనుంది. దాంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇరు జట్లు గెలుపే లక్ష్యంగా సిద్ధమవుతున్నాయి. గత టీ20 ప్రపంచకప్ 2024 తర్వాత ఇరు జట్లు ఒక్కసారి కూడా తలపడలేదు. ద్వైపాక్షిక టీ20 సిరీస్‌లో టీమిండియాను చివరిసారిగా ఓడించిన ఏకైక జట్టు కూడా వెస్టిండీస్. 2023 ఆగస్టులో భారత్‌పై విండీస్ టీ20 సిరీస్ గెలిచింది. అనంతరం భారత్ ఒక్క సిరీస్ కూడా కోల్పోలేదు. గత మూడేళ్లుగా ఇరు జట్లలో చాలా మార్పులు జరిగాయి. భారత్ బలం రెట్టింపు అవ్వగా.. వెస్టిండీస్ కూడా పటిష్టంగా మారింది. ఈ మెగా టోర్నీలో అత్యధిక సిక్స్‌లు కొట్టిన జట్టుగా వెస్టిండీస్ ఉంటే.. ఆ జట్టు కంటే 3 సిక్స్‌ల తక్కువతో రెండో స్థానంలో టీమిండియా ఉంది. అయితే బలబలాల పరంగా టీమిండియానే హాట్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది. విండీస్ కంటే భారత బౌలింగ్ విభాగం బలంగా ఉంది. మిస్టరీ స్పిన్‌తో పాటు వరల్డ్ క్లాస్ పేస్ బౌలర్లు ఉన్నారు. అయితే తమదైన రోజున విండీస్ ఆపడం ఎంత పెద్ద జట్టుకైనా కష్టం. ఈ కీలక పోరుకు టీమిం డియా ఎలాంటి మార్పులు లేకుండా బరిలోకి దిగే అవకాశం ఉంది. ప్రత్యర్థి జట్ల ఆఫ్ స్పిన్ మంత్రానికి చెక్ పెట్టేందుకు సంజూ శాంసన్ బరిలోకి దించుతూ టీమిండియా మేనేజ్‌మెంట్ రచించిన వ్యూహం ఫలించింది. దాంతో సంజూ, అభిషేక్ శర్మనే ఓపెనర్లుగా కొనసాగనున్నారు. ఇషాన్ కిషన్ ఫస్ట్ డౌన్‌లో ఆడనుండగా.. సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా, తిలక్ వర్మ మిడిలార్డర్‌లో ఆడనున్నారు. జింబాబ్వే మ్యాచ్ తరహాలో టాప్-6 బ్యాటర్లు చెలరేగితే.. టీమిండియాకు తిరుగుండదు. శివమ్ దూబే, అక్షర్ పటేల్ లోయరార్డర్‌లో ఆడనున్నారు. బౌలింగ్‌లో విఫలమవుతున్న శివమ్ దూబేను తప్పించాలనుకుంటే రింకూ సింగ్ తుది జట్టులోకి వస్తాడు. కానీ ఈ సాహసం టీమిండియా చేయకపోవచ్చు. బుమ్రా సూపర్ ఫామ్ భారత్‌కు కలిసొచ్చే అంశం. అతనితో పాటు అర్ష్‌దీప్ సింగ్, హార్దిక్ పాండ్యా, వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్‌తో కూడిన భారత బౌలింగ్ దాడిని ఎదుర్కోవడం వెస్టిండీస్‌కు పెద్ద సవాలే. మిగతా కాంబినేషన్‌లో పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు. మహమ్మద్ సిరాజ్, వాషింగ్టన్ సుందర్, రింకూ సింగ్ బెంచ్‌కే పరిమితం కానున్నారు. జింబాబ్వేతో భారత తుది జట్టు(అంచనా) భారత్: అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, శివమ్ దూబే, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, జస్ప్రీత్ బుమ్రా.

## పాకిస్థాన్ మేనేజ్‌మెంట్ సంచలన నిర్ణయం

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో భాగంగా శ్రీలంకతో జరుగుతున్న డూ ఆర్ డై మ్యాచ్‌లో పాకిస్థాన్ మేనేజ్‌మెంట్ సంచలన నిర్ణయం తీసుకుంది. తమ వెటరన్ బ్యాటర్ బాబర్ ఆజామ్‌పై వేటు వేసింది. ఇంగ్లండ్‌తో జరిగిన గత మ్యాచ్‌లో జట్టు ఓటమికి కారణమైన బాబర్ ఆజామ్ చర్యలు తీసుకుంది. మొత్తం మూడు మార్పులతో బరిలోకి దిగింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన శ్రీలంక బౌలింగ్ ఎంచుకుంది. పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నానని శ్రీలంక కెప్టెన్ డసన్ షనక తెలిపాడు. 'మేం ముందుగా బౌలింగ్ చేయాలనుకుంటున్నాం. ఇది మంచి పిచ్.. మ్యాచ్ సాగుతున్న కొద్దీ మంచు ప్రభావం కూడా ఉండవచ్చు. మేం బేసిక్స్ తగ్గట్లు ఆడాలి. మూడు విభాగాల్లోనూ (బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్) రాణించాల్సి ఉంది. గెలిచినా ఓడినా.. అభిమానులు ఎప్పుడూ మాకు మద్దతుగా ఉంటారు, అది మాకు మంచి ప్రేరణనిస్తుంది. మా జట్టులో రెండు మార్పులు చేశాం.'అని షనక పేర్కొన్నాడు. సెమీఫైనల్ చేరేందుకు తమకు ఇదొక గొప్ప అవకాశమని పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ అలీ అఘా తెలిపాడు. 'ఇదొక గొప్ప అవకాశం. మేం బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్.. ఇలా అన్ని విభాగాల్లోనూ రాణించాల్సి ఉంది. అప్పుడే ఆశించిన ఫలితం దక్కుతుంది. మేం ఒక మంచి స్కోరును బోర్డుపై ఉంచి, వారిని తక్కువ పరుగులకే కట్టడి చేయడానికి ప్రయత్నిస్తాం. ఏం చేయాలో తెలిసినప్పుడు కొన్నిసార్లు అది కష్టంగా అనిపించవచ్చు. మరికొన్నిసార్లు సులభంగా అనిపించవచ్చు. ఇదొక మిశ్రమ అనుభూతి. మా జట్టులో మూడు మార్పులు చేశాం.'అని సల్మాన్ అఘా పేర్కొన్నాడు.



## గవాస్కర్ వరల్డ్ కప్ ఫేవరెట్ల లిస్టులో కనిపించని భారత్

టీ20 వరల్డ్ కప్ 2026 క్లైమాక్స్‌కు చేరుతున్న కొద్దీ అంచనాలు పెరిగిపోతున్నాయి. ఈ క్రమంలో భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు క్రీడా వర్గాల్లో పెను సంచలనం రేపుతున్నాయి. ఈసారి కప్పు గెలిచే ఫేవరెట్ జట్ల జాబితా నుంచి ఆయన టీమిండియాను పూర్తిగా పక్కన పెట్టేశారు. భారత్ సెమీఫైనల్ రేసులో ఉన్నప్పటికీ, టైటిల్ నెగ్గే సత్తా మాత్రం ప్రస్తుతానికి ఇంగ్లాండ్, సౌతాఫ్రికా జట్లకే ఉందని గవాస్కర్ కుండబద్దలు కొట్టారు. సొంత గడ్డపై జరుగుతున్న టోర్నీలో భారత్‌కు మద్దతు ఇవ్వకుండా, గవాస్కర్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుత సూపర్ 8 పరిస్థితులను గమనిస్తే.. భారత్, వెస్టిండీస్ జట్లు సెమీస్ బెర్త్ కోసం హోరాహోరీగా పోరాడుతున్నాయి. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరగబోయే భారత్-వెస్టిండీస్ మ్యాచ్ సెమీస్ దిశగా అత్యంత కీలకం కానుంది. అయితే గవాస్కర్ మాత్రం సౌతాఫ్రికా, ఇంగ్లాండ్ జట్ల బౌలింగ్, బ్యాటింగ్ డెప్త్ చూసి ముగ్ధులయ్యారు. ముఖ్యంగా సౌతాఫ్రికా ఈ టోర్నీలో ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా అజేయంగా దూసుకుపోతోంది. గ్రూప్ దశలో కెనడా, ఆఫ్ఘనిస్థాన్, న్యూజిలాండ్ వంటి జట్లను ఓడించి, సూపర్ 8లో భారత్,



వెస్టిండీస్‌లపై కూడా విజయం సాధించి సెమీస్‌లో పాగా వేసింది. ఇక ఇంగ్లాండ్ జట్టుపై గవాస్కర్ ప్రశంసలు కురిపిస్తూ.. ఆ జట్టులో స్పిన్, పేస్ బౌలింగ్ విభాగం చాలా పటిష్టంగా ఉందని అభిప్రాయపడ్డారు. టోర్నీ ఆరంభంలో నేపాల్‌పై అతికష్టంగా నెగ్గి, వెస్టిండీస్ చేతిలో ఘోరంగా ఓడిపోయినప్పటికీ.. ఆ తర్వాత పుంజుకున్న తీరు అద్భుతమని ఆయన కొనియాడారు. ముఖ్యంగా ఆసియా దేశాలైన శ్రీలంక, పాకిస్థాన్‌లను స్పిన్ ట్రాక్‌లపై ఓడించడం ఇంగ్లాండ్ ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని గవాస్కర్ విశ్లేషించారు. "నా దృష్టిలో సౌతాఫ్రికా, ఇంగ్లాండ్ జట్లే అసలైన ఫేవరెట్లు. భారత్ కంటే ఈ రెండు జట్లకే కప్పు గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి" అని ఆయన ఇండియా టుడేతో మాట్లాడుతూ స్పష్టం చేశారు. సెమీఫైనల్ సమీకరణాల ప్రకారం.. సౌతాఫ్రికా తన గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు ఇంగ్లాండ్ తన చివరి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌ను ఓడిస్తే టేబుల్ టాపర్‌గా నిలుస్తుంది. అలా జరిగితే ముంబైలోని వాంఖడే స్టేడియంలో భారత్ లేదా వెస్టిండీస్‌తో ఇంగ్లాండ్ తలపడాల్సి ఉంటుంది. గవాస్కర్ అంచనాలు నిజమవుతాయా? లేక తన విమర్శకులకు బ్యాట్‌తో సమాధానం చెబుతూ టీమ్ ఇండియా విశ్వవిజేతగా నిలుస్తుందా? అనేది చూడాలి. ఏదేమైనా గవాస్కర్ లాంటి దిగ్గజం భారత్‌ను తక్కువ అంచనా వేయడం అభిమానులకు మాత్రం మింగుడుపడటం లేదు.



# భోజనం చేశాక ఈ పనులు చేస్తున్నారా? అయితే డేంజర్!

ఆరోగ్యంగా ఉండాలంటే ఆహార నియమాలు పాటించాలి. ఆహారాన్ని ఏ సమయంలో తినాలి? ఎంత మొత్తంలో తినాలి? తిన్న తర్వాత ఏం చేయాలి? ఏం చేయకూడదు? అనేది ప్రతి ఒక్కరికి తెలిసి ఉండాలి. మనలో చాలామంది తిన్న తర్వాత ఏం చేయకూడదు అనేది తెలుసుకోకుండా ఏది పడితే అది చేస్తూ ఉంటాం. దీనివల్ల మన ఆరోగ్యం పాడవుతుంది. భోజనం చేశాక ఈ పనులు చెయ్యొద్దు భోజనం చేసిన తర్వాత మనం చేయకూడని పనులు చేస్తే అది మన జీర్ణ ప్రక్రియ పైన తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. ఫలితంగా అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. అందుకే భోజనం తిన్న వెంటనే చేయకూడని కొన్ని పనులను ప్రస్తుతం మనం తెలుసుకుందాం. భోజనం తిన్న వెంటనే చాలామందికి కాఫీ, టీ తాగే అలవాటు ఉంటుంది. ఇలా తిన్న తర్వాత కాఫీలు, టీలు తాగడం ఏమాత్రం మంచిది కాదు. %ూశ్రీంశీ =ఝు‍ం% "ఏ బ్లడ్ గ్రూప్ వారికి ఎక్కువ వ్యాధులు వచ్చే అవకాశం ఉందో తెలుసా?" భోజనం చేశాక నిద్రపోతున్నారా? ఈ విధంగా చేస్తే మన శరీరంలో మనం తీసుకునే ఆహారంలో ఉన్న పోషకాలు శరీరం గ్రహించే శక్తి క్షీణిస్తుంది. భోజనం చేసిన తర్వాత చాలామంది నిద్రపోతారు. ఇక భోజనం చేసిన తర్వాత నిద్రపోతే ఆహారం సరిగ్గా జీర్ణం కాదు. దీని వల్ల అజీర్ణం, గుండెలో మంట, నిద్రలేమి వంటి సమస్యలు వచ్చి ఇబ్బంది పడతారు. ఇక చాలామంది భోజనం చేసిన వెంటనే నీళ్లు తాగుతారు. ఇది కూడా మంచిది కాదు. భోజనం చేసిన వెంటనే ఈ పనులతో డేంజర్ భోజనం చేసిన అరగంట తర్వాత నీళ్లను తాగితే మంచిది. తిన్న వెంటనే నీళ్లు తాగితే ఆహారం జీర్ణం కావడానికి మన బాడీలో సహకరించే ఎంజైమ్స్ తక్కువగా ఉత్పత్తి అవుతాయి. దీనివల్ల ఆహారం సరిగ్గా డైజెస్ట్ కాదు. ఇక చాలామందికి తిన్న తర్వాత స్నానం చేసే అలవాటు ఉంటుంది. ఇది కూడా ఏమాత్రం మంచిది కాదు. భోజనం చేసిన వెంటనే స్నానం చేస్తే రక్త ప్రసరణలో మార్పులు వస్తాయి. దీనివల్ల జీర్ణక్రియ మందగిస్తుంది. భోజనం చేశాక స్నానం, వ్యాయామం మంచిది కాదు అజీర్ణం, కడుపుబ్బరం వంటి సమస్యలు వస్తాయి. కాబట్టి భోజనం చేసిన వెంటనే స్నానం చేయడం ఏమాత్రం మంచిది కాదు. ఇక భోజనం చేసిన వెంటనే వ్యాయామం కూడా చేయకూడదు. ఇది కూడా మన జీర్ణ వ్యవస్థ పైన ఎఫెక్ట్ చూపిస్తుంది. కనుక భోజనం చేసిన తర్వాత వీటి విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది.ం

# హెన్నా వాడుతున్నారా ?
# నల్లని మెరిసే జుట్టు కావాలంటే ఇవి చేర్చండి!



జుట్టు సంరక్షణలో హెన్నా (మెహందీ) అనేది ఒక పురాతన , శక్తివంతమైన సహజ ఔషధం. ఇది జుట్టుకు అద్భుతమైన రంగును ఇవ్వడమే కాకుండా, జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా సహాయపడుతుంది. హెన్నా సహజంగా ఎరుపు-గోధుమ రంగును కలిగి ఉంటుంది. అయితే, కొన్ని సహజ పదార్థాలను కలిపితే, మీరు మీ జుట్టుకు కావలసిన నలుపు రంగును పొందవచ్చు. అంతేకాకుండా, ఈ సహజ హెన్నా ప్యాక్ మీ జుట్టుకు అదనపు మెరుపును కూడా అందిస్తుంది. రసాయనాలతో నిండిన డైలను ఉపయోగించడం కంటే, సహజమైన హెన్నాను ఉపయోగించడం మీ జుట్టు ఆరోగ్యానికి ఎల్లప్పుడూ ఉత్తమమైనది. నలుపు , మెరిసే జుట్టును సహజంగా పొందడానికి హెన్నా హెయిర్ ప్యాక్‌లో కలపాల్సిన ముఖ్యమైన పదార్థాల గురించి తెలుసుకుందాం.. ఉసిరికాయ (ఆమ్లా): ఉసిరికాయ జుట్టు సంరక్షణలో ఒక ముఖ్యమైన పదార్థం. ఇది విటమిన్ సి మరియు యాంటీఆక్సిడెంట్లతో సమృద్ధిగా ఉంటుంది. ఉసిరికాయ జుట్టును నల్లగా చేయడంలో చాలా ప్రభావవంతంగా పనిచేస్తుంది. హెన్నాలో ఉసిరికాయ పొడిని కలపడం వల్ల, జుట్టు యొక్క సహజ నలుపు రంగు మరింత మెరుగుపడుతుంది. అంతేకాకుండా, ఉసిరికాయ జుట్టు కుదుళ్లను బలోపేతం చేస్తుంది, జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది మరియు చుండ్రును తగ్గిస్తుంది. ఉసిరికాయ జుట్టుకు సహజమైన కండిషనర్‌గా కూడా పనిచేస్తుంది, ఇది జుట్టును మృదువుగా మరియు మెరిసేలా చేస్తుంది. హెన్నా ఎరుపు-గోధుమ రంగును ఇస్తే, ఇండిగో పొడి నీలి రంగును అందిస్తుంది. హెన్నా , ఇండిగో పొడిని కలిపి ఉపయోగించడం ద్వారా, మీరు మీ జుట్టుకు కావలసిన ముదురు నలుపు రంగును పొందవచ్చు. ఇండిగో పొడి జుట్టును రంగు వేయడమే కాకుండా, జుట్టును మృదువుగా మరియు ఆరోగ్యంగా ఉంచడంలో కూడా సహాయపడుతుంది. ఇది జుట్టు యొక్క ఆకృతిని మెరుగుపరుస్తుంది మరియు జుట్టు చిట్లడాన్ని తగ్గిస్తుంది. కాఫీ పొడి: కాఫీ పొడి సహజంగా జుట్టుకు గోధుమ లేదా ముదురు గోధుమ రంగును ఇవ్వడానికి ఉపయోగిస్తారు. హెన్నాలో కాఫీ పొడిని కలపడం వల్ల, హెన్నా యొక్క ఎరుపు రంగు తటస్థీకరించబడుతుంది . జుట్టుకు సహజమైన నలుపు రంగు వస్తుంది. కాఫీ పొడి జుట్టును మృదువుగా, మెరిసేలా చేయడానికి కూడా సహాయపడుతుంది. ఇది జుట్టు కుదుళ్లను ఉత్తేజపరుస్తుంది . జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. అంతేకాకుండా, కాఫీ పొడి జుట్టుకు ఒక ప్రత్యేకమైన సువాసనను అందిస్తుంది. %ూశీఱవతీవం దీం% టీ పొడి కషాయం (టీ డికాక్షన్): టీ పొడి కషాయం హెన్నా ప్యాక్ కోసం ఒక ముఖ్యమైన ద్రవ ఆధారం. సాధారణ నీటికి బదులుగా టీ పొడి కషాయాన్ని ఉపయోగించడం వల్ల, హెన్నా యొక్క రంగు విడుదల మరింత మెరుగుపడుతుంది . నలుపు రంగు మరింత స్పష్టంగా కనిపిస్తుంది. టీ పొడి కషాయం జుట్టును నల్లగా చేయడమే కాకుండా, జుట్టుకు ఒక సహజమైన మెరుపును కూడా అందిస్తుంది. ఇది చుండ్రును తగ్గించడానికి మరియు, జుట్టు కుదుళ్లను శుభ్రపరచడానికి కూడా సహాయపడుతుంది. స్ట్రాంగ్ టీ డికాక్షన్ కోసం బ్లాక్ టీ లేదా కాఫీ టీ పొడిని ఉపయోగించవచ్చు.నిమ్మరసం: నిమ్మరసం హెన్నా ప్యాక్‌లో ఒక ముఖ్యమైన పదార్థం. ఇది హెన్నా యొక్క రంగు విడుదలను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. నిమ్మరసంలోని సిట్రిక్ యాసిడ్ హెన్నా ఆకుల నుండి రంగును సమర్థవంతంగా విడుదల చేస్తుంది, ఇది జుట్టుకు మరింత ప్రకాశవంతమైన రంగును అందిస్తుంది. అంతేకాకుండా, నిమ్మరసం చుండ్రును తగ్గించడానికి, జుట్టు కుదుళ్లను శుభ్రపరచడానికి కూడా సహాయపడుతుంది. నిమ్మరసం సహజమైన బ్లీచింగ్ ఏజెంట్‌గా కూడా పనిచేస్తుంది, ఇది జుట్టుకు సహజమైన మెరుపును అందిస్తుంది. అయితే, నిమ్మరసం సున్నితమైన చర్మం కలిగిన వారికి చికాకు కలిగించవచ్చు, కాబట్టి కొద్ది మొత్తంలో మాత్రమే ఉపయోగించండి. హెన్నా హెయిర్ ప్యాక్ తయారీ విధానం: ఒక ఇనుప పాత్రలో హెన్నా పొడిని తీసుకోండి. మీకు జుట్టు పొడవును బట్టి హెన్నా పొడి మొత్తాన్ని నిర్ణయించుకోండి. అందులో ఉసిరికాయ పొడి, ఇండిగో పొడి, కాఫీ పొడిని కలపండి. మీరు ఎంత నలుపు రంగును కోరుకుంటున్నారో దాని ప్రకారం ఈ పొడుల మోతాదును సర్దుబాటు చేసుకోవచ్చు. ముదురు నలుపు కోసం ఇండిగో పొడిని ఎక్కువ మొత్తంలో ఉపయోగించండి. టీ పొడి కషాయాన్ని వేడి చేసి, కొద్దిగా చల్లారనివ్వండి. వేడి టీ కషాయాన్ని పొడి మిశ్రమంలో కొద్ది కొద్దిగా కలుపుతూ ఉండలు లేకుండా పేస్ట్‌లా తయారు చేసుకోండి. చివరగా, కొద్దిగా నిమ్మరసం కలపండి. ఈ మిశ్రమాన్ని రాత్రంతా లేదా కనీసం 8 గంటలు నానబెట్టండి. నానబెట్టడం వల్ల పదార్థాలన్నీ కలిసి హెన్నా రంగు బాగా విడుదల అవుతుంది. హెన్నా హెయిర్ ప్యాక్ ను ఎలా ఉపయోగించాలి: హెన్నా ప్యాక్‌ను జుట్టుకు అప్లై చేసే ముందు మీ జుట్టును శుభ్రం చేసుకోండి. నూనె లేదా క్రీమ్ లేకుండా జుట్టు పొడిగా ఉండాలి. చేతులకు గ్లోవ్స్ వేసుకొని, బ్రష్ లేదా చేతితో హెన్నా పేస్ట్‌ను జుట్టు కుదుళ్ల నుండి చివర్ల వరకు బాగా పట్టించండి. జుట్టు మొత్తానికి సమానంగా అప్లై చేయాలి. హెన్నా ప్యాక్‌ను కనీసం 2-3 గంటలు జుట్టుపై ఆరనివ్వండి. మీరు రంగును బట్టి సమయాన్ని పెంచుకోవచ్చు లేదా తగ్గించుకోవచ్చు. గోరువెచ్చని నీటితో హెన్నాను శుభ్రం చేసుకోండి. షాంపూ ఉపయోగించకుండా నీటితో మాత్రమే కడగాలి. హెన్నా రంగు పూర్తిగా జుట్టుకు పట్టడానికి 24 గంటలు పడుతుంది, కాబట్టి మరుసటి రోజు షాంపూతో తలస్నానం చేయవచ్చు. ఈ సహజ పదార్థాలను ఉపయోగించి తయారుచేసిన హెన్నా హెయిర్ ప్యాక్ మీ జుట్టుకు సహజమైన నలుపు రంగును , మెరుపును అందిస్తుంది. రసాయనాలతో నిండిన డైలను ఉపయోగించడం కంటే, సహజమైన ఈ పద్ధతిని ప్రయత్నించడం మీ జుట్టు ఆరోగ్యానికి, అందానికి చాలా మంచిది. క్రమం తప్పకుండా ఈ హెన్నా ప్యాక్‌ను ఉపయోగించడం వల్ల, మీ జుట్టు ఆరోగ్యంగా, నల్లగా , మెరిసేలా ఉంటుంది.

# చర్మ సౌందర్యాన్ని పెంచే కొల్లాజెన్ పుష్కలంగా ఉండే ఆహారాలివే!




యవ్వనంగా ఉండాలని, అందంగా కనిపించాలని ఎవరు మాత్రం కోరుకోరు. ప్రతి ఒక్కరు చర్మ సౌందర్యంతో అందంగా ఉండాలని కోరుకుంటారు. అటువంటివారు చర్మ సౌందర్యానికి ఎటువంటి ఆహారాలు తీసుకోవాలో తెలుసుకోవాలి. మన చర్మం నివారింపును సంతరించుకోవాలంటే యవ్వనంగా కనిపించాలంటే చక్కని మెరుపును సొంతం చేసుకోవాలంటే కొల్లాజెన్ ఎంతో అవసరం. కొల్లాజెన్ పుష్కలంగా ఉండే ఆహారాలు ఇది మన చర్మాన్ని వృద్ధాప్యం రాకుండా కాపాడుతుంది. వృద్ధాప్యం రాకుండా అనేక సౌందర్య సాధనాలను మనం ఉపయోగిస్తాం కానీ వాటికంటే సమతుల్యమైన ఆహారం, కొల్లాజెన్ పోషకాలతో ఉన్న ఆహారం తీసుకోవడం ఎంతో మంచిది. అటువంటి ఆహారాలలో కొన్ని ఆహారాలను మనం తెలుసుకుందాం. %ూశ్రీంశీ =ఝు‍ం% పాక్‌లో మారణహోమం: 20 మంది సైనికులు మృతి- ఇంటర్నెట్ బంద్? అవకాడో అవకాడో పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ ఈ పుష్కలంగా ఉంటాయి. అధిక సల్ఫర్, జింక్ కూడా ఉంటాయి. ఇది కొల్లాజన్ విచ్ఛిన్నతను నివారించడంలో సహాయపడుతుంది మన స్కిన్ టోన్ ను నిర్వహిస్తుంది ఆరోగ్యకరమైన చర్మాన్ని అందిస్తుంది. డ్రై ఫ్రూట్స్ బాదంపప్పు, వాల్నట్, జీడిపప్పు, అవిసె గింజలు, ఫ్రీ రాడికల్స్ తో పోరాడడానికి, కొల్లాజెన్ ఉత్పత్తికి ఎంతగానో దోహదం చేస్తాయి. వీటిని నిత్యం మనం ఆహారంలో భాగంగా చేసుకుంటే చర్మం ముడతలు రాకుండా ఉంటుంది. ఆకుకూరలు, బ్రోకలీ బచ్చలి కూర బ్రోకలీ వంటి క్లోరోఫిల్ అధికంగా ఉండే ఆహారాలు తీసుకోవడం వల్ల కొల్లాజెన్ స్థాయిలు పెరుగుతాయి. ఇవి చర్మం యొక్క స్థితిస్థాపకతను పెంచి ముడతలను నివారిస్తాయి. సిట్రస్ పండ్లు నిమ్మ, నారింజ, ద్రాక్ష వంటి సిట్రస్ పండ్లలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. ఇది ప్రో కొల్లాజెన్ ఉత్పత్తికి ఎంతగానో సహాయం చేస్తుంది. ఇది కొల్లాజెన్ గ్రహించే శరీర సామర్థ్యాన్ని మరింత పెంచుతుంది. టమాటాలు, గుడ్లు టమాటాలలో కూడా విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. ఇది మన చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుంచి కాపాడుతుంది. కొల్లాజన్ ఉత్పత్తికి ప్రోత్సాహాన్ని అందించి రక్షిస్తుంది. అంతేకాదు కోడిగుడ్లలో కూడా సల్ఫర్, ప్రోలిన్ అధికంగా ఉంటాయి. ఇవి మన శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తికి మద్దతునిస్తాయి. మన చర్మ ఆరోగ్యాన్ని రక్షించడానికి దోహదం చేస్తాయి.

## మార్కెట్

# కొనుగోలుదారులకు షాక్.. పసిడి ధర మళ్లీ పెరిగింది..!

### తులం ఎంత పలుకుతుందంటే..?

పసిడి ధరలు కొనుగోలుదారులకు షాక్ ఇచ్చాయి. ఇటీవల వరుసగా మూడురోజుల పాటు తగ్గుతూ వచ్చిన ధరలు మంగళవారం స్వల్పంగా పెరిగాయి. దేశ రాజధానిలో తులం బంగారం ధర రూ.88,790కి చేరింది. బంగారం ధరలను పెరిగిందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ పేర్కొంది. 24 క్యారెట్ల గోల్డ్‌పై రూ.40 పెరిగి తులానికి రూ.88,790కి పెరిగింది. ఇక 22 క్యారెట్స్ స్వర్ణం ధర సైతం రూ.40 పెరిగి రూ.80,390కి చేరింది. ఇక వెండి ధర రూ.350కి తగ్గి.. కిలో రూ.98,900కి చేరుకుంది. గ్లోబల్ మార్కెట్‌లో ఏప్రిల్ డెలివరీకి సంబంధించిన కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ ఔన్స్‌కు 19.30 డాలర్లు పెరిగి 2,918.70కి చేరుకుంది. స్పాట్ గోల్డ్ ఔన్స్‌కు 0.82శాతం పెరిగి.. 2,912.43 డాలరకు చేరింది. ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ అండ్ కరెన్సీ రీసెర్చ్ అనలిస్ట్ వైస్ ప్రెసిడెంట్ జతిన్ త్రివేది మాట్లాడుతూ.. డాలర్ ఇండెక్స్ బలహీనపడడంతో బంగారం ధరలు పెరిగాయన్నారు. యూఎస్‌లో సుంకాల ఆందోళనలు ఆర్థిక అనిశ్చితిని సూచిస్తున్నాయన్నారు. దాంతో సురక్షితమైన పెట్టుబడికావడంతో బంగారం కొనుగోళ్లు బలంగా ఉన్నాయన్నారు. ఈటీఎఫ్ ఇన్‌ఫ్లోలు బుల్లిష్ సెంటిమెంట్‌కు మద్దతునిచ్చాయి. ఆసియా మార్కెట్‌లో కామెక్స్ సిల్వర్ ఫ్యూచర్ ఔన్స్‌కు 1.44శాతం పెరిగాయి. హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ కమోడిటీ విశ్లేషకుడు సౌమిల్ గాంధీ మాట్లాడుతూ.. బులియన్ మార్కెట్ పెట్టుబడిదారులు ట్రంప్ సుంకాలను నిశితంగా పరిశీలిస్తున్నారన్నారు. సమీప భవిష్యత్‌లో సుంకాల యుద్ధం ఎలాంటి రూపాన్ని తీసుకుంటుందో అంచనా వేసేందుకు పెట్టుబడిదారులు ప్రయత్నిస్తున్నారన్నారు. ఇక దేశంలోని వివిధ నగరాల్లో బంగారం ధరలను పరిశీలిస్తే.. చెన్నైలో 22 క్యారెట్స్ గోల్డ్ రూ.80,200 ఉండగా.. 24 క్యారెట్స్ పసిడి రూ.87,490 పలుకుతున్నది. ముంబయిలో 22 క్యారెట్స్ పుత్తడి రూ.80,200 ఉండగా.. 24 క్యారెట్ల బంగారం రూ.87,490కి చేరింది. తెలంగాణలోని హైదరాబాద్‌తో పాటు ఏపీలోనూ ఇవే ధరలు కొనసాగుతున్నాయి. ఇక వెండి ధర కిలోకు రూ.1,07,000 పలుకుతున్నది.

# అమెరికా స్టాక్ మార్కెట్లలో భారీ కుదుపు

### దాదాపు రూ.349 లక్షల కోట్లు మేరకు ఆవిరి

### ఆర్థిక వ్యవస్థ పటిష్టంగానే ఉందని వైట్‌హౌజ్ ప్రకటన



న్యూయార్క్ : అమెరికా స్టాక్ మార్కెట్లు దాదాపు 20 రోజుల వ్యవధిలోనే భారీగా పతనం అయ్యాయి. స్టాక్స్‌లోని మదుపర్ల సంపద 4 ట్రిలియన్ డాలర్ల మేర అంటే దాదాపు రూ.349 లక్షల కోట్లు మేరకు ఆవిరైపోయింది. ఇది యూకే, ఫ్రాన్స్ వంటి దేశాల జీడీపీ కంటే ఎక్కువ కావడం గమనార్హం. ముఖ్యంగా అమెరికా ఫెడరల్ గవర్నమెంట్ షట్‌డౌన్ భయాలు సూచీలను వెంటాడుతున్నాయి. దీనికి ట్రంప్ అస్థిర విధానాలు తోడయ్యాయి. ఓవైపు మారెట్లు పతనం అవుతున్నా.. ఆర్థిక వ్యవస్థ మాత్రం బలంగానే ఉందని శ్వేతసౌధంలోని ది నేషనల్ ఎకనామిక్ కౌన్సిల్ అధిపతి కెవిన్ హస్సెట్ చెప్పారు. ఆర్థిక మాంద్యం భయాలను తోసిపుచ్చారు. ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని చెప్పేందుకు పలు కారణాలున్నాయన్నారు. ఇక సుంకాల విషయంలోని అస్పష్టత త్వరలోనే తొలగిపోతుందన్నారు. ఇక పన్ను కోతలు పెట్టుబడులను ప్రోత్సహిస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్లపై తీసుకొనే నిర్ణయం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఎస్అండ్‌పీ 500 సూచీ ఫిబ్రవరి 19వ తేదీన నమోదు చేసిన ఆల్‌టైమ్ హై నుంచి ఇప్పటికి 8 శాతానికిపైగా విలువ కోల్పోయింది. నాస్‌డాక్ కాంపోజిట్ డిసెంబర్‌లో నమోదుచేసిన అత్యధిక విలువ నుంచి 10శాతం పతనమైంది. ఇక ఒక్క సోమవారమే 1.7 ట్రిలియన్ డాలర్ల సంపద కరిగిపోయింది. 2022 సెప్టెంబర్ తర్వాత ఈ స్థాయిలో పతనం కావడం ఇదే తొలిసారి. ఇక మస్క్ నేతృత్వంలోని టెస్లా షేర్ ధర 15శాతం పతనం కావడం గమనార్హం. డిసెంబర్ 17 నుంచి ఈ సంస్థ షేరు విలువ 50శాతం ఆవిరైంది. నాడు అత్యధికంగా 479.86 డాలర్లు ఉండగా.. నేడు అది 222.15 డాలర్లకు చేరింది. వివిధ కారణాలు కలిసి ఓ ప్యాకేజీలా మార్కెట్లను దెబ్బతీస్తున్నాయి. ముఖ్యంగా వాణిజ్య విధానాల్లో హఠాత్తుగా వస్తున్న మార్పులు, ఆర్థిక మాంద్యం భయాలు, స్టాక్స్ అధిక విలువలు వంటివి కారణమవుతున్నాయని లాజర్డ్ సీఈవో పీటర్ ఓర్స్‌జాగ్ వెల్లడించారు. ముఖ్యంగా ప్రధాన వాణిజ్య భాగస్వాములైన కెనడా, మెక్సికో, ఐరోపాతో వాణిజ్య యుద్ధాల వల్ల చాలా కంపెనీలు తమ వ్యాపార వ్యూహాలను పునఃపరిశీలిస్తున్నాయన్నారు. అమెరికాలోని భారీ సంపన్నులపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటోంది. అక్కడి మార్కెట్లలో 50 శాతం విలువైన సంపద 1శాతం మంది వద్ద ఉంటుంది. ఇక 37శాతం విలువైన సంపద 10శాతం మంది వద్ద ఉంటుంది. 12శాతం వాటా 40శాతం మంది వద్ద కేంద్రీకృతమైంది. మిగిలిన 1శాతం వాటా 50శాతం మంది ప్రజల చేతిలో ఉందని ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ సెయింట్ లూయిస్ డేటా పేర్కొంది. ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాట్లాడుతూ ప్రస్తుతం దేశం మార్పు దశలో ఉందని ఓ టీవీ షోలో అభివర్ణించారు. అదే సమయంలో ఆర్థిక మాంద్యం రాదని కచ్చితంగా చెప్పలేదు. యాంకర్ అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. తాను అలాంటి విషయాలను ఊహించడాన్ని కూడా ఇష్టపడనని చెప్పారు. ఇప్పుడు తమ ప్రభుత్వం చాలా పెద్దపని చేపట్టిందని.. ఈ క్రమంలో మార్పు దశ ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్ పతనానికి, ఆర్థిక మాంద్యానికి ట్రంప్ సర్కారు సిద్ధమైందనే సంకేతాలున్నట్లు మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. గోల్డ్‌మన్ శాక్స్ కూడా అమెరికాలో వచ్చే 12 నెలల్లో ఆర్థిక మాంద్యం వచ్చేందుకు 15-20శాతం అవకాశాలున్నాయని అంచనా వేసింది.

# భూదాన్ భూములు వ్యవహారంలో సంయమనం పాటించండి

### అర్హులైన పేదలను గుర్తించాల్సిందిగా కలెక్టర్‌కు ఆదేశం

### పేదలకు ఇందిరమ్మ ఇళ్ళు ఇచ్చి ప్రభుత్వం అండగా ఉంటుంది

### మంత్రి తుమ్మల నాగేశ్వర రావు



హైదరాబాద్,ఫిబ్రవరి28 : ఖమ్మం జిల్లాలో భూదాన్ భూముల వ్యవహారంలో జరుగుతున్న ప్రచారం పట్ల ఆవేశానికి లోనుకాకుండా కార్యకర్తలు సంయమనంతో వ్యవహరించాలని కోరుతున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. ఈ విషయంలో దుష్ప్రచారం చేస్తున్న కొందరు రాజకీయ ప్రేరేపిత వ్యక్తులు, సోషల్ మీడియా వ్యక్తుల పై కేసులు పెట్టాల్సిన అవసరం లేదు. పేదల పట్ల మన నిబద్ధత, మానవీయ కోణం రేపటి నాడు స్పష్టమయ్యాక వాళ్లు కూడా ప్రభుత్వ చర్యను సమర్ధించాల్సిన పరిస్థితి వస్తుంది. భూదాన్ భూముల్లో అర్హులైన ప్రతి పేదవాడికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో గూడు ఇచ్చే బాధ్యత నాది. పేదల సంఘం ముసుగులో విలువైన ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు అన్యాక్రాంతం చేసి, పేదలను అడ్డు పెట్టుకుని సొమ్ము చేసుకుంటుంటే బాధ్యత గల ప్రభుత్వంగా చూస్తూ ఊరుకోదు. అక్రమార్కుల పై చర్యల విషయంలో ఎంత కఠినంగా ఉంటామో, పేదల విషయంలో అంతే మానవీయంగా ఉంటాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రజా ప్రభుత్వంలో ఏ పేదవాడికి అన్యాయం జరగదు. ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు కట్టింది, గృహ ప్రవేశాలు చేయించే బాధ్యత నేను తీసుకుంటాను. అక్రమార్కుల చేతిలో మోసపోయి, హక్కు లేని భూమిలో, కబ్జాదారుల్లాగా బతకాల్సిన ఖర్మ పేదలకు లేదు. గత ఆరేడేళ్లుగా భూదాన్ భూముల్లో కనీస సదుపాయాలు లేని దుర్భర పరిస్థితుల్లో పేదలు బతుకుతున్నారు. కరెంట్, డ్రైనేజీ, తాగేందుకు కనీసం మంచినీటి వసతి, సరైన రోడ్లు కూడా లేని దుస్థితి అక్కడ ఉంది. కొందరు కబ్జాదారుల చర్యలతో అన్యాక్రాంతమైనందువల్ల అక్కడ కనీస సదుపాయాలు కూడా కల్పించలేని పరిస్థితి ప్రభుత్వానికి ఉంది. ఈ ప్రభుత్వంలో పేదలు ఇంత దుర్భర బతుకులు బతకాల్సిన అవసరం లేదు. ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు కట్టించి, సకల సౌకర్యాలతో, మీ ఇంటిపై మీకు సంపూర్ణ హక్కులతో, ఆత్మగౌరవంతో బతికేలా మీ తరపున నేను ఉన్నానని భరోసా ఇస్తున్నాను. దోపిడీదారులు, భూకబ్జాదారుల మాటలకు లోనై ఆందోళన చెందవద్దు అని పేదలకు పిలుపునిస్తున్నాను. పేదల వెరిఫికేషన్ వేగంగా సాగుతోంది. నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో నేను పేదలకు చేసిన సేవ జిల్లా ప్రజానీకానికి తెలుసు. కమ్యూనిస్ట్ పార్టీలకు నా నిబద్ధత తెలుసు. పేదల సంఘం పేరుతో సాగుతున్న భూదందా పై కమ్యూనిస్ట్ పార్టీలు కూడా ఖండించారు. వాస్తవాలు కప్పి పుచ్చి అక్రమార్కులకు వంత పాడిన వారి గూర్చి ప్రజలకు తెలుసు. కాంగ్రెస్ పార్టీ నేతలు కార్యకర్తలు సోషల్ మీడియా వార్తలపై పట్టించుకోవాల్సిన అవసరం లేదు. పేదల సంఘం చేతిలో మోస పోయిన పేదలకు మానవీయ కోణంలో ప్రభుత్వం అండగా ఉంటుంది. భూదాన్ భూములు అక్రమాల పై ప్రభుత్వం విచారణ సాగుతుంది. పేదల ముసుగులో ఓ సంఘం చేసిన దోపిడి పై వచ్చిన పిర్యాదులు ఆధారంగా విచారణ సాగుతుంది. విచారణ పూర్తయ్యే వరకు కాంగ్రెస్ పార్టీ నేతలు కార్యకర్తలు సంయమనం పాటించాలి. యూట్యూబ్ జర్నలిస్ట్ లపై పోలీస్ పిర్యాదులు వద్దు. విచారణ పూర్తయ్యాక నిజాలు వెలుగులోకి వస్తాయని, వాస్తవాలు తెలిసి ఆ జర్నలిస్ట్ లు పశ్చాత్తాప పడతారు. దుష్ప్రచారం చేసే ప్రతిపక్ష నేతలకు ప్రజలే బుద్ధి చెబుతారు. నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి ధ్యేయంగా, పేదల సంక్షేమమే ప్రాధాన్యంగా పని చేశాను. ఇకపై అంతే నిబద్ధతతో ప్రజలకు సేవ చేస్తాను.కలెక్టరేట్ పక్కనే ప్రభుత్వ స్థలంలో అమాయక పేదలకు నకిలీ పట్టాలు ఇచ్చి.. వారితో గుడిసెలు వేయించి పేదల సంఘం పేరుతో లక్షలు రూపాయలు వసూళ్లు చేసి చుట్టు పక్కల ప్రైవేట్ స్థలాల వారిపై దౌర్జన్యం చేస్తుంటే ప్రభుత్వం చట్ట ప్రకారం చర్యలు తీసుకుంది. దీనిని రాజకీయ దుమారంగా మార్చి పబ్బం గడుపుకోవాలని కొందరు చూస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టే ప్రభుత్వానికి వెలుగుమట్ల బాధితులకు ఇళ్లు కట్టించి ఇవ్వడం భారమా అని అన్నారు. వెలుగుమట్ల భూదాన్ భూములు ఆక్రమణలో పేదల సంఘం చేసిన మోసాలు బయటకు రాకుండా ప్రతిపక్ష పార్టీల సహకారంతో సోషల్ మీడియాలో ప్రభుత్వం పై బురద జల్లే ప్రయత్నం చేశారు. వాస్తవాలు కమ్యూనిస్ట్ పార్టీలకు తెలుసు కాబట్టే పేదల సంఘం దురాగతాలు వారు కూడా ఖండించారు. భూదాన్ భూములకు నకిలీ పట్టాలు ఇచ్చి పేదలతో గుడిసెలు వేయించి తీరా వారి అక్రమం బయటపడితే.. పేదల వద్ద లక్షలు రూపాయలు వసూళ్లు చేసిన ముఠాపై ప్రభుత్వం ఉదారంగా ఉండాలా ?చట్ట ప్రకారం చర్యలు తీసుకోకపోతే ఇదే అలుసుగా ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతం అవ్వవా? అని ప్రజలే ఆలోచన చేయాలి. భూదాన్ భూములు వ్యవహారంలో అర్హులైన పేదలను గుర్తించాల్సిందిగా ఇప్పటికే జిల్లా కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేశాను. పేదల గుర్తింపు వెరిఫికేషన్ ప్రక్రియ వేగంగా సాగుతుంది. ఇళ్ళు లేని పేదల గుర్తింపు పూర్తవగానే వారికి ఇళ్లు నిర్మాణం చేసేందుకు పది ఎకరాల ప్రభుత్వ స్థలం సిద్ధం చేయాలని కలెక్టర్ కు సూచించాను. పేదల సంఘం పేరుతో ఓ సంఘం చేసిన అరాచకం పై కమ్యూనిస్ట్ పార్టీలు వాస్తవాలు మాట్లాడారు. బాధ్యత లేని ప్రతిపక్ష బీ.ఆర్.ఎస్ మాత్రం పేదలను మోసం చేసిన వారిని కాపాడేలా హంగామా చేయడం రాజకీయ దిగజారుడుతనం అని మంత్రి తుమ్మల మండిపడ్డారు.

## ఘటన తీవ్రంగా కలచివేసింది

### భద్రతా ప్రమాణాలు పాటించనివారిపై చర్యలు

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్

అమారవతి,ఫిబ్రవరి28 : కాకినాడ పేలుడు ఘటనపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందిస్తూ.. 'కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలోని బాణసంచా కేంద్రంలో జరిగిన భారీ పేలుడు తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఈ దుర్ఘటనలో 18 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. 5 కిలోమీటర్ల మేర పేలుడు ధాటికి పక్కనే ఉన్న బడులు, ఇళ్లు దెబ్బతినడం ప్రమాద తీవ్రతకు అద్దం పడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి తీవ్రంగా గాయపడిన వారికి మెరుగైన ఉచిత వైద్యం అందించాలి. మృతుల కుటుంబాలకు తగిన ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలి. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, భద్రతా ప్రమాణాలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి' అంటూ పీవీఎన్ మాధవ్ కోరారు.

## కూటమి సర్కార్ రాకతో పరిశ్రమల వెల్లువ

### బ్లూజెట్ హెల్త్ కేర్‌కు లోకేశ్ శంకుస్థాపన

అనకాపల్లి,ఫిబ్రవరి28 : రాంబిల్లి మండలం సీతపాలెం సమీపంలో 'బ్లూ జెట్ హెల్త్ కేర్' ఔషధ తయారీ యూనిట్ ఏర్పాటుకు శంకుస్థాపన జరిగింది. మంత్రి నారా లోకేశ్ ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి పరిశ్రమలు క్యూ కడుతున్నాయన్నారు. ఉత్తరాంధ్రలో మరో భారీ ఔషధ తయారీ పరిశ్రమకు శ్రీకారం జరిగిందని తెలిపారు. ఔషధ, ఆరోగ్య సంరక్షణ రంగంలో బ్లూజెట్ ప్రత్యేక గుర్తింపు కలిగి ఉందన్నారు లోకేశ్. ఈ పరిశ్రమకు ప్రభుత్వం 102.48 ఎకరాల భూమిని కేటాయించిందని చెప్పారు. మూడు దశల్లో అత్యంత వేగంగా ఫార్మా కంపెనీని నిర్మించనున్నారని తెలిపారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి లోకేశ్ వెల్లడించారు. రూ. 2,300 కోట్ల వ్యయంతో ఔషధ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయనున్నారు. మొత్తం 102.48 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం జరుగనుంది. మూడు దశల్లో అత్యంత వేగంగా నిర్మాణాన్ని పూర్తి చేయనున్నారు. ఈ యూనిట్ ద్వారా సుమారు 1,750 మందికి బ్లూ జెట్ పరిశ్రమ ఉద్యోగాలను కల్పించనుంది.కేంద్రంలో నరేంద్ర మోదీ.. ఏపీలో చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని మంత్రి నారా లోకేశ్ ఈ సందర్భంగా అన్నారు. ఆ సంస్థ ఫార్మాస్యూటికల్ ఇంటర్మీడియట్లు, కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఇందుకు రూ.2,300 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. 1,750 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఏపీకి బ్లూజెట్ సంస్థ రావడం శుభసూచికం. ఏపీలో డబుల్ ఇంజిన్ సర్కారు కాదు.. డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కారు నడుస్తోంది. నమో అంటే నరేంద్ర మోదీ అని అందరికీ తెలుసు. ఏపీలో నమో అంటే.. నాయుడు, మోదీ అని అంటారని లోకేశ్ పేర్కొన్నారు.

## 27నుంచి ఒంటిమిట్ట వార్షిక బ్రహ్మోత్సవాలు

### బుక్‌లెట్‌ను విడుదల చేసిన టిటిడి ఛైర్మన్

### పరాభవనామ పంచాంగం ఆవిష్కరణ

తిరుమల,ఫిబ్రవరి28 : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల బుక్‌లెట్‌ను ఈవో ఎం.రవిచంద్రతో కలిసి తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆవిష్కరించారు. తిరుమల అన్నమయ్య భవన్‌లో శనివారం బోర్డు సమావేశం అనంతరం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ.. మార్చి 27 నుంచి ఏప్రిల్ 5 వరకు ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 1న రాష్ట్ర పండుగగా శ్రీ సీతారాముల కల్యాణాన్ని తితిదే అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవోలు వి.వీరబ్రహ్మం, డా.ఎ.శరత్, సీవీఎస్వో మురళీకృష్ణ, పలువురు బోర్డు సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. శ్రీ వేంకటేశ్వర స్వామి అనుగ్రహంతో శ్రీ పరాభవ నామ సంవత్సరంలో ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సకల ఐశ్వర్యాలు సమకూరాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. ధర్మ ప్రచారంలో భాగంగా తితిదే ప్రతి ఏడాది ఉగాది నాటికి పంచాంగాలను ముద్రించి అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రాబోయే శ్రీ పరాభవ నామ సంవత్సర పంచాంగాన్ని ఆకర్షణీయంగా ముద్రించింది. పంచాంగాన్ని తితిదే ఆస్థాన సిద్ధాంతి తంగిరాల వేంకటకృష్ణ పూర్ణ ప్రసాద్ సిద్ధాంతి రచించారు. రాజాది నవనాయకుల ఫలితాలతోపాటు రాశిఫలాలు, వధూవర గుణమేళనం, వివాహాది సుముహూర్త నిర్ణయాలు, తితిదేలో నిర్వహించే విశేష ఉత్సవాలు తదితర విషయాలను చక్కగా వివరించారు.

## శ్రీవారి ముడుపు పత్రం పథకం' ప్రారంభం

### విద్య, భద్రత, భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యం

### రూ.120 కోట్లతో అత్యాధునిక టెక్నాలజీతో వంటశాల

### టీటీడీపై అసత్య పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు

### రూ.5,456.26 కోట్ల బడ్జెట్‌కు ధర్మకర్తల మండలి ఆమోదం

### టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల,ఫిబ్రవరి28 : టీటీడీ 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.5,456.26 కోట్ల బ్జడెట్‌కు ధర్మకర్తల మండలి ఆమోదం తెలిపిందని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ బడ్జెట్‌కు ఆమోదం తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు.తిరుమల అన్నమయ్య భవనంలో ఈవో ఎం.రవిచంద్రతో కలసి శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో టీటీడీ బోర్డు సబ్ కమిటీ సిఫార్సుల మేరకు టీటీడీ చరిత్రలో తొలిసారిగా తిరుమల తిరుపతి దేవస్థానం విద్యా సంస్థల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో మెరుగైన విద్యను అందించేందుకు గాను రూ.118.89 కోట్లు కేటాయింపు చేశారు.. ఇందులో భాగంగా డిజిటల్ క్లాస్ రూములు, అదనపు హాస్టల్ బ్లాకులు, వంట గదుల ఆధునీకరణ, ఇతర మౌళిక సదుపాయాలు వంటి సమూలమైన మార్పులను తీసుకొచ్చేందుకు ఆమోదం ఇచ్చింది. భక్తుల విజ్ఞప్తి మేరకు శ్రీవారికి ముడుపులు అందించే దాతల సౌకర్యార్థం 'శ్రీవారి ముడుపు పత్రం పథకం' ను ప్రయోగాత్మకంగా ప్రారంభించాలనే నిర్ణయం తీసుకున్నాం. ప్రస్తుతం భక్తులు మొక్కుల రూపంలో శ్రీవారి హుండీలో కానుకలు వేస్తున్నారు. ఇందుకు బదులుగా భక్తులు తిరుమలలో ఏర్పాటు చేసే కౌంటర్లలో చెల్లింపులు చేస్తే అందుకు తగిన ముడుపు పత్రాలు అందజేస్తారు. వాటిని నేరుగా శ్రీవారి హుండీలో వేయవచ్చు. తద్వారా భక్తులు నగదు, నాణెలిలు తీసుకువచ్చేందుకు ఉన్న ఇబ్బందులు తొలగుతాయి. తిరుమలలో భక్తుల సౌకర్యార్థం అదనంగా మరో అన్న ప్రసాద భవనం, ఆధునిక వంటశాలను అత్యాధునిక టెక్నాలజీతో నిర్మించేందుకు రిలయన్స్ సంస్థ రూ.100 కోట్ల నుండి రూ.120 కోట్లు విరాళం అందించేందుకు ముందుకు రావడంతో పనులు ప్రారంభించేందుకు ఆమోదం ఇచ్చారు. ఆలయాలు, ప్రాకారాలు, రాజ గోపురాలు తదితర నిర్మాణాలకు అయ్యే ఖర్చును దృష్టిలో ఉంచుకుని తదనుగుణంగా శ్రీవాణి ట్రస్టు మార్గదర్శకాలను మార్పు చేసేందుకు ఆమోదం ఇచ్చారు. ఒంటిమిట్టలో 108 అడుగుల జాంబవంతుడి విగ్రహం ఏర్పాటుకు గాను డ్రై ఐల్యాండ్ నిర్మించేందుకు నిర్ణయం. అందుకుగాను రూ.20.17 కోట్లతో పనులకు ఆమోదం. కోయంబత్తూర్, గువహటి, బెలగావి, అదేవిధంగా పాట్నా వద్ద మోకామ నగరంలో శ్రీవారి ఆలయాల నిర్మాణాలకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు టీటీడీకి కేటాయించిన భూమిని తీసుకునేందుకు ఆమోదం. వకుళమాత ఆలయంలో అక్షర గోవిందం పేరుతో అక్షరాభ్యాస కార్యక్రమం ప్రారంభించాలని నిర్ణయం. ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 1వ తేదీన జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణానికి విచ్చేసే దాదాపు 70 వేల మంది భక్తులకు ఈ ఏడాది అదనంగా రూ.50 విలువ చేసే తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని ఉచితంగా అందించాలని నిర్ణయించాం. గత ఏడాది తలంబ్రాల ప్యాకెట్ కిట్‌ను అందించిన విషయం తెలిసిందే. ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భక్తులను ఆకట్టుకునేలా రూ. 4.25 కోట్లతో విద్యుత్ అలంకరణలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, ఎల్‌ఈడి బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం.ఆర్మీ వెల్ఫేర్ ప్లేస్ మెంట్ ఆర్గనైజేషన్ ద్వారా తిరుపతిలో 356 మంది, తిరుమలలో 371 మంది భద్రత సిబ్బంది నియామకానికి ఆమోదం. అలిపిరి తనిఖీ కేంద్రంలో రూ.8 కోట్లతో ఎక్స్ రే బ్యాగేజ్ స్కానర్లు, డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు ఏర్పాటుకు ఆమోదం. తిరుమల, తిరుపతిలోని టీటీడీ గోశాలలు, పలమనేరు లోని శ్రీవేంకటేశ్వర ఇంక్యూబేషన్ సెంటర్ లలో రూ.11.28 కోట్లతో అభివృద్ధి పనులకు ఆమోదం. టీటీడీ ఆలయాల్లో పరిచారకులుగా పని చేస్తున్న 51 మందికి అర్చకులుగా పదోన్నతి కల్పించేందుకు గాను ప్రభుత్వానికి నివేదించాలని నిర్ణయం. పార్వతీపురం మన్యం జిల్లాలో శ్రీ వేంకటేశ్వర దివ్య క్షేత్రం నిర్మాణానికి రూ.14.25 కోట్లు కేటాయింపు. తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి ఆలయం చుట్టూ సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులకు ఆమోదం. దేశవ్యాప్తంగా ఉన్న టీటీడీ ఆలయాలు, సత్రాలు, విశ్రాంతి భవనాలు, యాత్రికుల వసతి సముదాయాలు, విద్యా సంస్థలు, ఆసుపత్రులు, కల్యాణ మండపాల భద్రతను పర్యవేక్షించేందుకు తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో రూ.10.75 కోట్లతో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుకు ఆమోదం. ఇటీవల చాలామంది తమ స్వప్రయోజనాల కోసం తిరుమలలో అసత్య కథనాలతో రీల్స్ చేసి సోషియల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. ఎంతో భక్తితో తిరుమల పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తుల మనోభావాలను దెబ్బతినేలా పోస్టు పెట్టేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టీటీడీ హెచ్చరిస్తోంది. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవోలు వి.వీరబ్రహ్మం, డా.ఎ.శరత్, సివిఎస్వో మురళికృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శారద పీఠం భూములు కొనసాగింపు

### జలమండలికి కేటాయింపులు రద్దు

### అధికారులపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం

హైదరాబాద్,ఫిబ్రవరి28 : కోకాపేటలో శారదా పీఠానికి కేటాయించిన భూమిని పీఠానికే కొనసాగించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. పీఠం భూములు జల మండలికి కేటాయించిన నేపథ్యంలో అక్కడ సాగుతున్న నిర్మాణ పనుల విషయాలను పీఠం ప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ అంశంపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో శనివారం సాయంత్రం సమావేశమయ్యారు. కోకాపేట భూముల్లో పీఠం ఆధ్వర్యంలో వివిధ నిర్మాణాల తాజా స్థితిని ముఖ్యమంత్రి తెలుసుకున్నారు. పీఠం భూములను జలమండలికి కేటాయించే సమయంలో నిర్మాణాల స్థితిని తెలియజేయకపోవడంపై ముఖ్యమంత్రి మండిపడ్డారు. జల మండలికి కేటాయింపులు రద్దు చేసి పీఠానికే ఆ భూములు కొనసాగించాలని ఆదేశించారు. మంత్రి శ్రీధర్‌బాబును కలిసి నిర్మాణాలు, ఇతర పరిస్థితులను వివరించాలని ముఖ్యమంత్రి, పీఠం ప్రతినిధులకు సూచించారు.

## చంద్రగిరి వద్ద రోడ్డు ప్రమాదం

### ముందు వెళుతున్న కారును వేగంగా ఢీకొన్న మరో కారు

తిరుపతి,ఫిబ్రవరి28 : చంద్రగిరి మండలం మామండూరు దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదం కన్నీళ్లు తెప్పించింది. రెండు కార్లు ఢీకొన్న యాక్సిడెంట్.. అత్యంత ఘోరంగా ఉంది. హైదరాబాద్ నుంచి అరుణాచలం వెళ్లి.. శివయ్య దర్శనం చేసుకుని తిరిగి మళ్లీ హైదరాబాద్ వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. మామండూరు జాతీయ రహదారిపై.. వేగంగా వెళుతున్న ఓ కారు.. ముందు వెళ్తున్న కారును ఢీకొట్టింది. ఆ సమయంలో హైదరాబాద్ కు చెందిన కారు పల్టీలు కొడుతూ.. రోడ్డుకు అవతలి వైపున పడింది. కారు పల్టీలు కొడుతూ వెళ్లటంతో.. కారులోని ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరు చనిపోయారు. వీళ్లిద్దరూ భార్యభర్తలు. వీరిని అశోక్, చంద్రకళగా గుర్తించారు పోలీసులు. మిగతా నలుగురిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. వాళ్లకు గాయాలు తీవ్రంగా ఉన్నాయని డాక్టర్లు స్పష్టం చేశారు. అరుణాచలం నుంచి తిరిగి హైదరాబాద్ వెళుతున్న సమయంలో ఈ యాక్సిడెంట్ అయినట్లు చెబుతున్నారు గాయపడిన బాధితులు. యాక్సిడెంట్ స్పాట్ భయానకంగా ఉంది.

## ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు

### వివిధ స్కూళ్లలో విద్యార్థుల ప్రదర్శనలు

కోనసీమ,ఫిబ్రవరి28 : ఆలమూరు మండల కేంద్రంలోని శ్రీ సిద్దార్థ పాఠశాలలో నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఏటా ఫిబ్రవరి 28న ఈ సైన్స్ దినోత్సవం జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ ఏడాది స్కిన్నోవా .26 పేరుతో ఈ సైన్స్ దినోత్సవం లో దయినందిన జీవితంలో విజ్ఞాన శాస్త్ర ప్రాధాన్యతను వివరించే విధంగా విద్యార్థులు వివిధ ప్రదర్శనలు ఏర్పాటు చేయడం ఆనందించదగ్గ విషయం అన్నారు. విద్యార్థిని విద్యార్థుల్లో సృజనాత్మక, తార్కిక మేధస్సును పెంపొందించే ఈ ప్రదర్శనలు నిర్వహించడం ఎంతో గర్వకారణం అన్నారు. ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త సర్ సివి రామన్ , రామన్ ఎఫెక్ట్ను కనుగొని భారతదేశానికి నోబెల్ బహుమతిని తీసుకువచ్చిన సందర్భంగా ఆయన గుర్తు చేస్తూ ఈ ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సైన్స్ నమూనాలు, ప్రదర్శనలను ఆయన ప్రారంభించారు. ఇందులో భాగంగా రాకెట్ నమూనా, ఎలక్ట్రిక్ బెల్, వాల్కనో, విండ్ మిల్, సబ్మెరైన్స్ మొదలైన ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ గుణశేఖర్, జెస్సి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే సర్ సివి రామన్ జయంతిని పురస్కరించుకొని మండలంలోని చెముడులంక నేతాజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సైన్స్ ఎగ్జిబిషన్ కరస్పాండెంట్ తుమ్మ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు వివిధ రకాల ప్రాజెక్టు వర్కులను తయారుచేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా విచ్చేసిన టిడిపి మండల క్లస్టర్ ఇంచార్జ్ నాగిరెడ్డి వెంకటరత్నం, నేతలు సిరంగుల సతీష్, నాగిరెడ్డి సత్యానందం, తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రాజెక్ట్ చక్కగా చేసుకుని వచ్చిన విద్యార్థులను వెంకటరత్నం అభినందించారు. అలాగే స్కూల్ కరస్పాండెంట్ తుమ్మ శ్రీనివాసరావు, స్కూల్ ఇన్చార్జులు దూలం స్వామి , ఎన్.కావ్య , సైన్స్ టీచర్స్ యు.శిరీష, కే.ఉషశ్రీ, జె.అజయ్, ఉపాధ్యాయులు విద్యార్థుల నైపుణ్యాన్ని కొనియాడుతూ ప్రశంసించారు. అనంతరం విజేతలను ఎంపిక చేసి బహుమతుల ప్రదానం చేశారు.

## బాణాసంచా ప్రమాద ఘటనపై జగన్ దిగ్భ్రాంతి

అమరావతి,ఫిబ్రవరి28 : కాకినాడ జిల్లా వేట్లపాలెం బాణాసంచా తయారీ కేంద్రంలో చోటు చేసుకున్న ఘోర అగ్ని ప్రమాదంపై వైసిపి అధ్యక్షుడు వైఎస్.జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన అత్యంత విషాదకరమన్న వైఎస్ జగన్.. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ప్రమాదంలో పలువురు కార్మికులు మృతి చెందడంపై వైఎస్.జగన్ ఆవేదన వ్య క్తం చేశారు. వేట్లపాలెం బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన భారీ పేలుడు ఘటనలో పలువురు కార్మికులు మృతి చెందడం తీవ్రంగా కలచివేసింది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నా. ప్రభుత్వం వెంటనే స్పందించి క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్యం అందించాలని వైఎస్ జగన్ సూచించారు.

## 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై చర్చ

### అధికారులకు దిశానిర్దేశం చేసిన సిఎం

### కాకినాడ ఘటనపై రేవంత్ దిగ్భ్రాంతి

హైదరాబాద్,ఫిబ్రవరి28 : సీఎం రేవంత్‌రెడ్డి శనివారం సచివాలయంలో వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై సమావేశంలో అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. మార్చి నుంచి జూన్ వరకు 99 రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎంఓ అధికారులు పాల్గొన్నారు. ఇదిలావుంటే కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలంలో బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు ఘటనపై సిఎం దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 23కి చేరింది. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## సూళ్లూరుపేట ఆర్‌డివో కార్యాలయంలో ఎసిబి సోదాలు


సూళ్లూరుపేట,ఫిబ్రవరి28 : సూళ్లూరుపేట రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో శనివారం అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ కార్యాలయంలో గత కొంతకాలంగా జరుగుతున్న అవినీతిపై వరుస ఫిర్యాదుల అందిన నేపథ్యంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఏసిబి అధికారులు పలు కీలక ఫైళ్లు, భూములకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నారు.అలాగే అధికారుల పనితీరుపై విచారిస్తున్నారు. రైతు వద్ద అడంగల్ లో పేరు మార్చేందుకు భారీ మొత్తంలో నగదు తీసుకుంటూ జూనియర్ అసిస్టెంట్ హేమంత్,సీనియర్ అసిస్టెంట్ సిరాజ్ లు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. పట్టుబడ్డ వారి నుండి 40,000 నగదును స్వాధీనం చేసుకున్నారు.

## శారద పీఠం భూములు కొనసాగింపు

### జలమండలికి కేటాయింపులు రద్దు

### అధికారులపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం

హైదరాబాద్,ఫిబ్రవరి28 : కోకాపేటలో శారదా పీఠానికి కేటాయించిన భూమిని పీఠానికే కొనసాగించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. పీఠం భూములు జల మండలికి కేటాయించిన నేపథ్యంలో అక్కడ సాగుతున్న నిర్మాణ పనుల విషయాలను పీఠం ప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు.




# దురంధర్ పార్ట్2 విడుదలకు సిద్ధం

బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో, స్టార్ దర్శకుడు ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన భారీ యాక్షన్ స్పై థ్రిల్లర్ 'ధురంధర్: ది రివేంజ్' విడుదలకు సిద్ధమవుతోంది. అయితే ఈ సినిమా రన్ టైమ్ వివరాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ సినిమా నిడివి 220 నిమిషాలుగా ఉన్నట్లు సమాచారం. అంటే ఈ చిత్రం దాదాపు 3 గంటల 40 నిమిషాల సుదీర్ఘ రన్ టైమ్‌తో ప్రేక్షకులను అలరించబోతుంది. మొదటి భాగం 3 గంటల 34 నిమిషాలు తో పోలిస్తే ఇది 6 నిమిషాలు ఎక్కువ ఉన్నప్పటికీ, ప్రస్తుత కాలంలో అత్యంత సుదీర్ఘమైన నిడివి కలిగిన చిత్రాల జాబితాలో ఇది ఒకటిగా నిలుస్తోంది. ఈ చిత్ర కథాంశం విషయానికి వస్తే, మొదటి భాగంలో గ్యాంగ్‌స్టర్ రెహ్మాన్ డకైట్‌ను అంతం చేసిన తర్వాత, హమ్జా అలీ మజారీ పాత్రలో రణవీర్ సింగ్ తన తదుపరి లక్ష్యమైన ఐఎస్ఐ వ్యూహకర్త 'బడే సాబ్' (మేజర్ ఇక్బాల్)ను ఎలా ఎదుర్కొన్నాడు అనే ఉత్కంఠభరితమైన అంశాలతో ఈ సీక్వెల్ సాగనుంది. రణవీర్ సింగ్‌తో పాటు ఈ చిత్రంలో సంజయ్ దత్, ఆర్. మాధవన్, అక్షయ్ ఖన్నా మరియు అర్జున్ రాంపాల్ వంటి దిగ్గజ నటులు కీలక పాత్రల్లో నటిస్తుండగా, సారా అర్జున్ కథానాయికగా నటించింది. ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. అదే రోజున కన్నడ స్టార్ యాష్ నటిస్తున్న 'టాక్సిక్' కూడా విడుదలవుతుండటంతో బాక్సాఫీస్ వద్ద ఈ రెండు భారీ చిత్రాల మధ్య గట్టి పోటీ నెలకొననుంది.




# హుషారు పిట్టలు నుంచి మంగళస్నానం పాట విడుదల

అన్ను మరియు వాసవి గణెళిషన్ జంటగా నటిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బిక్షు దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థలు ఏషియన్ సురేష్ ఫిల్మ్స్ విడుదల చేస్తుండటంతో ట్రేడ్ వర్గాల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన టీజర్‌కు భారీ స్పందన రాగా, తాజాగా ఈ చిత్రం నుంచి 'మంగళస్నానం' అనే హార్ట్ టచింగ్ ఎమోషనల్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. పాట ఒక తండ్రి తన కూతురిని ఎంత అల్లారుముద్దుగా పెంచుకుంటారో, ఆమెపై ఎంతటి ప్రాణాన్ని పెట్టుకుంటారో అద్భుతంగా ఆవిష్కరించింది. తండ్రీకూతుళ్ల మధ్య ఉండే విడదీయలేని అనుబంధానికి ఈ గీతం అద్దం పడుతోంది. ఎస్.ఎస్. చిరంజన్ హృద్యమైన సాహిత్యం అందించగా, యోగి సురేష్ మరియు విహా తమ గాత్రంతో ప్రాణం పోశారు. చరణ్ అర్జున్ అందించిన సంగీతం ఈ పాటకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. పాట విడుదల సందర్భంగా దర్శకుడు బిక్షు మాట్లాడుతూ.. 'తండ్రీకూతుళ్ల మధ్య ఉండే స్వచ్ఛమైన ప్రేమను ఈ పాటలో చూపించాం. ఈ సినిమా కేవలం యువతకే కాదు, తల్లిదండ్రులు కూడా చూడాల్సిన ఒక చక్కని కుటుంబ కథా చిత్రం. నా నిజ జీవితంలో నేను చూసిన యదార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమాను రూపొందించాను. యువతకు కావాల్సిన హుషారును ఇస్తూనే, ఒక సరికొత్త థ్రిల్‌ను ఈ సినిమా పంచుతుంది' అని తెలిపారు. నిర్మాత వెంకట్ యాదవ్ మాట్లాడుతూ.. 'సినిమా ప్రథమార్థం అంతా యూత్‌ఫుల్ కంటెంట్‌తో ఎంటర్‌టైన్ చేస్తే, ద్వితీయార్థంలో ఒక మెచ్యూర్డ్ పాయింట్ ఉంటుంది. సమాజంలో బాధ్యతాయుతమైన విషయాన్ని వినోదాత్మకంగా చెప్పే ప్రయత్నం చేశాం. ప్రతి ఒక్కరూ ఈ సినిమా చూశాక ఒక బాధ్యతను గుర్తిస్తారు. నటీనటులందరూ చాలా సహజంగా నటించారు. కచ్చితంగా ఇది పెద్ద విజయం సాధిస్తుందనే నమ్మకం మాకుంది' అని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రంలో అన్ను, వాసవి గణెళిషన్‌లతో పాటు గోవర్ధన్, సునీత్ మనోహర్, రమేష్, బలగం బాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.





# వెంకటప్పనాయుడుగా మోహన్ బాబు

కలెక్షన్ కింగ్ డాక్టర్ మోహన్ బాబు మరోసారి వెండితెరపై తన గంభీరమైన నటనతో అలరించబోతున్నారు. అజయ్ భూపతి దర్శకత్వంలో 'శ్రీనివాస మంగపురం' అనే క్రేజీ ప్రాజెక్ట్ రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో మోహన్ బాబు పోషిస్తున్న 'వెంకటప్పయ్య నాయుడు' పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం నేడు విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో మోహన్ బాబు లుక్ ఎంతో పవర్ ఫుల్ గా, రాజసంతో ఉట్టిపడుతోంది. గర్వం, ధైర్యం కలగలిసిన ఒక గంభీరమైన పాత్రలో ఆయన కనిపించబోతున్నారని చిత్ర యూనిట్ పేర్కొంది. 'మహాసముద్రం', 'మంగళవారం' వంటి సినిమాలతో తనకంటూ ఒక ప్రత్యేక శైలిని ఏర్పరచుకున్న దర్శకుడు అజయ్ భూపతి, మోహన్ బాబును ఒక సరికొత్త కోణంలో చూపించబోతున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంతో సూపర్ స్టార్ కృష్ణ మనవడు, రమేష్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని వెండితెరకి పరిచయం కాబోతుండగా.. బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాశా థడాని హీరోయిన్‌గా నటిస్తుంది. ప్రముఖ నిర్మాతలు అశ్వినీదత్, జెమిని కిరణ్ ఈ చిత్ర నిర్మాణంలో పాలుపంచుకుంటున్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ ఈ సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నాడు.




# స్పిరిట్ నుంచి వివేక్ ఒబెరాయ్ లుక్ విడుదల

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న హై రేంజ్ యాక్షన్ థ్రిల్లర్ 'స్పిరిట్'పై అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. తాజాగా చిత్రబృందం విడుదల చేసిన విలన్ ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబేరాయ్ ఈ చిత్రంలో ప్రతినాయకుడిగా నటిస్తున్న సంగతి తెలిసిందే. 'వన్ బ్యాడ్ హ్యాబిట్ ఇన్ స్పిరిట్ మోడ్' అనే ట్యాగ్‌తో విడుదల చేసిన పోస్టర్‌లో వివేక్ ఓబెరాయ్ నోట్లో సిగార్‌తో పవర్‌ఫుల్ యాక్షన్ లుక్‌లో కనిపించారు. పోస్టర్‌ను బట్టి ఆయన ఓ డాన్ పాత్రలో కనిపించనున్నట్లు అర్థమవుతోంది. అయితే అదే పోస్టర్‌లో వివేక్ పక్కన కనిపించిన యువతి ఎవరు? అనే చర్చ సోషల్ మీడియాలో మొదలైంది. ఆమె పేరు ఐశ్వర్య దేశాయ్. యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్ నుంచి మార్కెటింగ్‌లో డిగ్రీ పూర్తి చేసిన ఇండో-అమెరికన్ నటి. బాలీవుడ్ చిత్రం 'గల్లీ బాయ్'లో నటించిన ఆమె, 'ర్యాట్ ఇన్ ద కిచెన్' అనే షార్ట్ ఫిల్మ్‌తో మంచి గుర్తింపు పొందారు. ఆ చిత్రానికి ఉత్తమ సహాయ నటిగా అవార్డు కూడా అందుకున్నారు. ఇప్పుడు 'స్పిరిట్' చిత్రంతో తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. పోస్టర్‌లో వివేక్‌తో కలిసి కనిపించడం వల్ల సినిమాలో ఆమెకు కీలక పాత్ర ఉన్నట్టు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఒక్క పోస్టర్‌తోనే ఆమెకు మంచి క్రేజ్ వచ్చింది. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన త్రిప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, లుక్స్ ప్రేక్షకుల్లో గూస్‌బంప్స్ తెప్పించాయి. విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ కీలకపాత్ర పోషిస్తుండగా, సీనియర్ నటి కాంచన కూడా ప్రధాన పాత్రలో కనిపించనున్నారు.




# మార్చి 6న మృత్యుంజయ విడుదల

టాలీవుడ్ వెర్సటైల్ యాక్టర్ శ్రీవిష్ణు, రెబా మోనికా జాన్ జంటగా నటిస్తున్న ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ థ్రిల్లర్ 'మృత్యుంజయ' ట్రైలర్ తాజాగా విడుదలై ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచుతోంది. 'మ్యాన్ ఆఫ్ మాసెస్' జూనియర్ ఎన్టీఆర్ ఈ చిత్ర ట్రైలర్‌ను డిజిటల్ ప్లాట్‌ఫామ్ వేదికగా విడుదల చేసి చిత్ర యూనిట్‌కు ఆల్ ది బెస్ట్ చెప్పారు. సుకుమార్ శిష్యుడు శ్రీ హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో శ్రీవిష్ణు క్రైమ్ బ్యూరోలో ఉద్యోగం సంపాదించలేకపోయినా, తన టాలెంట్‌తో ఒక సంక్లిష్టమైన మిస్టరీని ఛేదించే ఇన్వెస్టిగేటివ్ ఆఫీసర్‌గా పవర్‌ఫుల్ పాత్రలో కనిపించబోతున్నాడు. 'సామజవరగమన' వంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత శ్రీవిష్ణు, రెబా మోనికా జాన్ కాంబినేషన్లో వస్తున్న రెండో సినిమా కావడంతో దీనిపై మంచి క్రేజ్ నెలకొంది. కాళ భైరవ సంగీతం, లెజెండరీ ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్ పనితనం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఇప్పటికే 'విష్ణు విన్యాసం' సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న శ్రీవిష్ణు, వారం రోజుల వ్యవధిలోనే మార్చి 6న 'మృత్యుంజయ'తో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. సందీప్ గుణ్ణం, వినయ్ చిలకపాటి నిర్మించిన ఈ చిత్రం సస్పెన్స్ థ్రిల్లర్ ప్రియులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందని చిత్ర బృందం ధీమా వ్యక్తం చేస్తోంది

# విష్ణు విన్యాసం మూవీ లీక్

## అందుకే త్వరగా విడుదల చేశాం

'విష్ణు విన్యాసం' మూవీ లీక్ అవడం వల్ల చాలా విషయాలు జరిగాయని అందుకే వారం గ్యాప్‌తో తన రెండు సినిమాలు విడుదల చేయాల్సి వచ్చిందని శ్రీవిష్ణు తెలిపారు. ఆయన కథానాయకుడిగా యదునాథ్ మారుతీరావు దర్శకత్వంలో రూపొందిన కామెడీ ఎంటర్‌టైనర్ ఇది. నయన్ సారిక కథానాయిక. తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ మూవీ చక్కటి వినోదాన్ని పంచుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీవిష్ణు మాట్లాడారు. 'సినిమా లీక్ అవడం వల్ల షూటింగ్ హడావుడిగా అయిందన్నారు. స్క్రిప్ట్‌లో ఏమైనా మార్పులు చేశారా' అని అడగ్గా, 20 రోజుల పనిని ఏడు రోజుల్లో రాత్రి, పగలూ విరామం లేకుండా చేయాల్సి వచ్చింది. టీమ్ అంతా సహకారం అందించారు. అలా చేస్తేనే ఈ టైమ్‌కు రాగలిగాం. పూర్తి ప్లానింగ్ లేకుండా ప్రచార కార్యక్రమాలు మొదలుపెట్టాల్సి వచ్చింది. దానివల్లే రెండు సినిమాలు ఒకదాని తర్వాత ఒకటి వచ్చాయి. చెన్నై నుంచి ఈ సినిమాను లీక్ చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేశాం. దీనిపై కేసు నడుస్తోంది. మా నిర్మాతని బ్లాక్ మెయిల్ చేశారు. ఆయనను బెదిరిస్తూ వాళ్లు పెట్టిన సందేశాలు, ఛాంబర్‌కు మేము చేసిన ఫిర్యాదులు అన్నీ మా దగ్గర ఉన్నాయి. భవిష్యత్‌లో ఇలాంటి సమస్యలు రాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై చర్చించాలి. ప్రతి రీల్‌కు నిర్మాతను బ్లాక్ మెయిల్ చేశారు. విడుదల ముందురోజు వరకూ ఇదంతా జరిగింది.మా యూనిట్ నుంచే తెలియకుండా సన్నివేశాలు వెళ్లిపోయాయి. మాకు సినిమా క్లిప్‌లను పంపిన నెంబర్‌ను ట్రేస్ చేశాం. ఆ తర్వాత ఛాంబర్‌లో ఫిర్యాదు చేశాం. చాలా మానసిక క్షోభ అనుభవించాం. పరిస్థితి అదుపు తప్పడంతోనే మిగిలిన షూటింగ్ వేగంగా పూర్తి చేసి, ఈ సినిమాను తీసుకురావాల్సి వచ్చింది. అంతేకానీ, 'మృత్యుంజయ్' మూవీకి పోటీగా దీన్ని విడుదల చేయాలన్న ఉద్దేశం మాకు లేదు. ఆ చిత్ర నిర్మాత పరిస్థితిని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నా అని అన్నారు.




Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com